ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 07.04.2025 | సంపుటి : 11 సంచిక : 258 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## సన్నబియ్యం లబ్ధిదారులతో
# సీఎం రేవంత్ భేటి

సన్నబియ్యం ఎలా ఉన్నాయి?.. 200 యూనిట్ల ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్ అందుతున్నాయా?

బస్సు ప్రయాణం, సన్నబియ్యంపై ముఖ్యమంత్రి ఆరా..



భద్రాచలంలోని ఓ సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



పేదవాడి ఇంట కంచంలో సన్నబియ్యం.. కళ్లల్లో ఆనందం..స్వయంగా రుచిచుశానని వెల్లడి

**భద్రాచలం(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. బూర్గంపాడు మండలం సారపాకలో ఉంటున్న బూరం శ్రీనివాస్ ఇంటికి వెళ్లి భోజనం చేశారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల కూడా భోజనం తిన్నారు. అనంతరం ఆ కుటుంబం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం ఎలా ఉన్నాయంటూ ముఖ్యమంత్రి ఆరా తీశారు. దొడ్డు బియ్యం పంపిణీ చేసిన ప్పుడు అసలు తీసుకునేందుకు ఆసక్తి చూపేవాళ్లం కాదని లబ్ధిదారుడు రేవంత్ రెడ్డికి తెలిపారు. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలు అందుతున్నాయా లేదా అని ముఖ్యమంత్రి ఆరా తీశారు. సీఎంను చూడటానికి వచ్చిన మహిళలు ఉచిత బస్సు ప్రయాణం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. మిగతా 2లో..



## రాములోరి కల్యాణానికి సీఎం దంపతుల పట్టు వస్త్రాలు

**భద్రాచలం(జనంసాక్షి):**శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. అభిజిత్ లగ్నంలో శ్రీరామచంద్రమూర్తి సీతమ్మవారి మెడలో మాంగళ్య ధారణ చేశారు. మిథిలా మైదానంలో ఈ కల్యాణ క్రతువును ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మిగతా 2లో..

## వల్మిడి రామాలయంలో అపశృతి

సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా కూలిన టెంట్లు .. పలువురికి తీవ్ర గాయాలు



లోపలి పేజీల్లో..

## కృష్ణా,గోదావరి నీటివాటాల్లో
# అన్యాయం

బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ఎదుట నేనే స్వయంగా హాజరవుతా



ప్రాజెక్టుల ప్రస్తుతస్థితిపై న్యాయవాదులు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తున్న మంత్రి ఉత్తమ్

- న్యాయవాదుల బృందానికి సంపూర్ణ సహకారం
- వక్రీకృత నీటి కేటాయింపుల వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతోంది
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోం
- అంతరాష్ట్ర జలవివాదాలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ : మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్(జనంసాక్షి):**కృష్ణా, గోదావరి జలాలపై విచారణకు బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై న్యాయవాదులు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ ఆదివారం చర్చలు జరిపారు.కృష్ణా జలాల వివాదాలపై వాదనలు వినిపిస్తున్న న్యాయబృందంతో చర్చించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న విచారణ అంశాలపై ఆరా తీశారు. వాదనలు వినిపిస్తున్న న్యాయ బృందానికి పూర్తి సహకారం ఇస్తామన్న ఆయన.. వక్రీకృత నీటి కేటాయింపుల వల్ల తెలంగాణ ప్రజలు నష్టపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోబోమని తేల్చి చెప్పారు. కృష్ణా, గోదావరి జలాశయాలలో తెలంగాణా కేటాయింపులకై న్యాయస్థానలలో రాష్ట్రం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల బృందానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల సలహాదారు ఆదిత్యా దాస్ నాథ్,ఇ.ఎన్.సి లు అనిల్ కుమార్,విజయ భాస్కర్ రెడ్డి,సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్య నాథన్ తదితరులు పాల్గొన్నారు. ఇంతకు ముందు కృష్ణా ట్రిబ్యునల్ 2 ఎదుట జరిగిన వాదనలను పూర్తిగా సమీక్షించడంతో పాటు ఏప్రిల్ 15,16 తేదీలలో ట్రిబ్యునల్ ముందు లెవనెత్తాల్సిన అంశాలపై సమగ్రంగా చర్చించి ముందస్తు వ్యూహాన్ని రూపొందించుకున్నారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మిగతా 2లో..

## సీపీఎం నూతన సారథిగా
# ఎం.ఏ బేబీ

85మందితో కేంద్రకమిటీ ఎన్నిక

**చెన్నై(జనంసాక్షి):**ప్రముఖ వామపక్ష పార్టీ సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శిగా కేరళ మాజీ మంత్రి ఎం.ఎ.బేబీ ఎన్నికయ్యారు. తమిళ నాడులోని మదురైలో జరిగిన సీపీఎం 24వ మహాసభల్లో ఆయన్ను కొత్త సారథిగా ఎన్నుకున్నారు.గతేడాది సీతారాం ఏచూరి మృతి అనంతరం ప్రధాన కార్యదర్శి పదవి ఖాళీగా ఉంది. దీంతో పార్టీ తాత్కాలిక సమన్వయకర్తగా సీనియర్ నేత ప్రకాశ్ కారాట్ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో మదురైలో జరిగిన మిగతా 2లో..





## జాతీయ రహదారి ప్రాజెక్టులకు సహకరించండి

నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి.. సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్(జనంసాక్షి):కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. రాష్ట్రంలోని వివిధ జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన మిగతా 2లో..



## భాజపానే సన్నబియ్యం ఇస్తే.. దేశం మొత్తం ఎందుకు అమలుకావట్లేదు ?

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వమే సన్నబియ్యం పంపిణీ చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఖండించారు.సన్నబియ్యం భాజపానే ఇస్తే.. దేశం మొత్తం ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. బండి సంజయ్ తీరుపై ఆయన మండిపడుతూ.. ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌లో రోజురోజుకీ అభద్రతా భావం పెరుగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తెలిపారు.''సొంత పార్టీలో గుర్తింపు కోసం, రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బండి సంజయ్ ఆరాటపడుతున్నారు. ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించకపోవడం విడ్డూరం. సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టు వల్లే బీసీ రిజర్వేషన్లు, మిగతా 2లో..

## పాంబన్ రైల్వేవంతెనను ప్రారంభించిన ప్రధాని

జాతికి అంకితం చేసిన మోదీ • కార్యక్రమానికి స్టాలిన్ గైర్హాజరు



రాష్ట్రానికి నిధులు కుమ్మరిస్తున్నా నిరాశే..

డీఎంకే ప్రభుత్వంపై ప్రధాని మోదీ పరోక్ష విమర్శలు

**చెన్నై(జనంసాక్షి):** భారత ప్రధాన భూభాగాన్ని రామేశ్వరంతో కలుపుతూ ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పాంబన్ వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన ఇది. సముద్రంలో 2.08 కి.మీ. పొడవు ఉండే ఈ వంతెన దిగువన ఓడల రాకపోకలకు వీలుగా కీలకమైన వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో రూ.535 కోట్లతో దీన్ని నిర్మించారు. 2019 మార్చి 1న ప్రధాని మోదీ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, 2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) పనులు చేపట్టి, నాలుగేళ్లలో పూర్తిచేసింది. ఈ క్రమంలోనే రామేశ్వరం – తాంబరం ప్రత్యేక రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇది కొత్త వంతెన మీదుగా పరుగులు తీసింది. రైల్లో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు సందడి చేశారు. అదేవిధంగా వంతెన కిందుగా ప్రయాణించిన కోస్ట్ గార్డ్ నౌకకూ పచ్చజెండా ఊపారు. రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, తమిళనాడు ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మోదీ రూ.8,300 కోట్ల మిగతా 2లో..



## కంచ గచ్చిబౌలి భూములపై మా పోరాటం కొనసాగుతుంది

కేటీఆర్ బహిరంగ లేఖ

విద్యార్థుల పోరాటాన్ని ప్రభుత్వం తక్కువచేసి చూపే కుట్ర చేస్తోందని ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):**భవిష్యత్ తరాల కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేసిన అద్భుతమైన పోరాటంపై కాంగ్రెస్ ప్రభుత్వం అపవాదులు వేస్తూ, బెదిరింపులకు దిగుతున్న సందర్భంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు, పర్యావరణ కార్యకర్తలకు, ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు 400 ఎకరాల కంచె గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు నిస్వార్థంగా, ఉదాత్తమైన లక్ష్యాలతో చేపట్టిన ఆందోళన అద్భుతమని, పర్యావరణం కోసం మిగతా 2లో..

## సుంకాల పెంపుపై ట్రంప్‌కు
# నిరసన సెగ



అమెరికావ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు




**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య నిర్ణయాలపై ఆ దేశంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల కోత, ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ప్రభావం, మానవ హక్కులు, ఇతర అంశాలపై ట్రంప్‌తోపాటు బిలియనీర్ మస్క్ చర్యలపై అమెరికన్‌లు మండిపడుతున్నారు. ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ శనివారం వేల మంది నిరసనకారులు నార్త్ కరోలినాలోని షాలెట్, మస్సాచుసెట్స్‌లోని బోస్టన్, వాషింగ్టన్ డీసీ సహా పలుచోట్ల భారీ నిరసనలు చేపట్టారు.'హ్యాండ్స్ ఆఫ్' పేరిట నిర్వహించిన ఈ నిరసనల్లో 150కి పైగా గ్రూపులుగా 1200 మంది పాల్గొన్నారు. ఆందోళనకారుల్లో పౌర హక్కుల సంస్థల ప్రతినిధులు, కార్మిక సంఘాలు, ట్రాన్స్ జెండర్లు, న్యాయవాదులు, దివ్యాంగులు, నిపుణులు ఉన్నారు. ట్రంప్ ప్రభుత్వం నిర్ణయాలు సరిగాలేవని, ప్రజల అవసరాలతో పనిలేకుండా వ్యవహరిస్తోందని నిరసనకారులు మండిపడ్డారు. ట్రంప్ ప్రభుత్వం సరైన దిశలో నడవట్లేదని, భారీగా ఉద్యోగాల కోత వల్ల అమెరికాలో సేవలు, వనరులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. మిగతా 2లో..

## అమెరికాలో అగ్ని ప్రమాదం

ఆంధ్రా, తెలంగాణ విద్యార్థులకు తృటిలో తప్పిన అపాయం

అమెరికాలోని బర్మింగ్‌హామ్ నగరంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కెల్లామ్ స్ట్రీట్‌లోని అపార్ట్‌మెంట్‌లో సంభవించిన ఈ ప్రమాదం నుంచి పది మంది తెలుగు విద్యార్థులు తృటిలో ప్రాణాలతో బయట పడ్డారు. శనివారం సాయంత్రం సమయంలో జరిగిన ఈ ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది



లోపలి పేజీల్లో..



## దీక్ష విరమించిన దల్లేవాల్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలోని అన్నదాతల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను నేడు విరమించారు.పంటలకు కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన హామీతో పాటు పలు డిమాండ్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గతేడాది నవంబర్ 26న ఆయన ఈ దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దానిని విరమించుకోవాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, మిగతా 2లో..

## అమెరికా పట్టించుకోదు.. రష్యా యుద్ధం ముగించదు

ఇరు దేశాల తీరుపై అసహనం వ్యక్తం చేసిన జెలెన్‌స్కీ

కీవ్‌నగరంపై దాడులపై యూఎస్‌ఎంబసీ వ్యాఖ్యలు పేలవం

యుద్ధంలో చిన్నారులు చనిపోతున్నారంటూ ఆవేదన



**కీవ్(జనంసాక్షి):**ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రైవీరిపై శుక్రవారం రష్యా క్షిపణి దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఆట స్థలం సమీపంలో జరిగిన ఈ దాడుల్లో తొమ్మిది మంది చిన్నారులు సహా మొత్తం 18 మంది మరణించారు.ఈ ఘటనపై ఉక్రెయిన్ లోని అమెరికా రాయబార కార్యాలయం స్పందించిన తీరుపై జెలెన్‌స్కీ అసహనం వ్యక్తం చేశారు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ భావోద్వేగ పోస్టు పెట్టారు. ఉక్రెయిన్‌లోని అమెరికా రాయబారి బ్రిడ్జెట్ బ్రింక్ క్రైవీరిలో జరిగిన దాడిపై ఒక పోస్టు పెట్టారు. ఆటస్థలంలో జరిగిన దాడి తనను భయాందోళనకు గురిచేసిందన్నారు. అందుకే త్వరగా యుద్ధం ముగించాలని పిలుపునిచ్చారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందించారు. ''క్రైవీరిపై జరిగిన దాడి విషయంలో అమెరికన్ ఎంబసీ స్పందన మిగతా 2లో..

# కంచ గచ్చిబౌలి భూములపై మా పోరాటం కొనసాగుతుంది

విద్యార్థులు చేస్తున్న పోరాటానికి కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.ప్రభుత్వం విద్యార్థుల పోరాటాన్ని తక్కువ చేసి చూపాలన్న కుట్రతో అనేక అపవాదులు వేస్తున్నా, నిస్వార్థమైన విద్యార్థి-ప్రజా పోరాటాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయని తన లేఖలో పేర్కొన్నారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు అందించేందుకు విద్యార్థులు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం దీనికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ దళారి మాదిరి ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచె గచ్చిబౌలి వేలాన్ని పూర్తిగా విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ కోసం, బెదిరింపు ధోరణిలో ఏకో పార్క్ ఏర్పాటు అంటూ, ఫోర్ట్ సిటీకి సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నాయకుడి వరకూ పక్కా కుట్రతో మాట్లాడుతున్న మాటలను కేటీఆర్ తన లేఖలో ఎండగట్టారు. 50 సంవత్సరాలకు పైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని, కాంగ్రెస్ పార్టీ ప్రాపగండ చేస్తున్న ఏకో పార్క్ కన్నా గొప్పగా పర్యావరణ సమతుల్యత కలిగిన క్యాంపస్‌గా నిలిచిందని కేటీఆర్ తెలిపారు.విద్యార్థుల పోరాటం ఫలించి సుప్రీంకోర్టు ప్రభుత్వం చేసిన పర్యావరణ హత్యను అడ్డుకున్నదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రల నేపథ్యంలో ఈ పోరాటం పూర్తిగా అయిపోలేదని కేటీఆర్ తన లేఖలో తెలిపారు. 400 ఎకరాల పర్యావరణాన్ని కాపాడేందుకు పోరాటం ఇంకా మిగిలి ఉందని, ప్రభుత్వ కుట్రలను, బెదిరింపులను, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలియజేశారు. ఈ పోరాటానికి విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు, తెలంగాణ ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఇప్పటికే మా పార్టీ తరఫున 400 ఎకరాల పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ తెలియజేశారు. ప్రకృతికి విఘాతం కలగకుండా, యూనివర్సిటీకి ప్రమాదం రాకుండా బి ఆర్ ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల స్ఫూర్తిని, విద్యార్థుల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని, పర్యావరణం కోసం 400 ఎకరాలను వేలం వేసే ప్రయత్నాన్ని పూర్తిగా విరమించుకుంటున్నట్లు వెంటనే ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అప్పటిదాకా ప్రస్తుత పోరాటాన్ని కొనసాగిద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# సీపీఎం నూతన సారథిగా ఎం.ఎ బేబీ

సీపీఎం 24వ మహాసభలు నేటితో ముగిశాయి. ఈ మహాసభ 85మంది సభ్యులతో పార్టీ కేంద్ర కమిటీని ఎన్నుకుంది. నూతన కేంద్ర కమిటీ.. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీని, 18 మందితో కొత్త పొలిట్‌బ్యూరోను ఎన్నుకుంది. కేంద్రకమిటీలో 20శాతం మంది మహిళలే ఉండటం విశేషం. సీపీఎం ప్రధాన కార్యదర్శి పదవి రేసులో సీనియర్ నేతలు ఎం.ఎ.బేబీ, అశోక్ ధవలే, మహమ్మద్ సలీం, బి.వి.రాఘవులు, బృందా కారాట్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. అయితే.. పార్టీలో ఓ వర్గం ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడైన అశోక్ ధవలేకు మద్దతు ఇచ్చినట్లు సమాచారం.1954లో కేరళలోని ప్రాక్కుళంలో పి.ఎం.అలెగ్జాండర్, లిల్లీ అలెగ్జాండర్ దంపతులకు ఎం.ఎ.బేబీ జన్మించారు. విద్యార్థి దశలో కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ప్రస్తుతం ఎస్ఎఫ్ఐ)లో చేరికతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలలో పలు స్థాయిల్లో పోరాటాల్లో చురుగ్గా పనిచేశారు. 1986 నుంచి 1998 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆతర్వాత కుందర నియోజకవర్గం నుంచి 2006 నుంచి 2016వరకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలోనే 2006 నుంచి 2011వరకు కేరళ విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు. 2012 నుంచి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఎంఏ బేబీకి భార్య బెట్టీ లూయిస్, తనయుడు అశోక్ బెట్టీ నెల్సన్ ఉన్నారు.

# జాతీయ రహదారి ప్రాజెక్టులకు సహకరించండి

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మరో 2500 కిలోమీటర్లకుపైగా జాతీయ రహదారులను నిర్మించిందన్నారు. ఇది రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ నిబద్ధతను సూచిస్తుందన్నారు.ప్రస్తుతం రూ. 12,619 కోట్ల వ్యయంతో 691.52 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న లేదా నిర్మించబడుతున్న 16 జాతీయ రహదారి ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని కిషన్ రెడ్డి తన లేఖలో తెలిపారు. ఈ ప్రాజెక్టులకు మొత్తం 1,550.529 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇప్పటి వరకు 904.097 హెక్టార్ల భూమినే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్వాధీనం చేసిందని.. ఇంకా 646.432 హెక్టార్లు మిగిలిన ఉన్నాయని వెల్లడించారు.ఇలాంటి ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర వ్యాప్తంగా రవాణా వ్యవస్థ మెరుగుపడి.. పారిశ్రామికాభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 32 జిల్లాలను జాతీయ రహదారులతో అనుసంధించిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చొరవ చూపి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణాలను గడువులోకా పూర్తి చేసేలా సహకరించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన లేఖలో కోరారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చొరవ చూపి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణాలను గడువులోకా పూర్తి చేసేలా సహకరించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన లేఖలో కోరారు. భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు కేంద్రమంత్రి, తెలంగాణ పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి. పార్టీ ద్వారా భరతమాతకు సేవ చేయడంలో తమ జీవితాలను త్యాగం చేసిన పార్టీ వ్యవస్థాపక సభ్యులకు, కోట్లాదిమంది నిస్వార్థ కార్యకర్తలకు నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఎంతో వినయపూర్వకంగా తన ప్రస్థానాన్ని ప్రారంభించడం మొదలుకొని ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించడం వరకు, భారతీయ జనతా పార్టీ అంకిత భావంతో కష్టపడి పని చేసే తన కార్యకర్తల కృషితో జాతి నిర్మాణ ప్రయాణాన్ని అధిగమించింది. ఎంతో ముఖ్యమైన ఈ వేడుకను పురస్కరించుకుని, వికసితభారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి మనమంతా సంకల్పాన్ని తీసుకుందాం అని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పండగపూట విషాదం

**- కృష్ణా నదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతి**

**- కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామంలో ఘటన**

**అవనిగడ్డ(జనంసాక్షి):** కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరామనవమి సందర్భంగా కృష్ణా నదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతి చెందారు.ఆదివారం ఉదయం మత్తి వెంకట గోపి కిరణ్(15), ఎం. వీరబాబు(15), ఎం. వర్ధన్(16) స్నానానికి నదిలోకి దిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. డీఎస్పీ విద్యాశ్రీ ఆధ్వర్యంలో సీఐ యువ కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.





# రాములోరి కల్యాణానికి సీఎం దంపతుల పట్టు వస్త్రాలు

దీంతో భద్రాచలం వీధులన్నీ రామ నామస్మరణతో మార్మోగాయి. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తన సతీమణి గీతతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివారికి రాష్ట్రప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాంగణమంతా రామ నామస్మరణతో మార్మోగింది. తితిదే తరఫున ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రెవెన్యూ గృహ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖా జౌళి సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మధ్య ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరహరి, నల్గొండ, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలం, పినపాక, సత్తుపల్లి, వైరా, ఇల్లందు, కొత్తగూడెం శాసనసభ్యులు, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్య పల్లి నందా, ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్, ఖమ్మం కొత్తగూడెం జిల్లాల న్యాయమూర్తులు రాజగోపాల్, వసంత పాటిల్, భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి వచ్చే భక్తులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగా ఎస్పి రోహిత్ రాజ్ నేతృత్వంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వేసవి కావడంతో ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కళ్యాణ ప్రాంగణంలోని అన్ని సెక్టార్లలో పొగ మంచు సౌకర్యాన్ని తొలిసారిగా భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఇదే సమయంలో ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు.

# కృష్ణా,గోదావరి నీటివాటాల్లో అన్యాయం

- న్యాయవాదుల బృందానికి సంపూర్ణ సహకారం అందిస్తా
- వక్రీకృత నీటి కేటాయింపుల వల్ల తెలంగాణకు తీవ్రనష్టం
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోం
- అంతరాష్ట్ర జలవివాదాలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్ ప్రత్యేక చొరవ

-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




అనంతరం కృష్ణా జలాశయా లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి,న్యాయబ ద్ధంగా తెలంగాణా రావాల్సిన నీటి కేటాయింపులు వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పూర్తి స్థాయిలో వివరించారు.అందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పంది స్తూ న్యాయబద్ధంగా తెలంగాణాకు రావాల్సిన నీటి కేటా యింపులపై బలమైన వాదనలు వినిపించేందుకు మార్గదర్శ నం చేశారు.దశాబ్దాలుగా సాగునీటి మీద ఆధారపడి సేద్యం చేస్తున్న రైతాంగం నీటి కొరతతో ఆత్మక్షోభకు గురయ్యారని అటువంటి అన్యాయలను సరిదిద్దేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారుఅదే సమయంలో కృష్ణా ట్రిబ్యునల్ 2 ముందు వాదనలకు అవసరమైన సమగ్రమైన సమాచారాన్ని అందించడంతో పాటు ఢిల్లీలో ఉన్న బృందంతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారుఅంతే గాకుండా రాష్ట్రానికి సంబంధించిన వరకు వివిధ న్యాయ స్థానాలలో పెండింగ్ లో ఉన్న కేసులు,అప్పీల్స్ వాటి వాటి ప్రస్తుత స్థితి ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని ఆయన అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అంతర్ రాష్ట్ర జల వివాదాలను పరిష్కరించెదికు ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



# సంక్షేమపథక లబ్దిదారులతో సీఎం భేటి

ఈ అనుభ వంపై సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియాలో స్పందిం చారు. పేదవాడి ఇంట కంచంలో సన్నబియ్యం... కళ్లల్లో ఆనందం... స్వయంగా రుచిచూ శానని భావోద్వేగ భరితంగా వివరించారు. సారపాకలో... స్వయంగా లబ్ధిదారుల ఇంట సహపంక్తి భోజనం చేసి పథకం అమలును స్వయంగా పరిశీలించానని ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు.

# భాజపానే సన్నబియ్యం ఇస్తే.. దేశం మొత్తం ఎందుకు అమలుకావట్లేదు ?

ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం లభించింది. హెచ్‌సీయూ అంశం ఉన్నత న్యాయస్థానం పరిధిలో ఉంది. రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ హెచ్‌సీయూపై మాట్లాడటం సమంజసం కాదు"అని ప్రకటనలో పేర్కొన్నారు.

# దీక్ష విరమించిన దల్లేవాల్

కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి రణ్‌వీత్‌సింగ్ బిట్టు విజ్ఞప్తి చేసిన మరుసటి రోజు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని సిర్హింద్‌లో నిర్వహించిన 'కిసాన్ మహా పంచాయత్'లో నిరవధిక నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు దల్లేవాల్ ప్రకటించారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'ఆమరణ నిరాహార దీక్ష విరమించాలని మీరంతా నన్ను కోరారు. ఈ ఉద్యమాన్ని జాగ్రత్తగా నడిపినందుకు మీకు రుణపడి ఉంటాను. మీ సెంటిమెంట్లను నేను గౌరవిస్తూ.. మీ ఆదేశాలను పాటిస్తున్నా" అని వ్యాఖ్యానించారు.సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) కలిసి ఏర్పాటు చేసిన వేదికలో కీలక నేతగా ఉన్న జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ కేంద్రం తమ డిమాండ్లను అంగీకరించాలని కోరుతూ గతేడాది నవంబర్ 26న నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం జనవరిలో రైతులను చర్చలకు ఆహ్వానించడంతో దీక్ష చేపట్టిన స్థలంలోనే వైద్య సాయం తీసుకొనేందుకు ఆయన అంగీకరించారు. కానీ, తన నిరాహార దీక్షను మాత్రం కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే శనివారం కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ట్వీట్ చేశారు. కేంద్రంతో రైతు సంఘాల ప్రతినిధుల చర్చలు కొనసాగుతున్నాయని.. మే 4న ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# తెలంగాణలో బుల్లెట్ బండి బ్యాన్..?

**రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం..!**

**హైదరాబాద్(జనంసాక్షి):** తరాలు మారినా క్రేజ్ మారనివి కొన్ని ఉంటాయి. వాటిలో బుల్లెట్ బండి ఒకటి. నాటి నుంచి నేటి వరకూ ఈ బండిపై ప్రేమ మాత్రం తగ్గలేదు. బుల్లెట్ పై డుగ్.. డుగ్.. అంటూ రూడ్లపై షికార్లు కొట్టాలని యువత కల. నీ బుల్లెట్ బండెక్కి వచ్చేత్తపా డుగ్..డుగ్..డుగ్ అని.. అంటే మాత్రం ఈసారి కుదరదు. అవును.. కొంత మంది ఆకతాయిలు బండి ఎక్కువగా శబ్ధం రావాలి.. అందరూ చూడాలని డుగ్.. డుగ్..?మని శబ్దం వచ్చే పెద్ద పెద్ద సైలెన్సర్ ను బిగిస్తున్నారు. బండి షోరూం వాడు ఇచ్చే సైలెన్సర్‌లు కాకుండా అధిక శబ్ధం వచ్చేలా వాటి స్థానంలో ఈ సైలెన్సర్లను బిగిస్తున్నారు. దీంతో వారు రోడ్డు మీద బండిపై వెళ్లేటప్పుడు చుట్టుపక్కల వాళ్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బుల్లెట్‌బండి నుంచి వచ్చే శబ్ధంతో చిన్నారులు.. వృద్ధులకు ముప్పు పొంచి ఉంది. రహదారులపై వెళ్లే సమయంలో బుల్లెట్ నుంచి వచ్చే అధిక శబ్ధంతో ఇతర వాహనదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు నడిపే ఇతర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించకపోవడం, డ్రైవింగ్‌పై ఏకాగ్రత దెబ్బతినే ప్రమాదం ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి బుల్లెట్ బండ్లను వాడటం వల్ల నడిపేవాళ్లకు ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు బుల్లెట్ బైకులకు అధిక శబ్ధాన్ని ఇచ్చే సైలెన్సర్‌లను వాడిన వాళ్లపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 80 కి పైగా కేసులు నమోదు చేసినట్లు రాచకొండ పోలీస్‌ఉన్నతాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి అలా సైలెన్సర్‌లను బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# అమెరికా పట్టించుకోదు.. రష్యా యుద్ధం ముగించదు

పేలవంగా ఉంది. అంత పెద్ద దేశం ఇలాంటి బలహీన ప్రకటన చేయడం ఆశ్చర్యంగా ఉంది. చిన్నారులను చంపిన క్షిపణి గురించి మాట్లాడేటప్పుడు వారు 'రష్యన్' అనే పదాన్ని చెప్పడానికి కూడా భయపడుతున్నారు. యుద్ధం ముగియాలి. అయితే ఈ ఉద్రిక్తతలను ముగించాలనే ఉద్దేశం రష్యాకు లేదు. కాల్పుల విరమణను కాకుండా చిన్నారుల ప్రాణాలు తీయడాన్ని మాస్కో ఎంచుకుంటోంది. అందుకే ఆ దేశంపై పూర్తిస్థాయి ఒత్తిడి తీసుకురావాలి" అని ఈ దాడిపై జపాన్, స్విట్జర్లాండ్ దేశాల రాయబార కార్యాలయాలు స్పందించిన తీరును జెలెన్‌స్కీ ప్రశంసించారు.క్రైవీరిపై జరిగిన దాడిలో 18మంది మృతి చెందగా.. 72 మంది గాయపడ్డారు. ఇటీవలి వారాల్లో జరిగిన దాడుల్లో తాజా దాడి అత్యంత ఘోరమైనదిగా ఉక్రెయిన్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఇంధన సౌకర్యాలున్న నేపథ్యంలో రష్యా ఉద్దేశపూర్వకంగానే దాడి చేసిందని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈ చర్యతో అమెరికాతో మాస్కో చేసుకు న్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని విస్మరించిందన్నారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు కృషి చేస్తామని రష్యన్లు చేసిన వాగ్దానాలు ఈ దాడులతో ముగిశాయని వ్యాఖ్యా నించారు. తమతో జరుగుతున్న యుద్ధాన్ని ముగించే ఉద్దే శం రష్యాకు లేదనే విషయం ప్రపంచానికి అర్థమవుతోందన్నారు.

# సుంకాల పెంపుపై ట్రంప్‌కు నిరసన సెగ

విద్య, సామాజిక భద్రత, మెడిక్ ఎయిడ్, మెడికేర్, మాజీ సైనికుల హక్కులు, సమాజం ఇలా ప్రతి ఒక్కటి సర్వంగా లేవని మండిపడ్డారు.ఈ నిరసనలపై శ్వేతసౌధం స్పందించింది. సామాజిక భద్రత, మెడిక్ ఎయిడ్‌లను ట్రంప్ ఎల్లప్పుడూ రక్షిస్తారని ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు ట్రంప్ పరస్పర టారిఫ్‌ల నిర్ణయం వేళ ప్రపంచ కుబేరుడు, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్ కీలక విషయాలను వెల్లడించారు. భవిష్యత్తులో అమెరికా, ఐరోపా చాలా సన్నిహితమైన, బలమైన భాగస్వామ్యాన్ని సృష్టించగల వని పేర్కొన్నారు. ఎలాంటి పరస్పర పన్నులు లేని జీరో టారిఫ్ జోన్‌కు చేరుకోగలవని ఆశాభావం వ్యక్తం చేశారు.లాంటి పరస్పర పన్నులు లేని జీరో టారిఫ్ జోన్‌కు చేరుకోగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటలీ లీగ్ పార్టీ ప్రతినిధులను ఉద్దేశించి ఓ వీడియోలింక్ ద్వారా మాట్లాడిన మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు.మరోవైపు అమెరికాలో ఉద్యోగాల కుదింపు కొనసాగుతోంది. తాజాగా ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసెస్‌కు (ఐఆర్ఎస్) చెందిన 20,000 మంది ఉద్యోగులను తొలగించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇది దాదాపుగా 25 శాతంతో సమానం. శుక్రవారం నుంచే పౌర హక్కుల కార్యాలయం నుంచి ఈ తొలగింపును అధికారులు ప్రారంభించారు. ఆ కార్యాలయాన్ని మూసివేసి అక్కడి ఉద్యోగులను చీఫ్ కౌన్సెల్ కార్యాలయానికి బదిలీ చేయాలని నిర్ణయించారు. గత ఫిబ్రవరిలో కూడా 7,000 మంది తాత్కాలిక ఉద్యోగులను ఈ విభాగం నుంచి తొలగించారు.

# పాంబన్ రైల్వేవంతెనను ప్రారంభించిన ప్రధాని

విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన, పూర్తయిన పనులను ప్రారంభించనున్నారు. తర్వాత రామేశ్వర ఆలయాన్ని సందర్శించి జ్యోతిర్లింగాల వద్ద పూజలు నిర్వహిస్తారు.

స్టాలిన్ గైర్హాజరు

తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో రూ.535 కోట్లతో.. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పాంబన్ వంతెనను ప్రధాని మోదీ నేడు ఆవిష్కరించారు. అయితే, ఈ కార్యక్రమానికి రాష్ట్రముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గైర్హాజరయ్యారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి కేంద్రానికి, తమిళనాడు ప్రభుత్వానికి మధ్య వివాదం జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని కార్యక్రమానికి సీఎం హాజరుకాకపోవడం గమనార్హం.తమిళనాడులోని రామేశ్వరంలో కొత్త పాంబన్ వంతెనను ప్రధాని మోదీ ప్రారంభించిన సమయంలోనే.. మరోచోట ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణతో న్యాయమైన డీలిమిటేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ విషయంలో రాష్ట్ర ప్రజలకు ఉన్న భయాలను తొలగిస్తానని ప్రధాని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ సీట్లలో తమ రాష్ట్ర వాటా శాతంలో మార్పు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 2001లో అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయి పాటించిన నిబద్ధతను నిలబెట్టుకోవాలని కేంద్రానికి సూచించారు. 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ అమలు చేస్తే తమిళనాడు, ఇతర దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో న్యాయమైన ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగనుంది. ఇందుకు అనుసరించే విధివిధానాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రేగుతోంది. ఇటీవల డీఎంకే నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల తయారీలో ప్రాతినిధ్యం తగ్గుతుందని స్టాలిన్ ఆరోపించారు. సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామన్నారు. ఈ సందర్భంగా తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. న్యాయబద్ధంగా, పారదర్శకంగా డీలిమిటేషన్ చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. భారత ప్రధాన భూభాగాన్ని రామేశ్వరంతో కలుపుతూ ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పాంబన్ వంతెనను నేడు ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. ఈ క్రమంలోనే రామేశ్వరం - తాంబరం ప్రత్యేక రైలును ప్రారంభించగా అది కొత్త వంతెన మీదుగా పరుగులు తీసింది.

**నిధులు కుమ్మరిస్తున్నా నిరాశే..: మోదీ**

తమిళనాడుకు కేంద్రం నిధులు పెంచినప్పటికీ.. కొందరు నిరాశే వ్యక్తం చేస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టుల కోసం గతంలో కంటే ఏడు రెట్లు నిధులు పెంచామన్నారు.2014 వరకు రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.900 కోట్లు కేటాయిస్తే.. ఎన్డీఏ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.600కోట్లు కేటాయించిందన్నారు. రామేశ్వరంలోని పాంబన్ బ్రిడ్జ్ ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన.. డీఎంకే ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. వైద్య విద్యను తమిళ భాషలో అందించాలని.. తద్వారా పేదలకు ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాని మోదీ సూచించారు. తమిళ భాష, సంస్కృతిని ప్రపంచ నలుమూలలా విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కొందరు నేతలు సంతకాలను తమిళంలో చేయకపోవడం పట్ల ప్రధాని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కనీసం వాటినైనా తమిళంలో చేయాలని విజ్ఞప్తి చేశారు. 21వ శతాబ్దంలో నిర్మించిన ఇంజినీరింగ్ అద్భుతం 'పాంబన్ వంతెన' అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ వంతెన ఆధునికీకరణ డిమాండ్ దశాబ్దాల నుంచి ఉందన్నారు. ప్రజలకు రవాణా పరంగానే కాకుండా ఉపాధి, ఆదాయవృద్ధికి కూడా ఇదెంతో ఉపయోగపడనుందని చెప్పారు. "మా ప్రభుత్వం దేశానికే గర్వకారణంగా నిలిచే మూడు వంతెనలు నిర్మించింది. ముంబయిలో సముద్ర వంతెన, జమ్మూకశ్మీర్‌లో చినాబ్ వంతెన, పాంబన్ వంతెనలు అద్భుతమైనవి. ప్రపంచంలో అత్యంత ఎత్తైన వంతెనను చినాబ్ నదిపై.. దేశంలో అత్యంత పొడవైన సముద్రపు వంతెనను ముంబయిలో.. దక్షిణాదిలో రామేశ్వరం వద్ద వర్టికల్ రైల్వే వంతెనను నిర్మించాం. భారతరత్న అబ్దుల్ కలాం పుట్టిన గడ్డ రామేశ్వరం. టెక్నాలజీ, ఆధ్యాత్మికత కలగలిసిన పుణ్యభూమి" అని మోదీ పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో పురోగతి సాధించిందన్నారు.

# 'కార్యకర్తల శక్తి, ఉత్సాహం ప్రేరణాదాయకం

**పార్టీకి వారే వెన్నెముక.. సుపరిపాలనే మా అజెండా.. ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ ప్రజలంతా భాజపా సుపరిపాలనను చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో పార్టీ సాధించిన అనేక చరిత్రాత్మక విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందని తెలిపారు.భాజపా 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశ పురోగతికి, 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని చెప్పారు. "కార్యకర్తలే మా పార్టీకి వెన్నెముక. వారి శక్తి, ఉత్సాహం ప్రేరణాదాయకం. కొన్ని దశాబ్దాలుగా పార్టీ బలోపేతం కోసం తమ జీవితాలను అంకితం చేసినవారి సేవలు మరువలేనివి. దేశ ప్రజలు మా పార్టీ సుపరిపాలన అజెండాను చూస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో మేం సాధించిన విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోంది. అవి లోక్‌సభ.. అసెంబ్లీలు.. స్థానిక సంస్థల ఎన్నికలైనా సరే. సమాజ సర్వతోముఖాభివృద్ధి దిశగా మా ప్రభుత్వాలు సేవ చేస్తూనే ఉంటాయి" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి అమిత్ షా సైతం శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.1980లో భాజపాను స్థాపించారు. 1984లో జరిగిన జాతీయ ఎన్నికల్లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలను మాత్రమే గెలుచుకుంది. అయితే, అటల్ బిహారీ వాజ్‌పేయీ, ఎల్‌కే ఆడ్వాణీల నాయకత్వంలో అంచెలంచెలుగా ఎదిగిన ఆ పార్టీ.. 90ల్లో మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చింది. అనంతరం 2014 నుంచి ప్రధాని మోదీ నేతృత్వంలో వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువుదీరింది.

# హెచ్‌సీయూ తరలింపు అనాలోచిత నిర్ణయం

- హెచ్ సీయూని తరలించడం అనేది ప్రభుత్వానికి సరికొత్త సమస్యలను తెచ్చిపెట్టే నిర్ణయం
- విద్యార్థి సంఘాలు, పర్యావరణ వేత్తలను జాతీయ స్థాయిలో చర్చలకు ఆహ్వానించే ధైర్యం ప్రభుత్వానికి ఉందా? : బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నిర్ణయాన్ని ఆయన అనాలోచితమైనది అని వ్యాఖ్యానించారు. హెచ్ సీయూని తరలించడం అనేది ప్రభుత్వానికి సరికొత్త సమస్యలను తెచ్చిపెట్టే నిర్ణయమని ఆయన తెలిపారు. హెచ్ సీయూని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేలా చేస్తే మంచిది అని చెప్పారు. గతంలో హెచ్ సీయూని తరలించాలని అనుకున్న ముఖ్యమంత్రి లు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ నిర్ణయాన్ని తీసుకునే ముందు మరింత ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. హెచ్ సీయూ తరలింపును వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ పై చేసిన ఆరోపణలపై స్పందించారు. ఏఐ ద్వారా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని ఆరోపించడం సరికాదు అని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆలోచనలు లేకుండా ఆక్షేపణలు చేయడం సరైనది కాదని ఆయన సూచించారు. జగదీష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా విమర్శించారు. ప్రభుత్వం కోర్టులను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. అలాగే కొందరు అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని, ఈ పరిస్థితి సరిపోలేలా లేదు అని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని కొందరు అధికారి తప్పుదారి పట్టిస్తున్నారు, దీని మీద ప్రభుత్వం గమనించాలని ఆయన సూచించారు. చివరగా హెచ్ సీయూ భూముల విక్రయాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు, పర్యావరణ వేత్తలను జాతీయ స్థాయిలో చర్చలకు ఆహ్వానించే ధైర్యం ప్రభుత్వానికి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం విద్యార్థుల, పర్యావరణవేత్తలతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# సీతారామ కళ్యాణోత్సవంలో అపశృతి





- గాలి దుమారంతో కూలిన టెంట్లు
- భోజనం చేస్తున్న భక్తులకు గాయాలు

పాలకుర్తి, ఏప్రిల్ 06(జనంసాక్షి) శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండలంలోని వల్మిడి దేవస్థానంలో సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం కొనసాగుతున్న తరుణంలో అపశృతి చోటు చేసుకుంది. కళ్యాణ మహోత్సవం జరుగుతున్న సమయంలో మధ్యాహ్నం వేళ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉచిత భోజనల ఏర్పాటు వద్ద భక్తులు భోజనాలు చేస్తుండగా, ఒక్కసారిగా గాలి దుమారం వచ్చింది. వేగంగా వీచిన గాలికి టెంట్లు కూలాయి. టెంట్లు కింద భోజనాలు చేస్తున్న పలువురు భక్తులకు గాయాలయ్యాయి. మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన వాసూరి మారమ్మ, పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామానికి చెందిన పాలయి సంధ్య, చెన్నూరు గ్రామానికి చెందిన విద్యార్థి మారబోయిన మనుశ్రీ గాయాలయ్యాయి. టెంట్లు కర్రలు మహిళలపై పడి తీవ్ర రక్తస్రావంతో విలవిలలాడారు దానిలో వసూరి మారమ్మ, మనుశ్రీకి, సంధ్యకు గాయాలు కాగా, పాలకుర్తి ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆధ్వర్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్దకు తరలించి ప్రదమ చికిత్స చేయించారు. ఒక్కసారిగా టెంటు గాలి దుమారానికి కూలడంతో ప్రాణభయంతో భక్తులు పరుగులు తీశారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన భోజనాలు నేలపాలయ్యాయి, దీంతో భక్తులు భోజనాలు చేయకుండా వెళ్లిపోయారు. శ్రీరామ నవమి వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు సరిగా చేయలేదని భక్తులు వాపోయారు. సీతారాముల కళ్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినప్పటికీ ఏర్పాట్లలో లోపం కనిపించిందని స్థానికులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో గాలి దుమారంతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ చేసినప్పటికీ వల్మిడి ఆలయంలో ఏర్పాట్లు సరిగా చేయకపోవడంతో టెంట్లు కూలడం చర్చనీయంశంగా మారింది. నిర్వహణ లోపాలను ఎత్తి చూపింది.

# బలం లేకపోవడం వల్లే ఆ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు

**మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేయడానికి తమకు బలం లేదని, అందుకే ఆ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగానే బీజేపీ నామినేషన్ దాఖలు చేసిందని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి విమర్శించారు. హైదరాబాద్ స్థానిక సంస్థలకు ఉన్న మొత్తం 112 ఓట్లలో బీజేపీకి కేవలం 27 ఓట్లు మాత్రమే ఉన్నాయని, బీఆర్ఎస్-23, కాంగ్రెస్-13, ఎంఐఎం-49 ఉన్నాయి. మాకు బలం లేకపోవడం కారణంగానే బరిలో నిలవలేదని పేర్కొన్నారు. అప్పుడు బీజేపీ గెలుపు ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థిని బరిలో నిలపలేదు. మేము బీజేపీకి సపోర్ట్ చేసే పరిస్థితి లేదు, రాదు.. మేము తటస్థంగా ఉన్నాం, అలా అని ఏ పార్టీకి మద్దతు తెలపడం లేదు..అలాంటప్పుడు బీఆర్ఎస్, బీజేపీకి మద్దతు తెలుపుతుందా..అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

# నాగార్జున సాగర్ ఎర్త్ డ్యాం దగ్గర మరోసారి అగ్నిప్రమాదం



హుజూర్‌నగర్ (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యాం పరిధిలో మరోసారి అగ్నిప్రమాదం జరిగింది. ఏప్రిల్ 6న మద్యాహ్నం ఎర్త్ డ్యాం దగ్గర మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అప్పటికే మంటలకు ఎర్త్ డ్యాం పై ఉన్న సీసీ కెమెరాలు, విద్యుత్ వైర్లు ధ్వంసం అయ్యాయి. డ్యాం దగ్గర ఇటీవల అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మార్చి 19న నాగార్జునసాగర్ ప్రధాన ఎర్త్ డ్యాం వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పాయింట్ నుంచి శివుడి పార్క్ వరకు ఎర్త్ డ్యాం వెంట ఉన్న చెట్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ ఆఫీసర్లు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 15, 21 తేదీల్లో డీఫారెస్ట్ ఏరియాలో అగ్ని ప్రమాదం జరిగి చెట్లు, మొక్కలు కాలి బూడిదయ్యాయి. తాజాగా మరోసారి ప్రమాదం జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

# మెట్రోలో బెట్టింగ్ యాడ్స్‌పై హైకోర్టులో పిల్

- అగ్రిమెంట్ రద్దుతోపాటు దర్యాప్తు చేయాలన్న పిటిషనర్



హైదరాబాద్ (జనంసాక్షి) : మెట్రో రైల్‌లో బెట్టింగ్ యాడ్స ఇవ్వడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. బెట్టింగ్ యాప్‌లతో హైదరాబాద్ మెట్రో రైల్ కుదుర్చుకున్న ఒప్పందాలపై దర్యాప్తు చేయించాలని కోరుతూ న్యాయవాది ఎన్.నాగూర్‌బాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. మెట్రో రైలులో, ఫ్లాట్‌ఫారాలు, స్టేషన్ ఆవరణలలో బెట్టింగ్ యాప్‌లపై ప్రకటనలను తక్షణం నిలిపివేసేలా ఆదేశించాలని కోరారు. మెట్రో రైల్వేకు, బెట్టింగ్ యాప్ సంస్థలకు మధ్య కుదిరిన లావాదేవీలపై దర్యాప్తు చేపట్టేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

బెట్టింగ్ యాప్‌లపై ఈడీ ఇప్పటికే కేసు నమోదు చేసి, రూ.399 కోట్లు జప్తు చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందాలపై విచారణ జరపాలన్నారు. ప్రకటనల విధానంపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. ఈ ప్రకటనలకు బాధ్యులైన ఉన్నతాధికారుల నుంచి పరిహారం రాబట్టి ప్రజాసంక్షేమ నిధికి చెల్లించాలన్నారు. ఇందులో ప్రతివాదులుగా మెట్రోతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, డీజీపీ, సీఎస్,. జీహెచ్ఎంసీ కమిషనర్‌లతోపాటు వారిని వ్యక్తిగత హోదాలోను చేర్చారు. ఈ పిటిషన్ నెంబరు కేటాయింపు నిమిత్తం రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

# ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



శంకర్ పల్లి ఏప్రిల్ 06 (జనం సాక్షి) : ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్పల్లి మున్సిపల్ పరిధిలో గల చిన్న శంకర్పల్లి కి చెందిన బద్దం హనుమాన్ రెడ్డి వయసు 48 సంవత్సరాలు కాగా గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడని, ఇదే విషయంలో భార్య మరియు కొడుకులతో గొడవపడి గత మూడు రోజుల క్రితం (శుక్రవారం) ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు కాగా ఆదివారం తన సొంత వ్యవసాయ భూమిలో మృతదేహం ఉందని అదే గ్రామంలోని స్థానికులు పోలీసు వారికి సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు అరవింద్ రెడ్డి 23 ప్రణీత్ రెడ్డి (21) ఉన్నారు. భార్య బద్దం అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# పదేళ్లు, ఇరవై ఏళ్లు వారసత్వంగా ఉండరు

- ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ (జనంసాక్షి) : బీజేపీ అధ్యక్ష పదవి మార్పు ఎప్పుడూ ఉంటుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు పార్టీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. తమ పార్టీలో అధ్యక్షులు పదేళ్లు, ఇరవై ఏళ్లు వారసత్వంగా ఉండరు.. అని ఈటల హాట్ కామెంట్స్ చేశారు. ఢిల్లీ నాయకత్వం అంతా సమగ్రమైన ఆలోచనతో ప్రణాళికతో ఉన్నారని అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కంటోన్మెంట్ లో జెండా పండుగ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో 70% రాష్ట్రాల్లో బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపిస్తుందని చెప్పారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 35% ఓటు సాధించి సగం ఎంపీ సీట్లు గెలుచుకుని రేపటి ఎన్నికల్లో తెలంగాణలో ఏర్పడే ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమేనని ప్రజలు మెసేజ్ అందించారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని చూసినం వారి పరిపాలన అనుభవమైందని, మళ్లీ ఓటు వేసే ప్రసక్తి లేదని ప్రజలు అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 10 నెలల కాలంలోనే ప్రజాక్షేత్రంలో విఫలమైందన్నారు. కాబట్టి రాబోయే కాలంలో రాష్ట్రం సురక్షితంగా సుభిక్షంగా అభివృద్ధి పథంలో నడపాలంటే బీజేపీ మాత్రమే నిజమైన పార్టీ అని ప్రజల్లో భావన ఉంది కాబట్టి.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిచేది బీజేపీ పార్టీనే అని జోస్యం చెప్పారు.

# విత్తనం రైతు ప్రాథమిక హక్కు

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- మూడు రోజుల పాటు ఘనంగా సాగిన విత్తనాల పండుగ
- ముగింపు వేడుకల్లో పాల్గొన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కెవిఎన్ రెడ్డి.
- పదికి పైగా రాష్ట్రాల రైతులు స్వతహాగా తయారు చేసుకున్న మూల విత్తనాలను పరిశీలించిన కమిషన్




విత్తనం రైతు ప్రాథమిక హక్కు అని రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం, అల్మాస్ పల్లి గ్రామంలో విత్తనాల పండుగ మూడు రోజుల పాటు ఘనంగా సాగింది. చివరి రోజు విత్తనాల పండుగ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు కెవిన్ రెడ్డి హాజరయ్యారు. గ్రీన్ రెవల్యూషన్ మరియు భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ ఆధ్వర్యంలో విత్తనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మూడు రోజులపాటు జరిగిన విత్తనాల పండుగ వేడుకల్లో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన రైతులు హాజరై వారు తయారు చేసిన విత్తనాలను స్టాల్స్ లో ప్రదర్శించారు. దాదాపు 30 కి పైగా స్టాల్స్ ను ఏర్పాటు చేసి రైతులు స్వతహాగా తయారు చేసుకున్న మూల విత్తనాలను వాటి ప్రాముఖ్యతను వివరించారు. దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఛత్తీస్ ఘడ్, ఒరిస్సా రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా లోని రాజస్థాన్, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన రైతులు కూడా ఈ విత్తనాల పండుగలో పాల్గొన్నారు. విత్తనాల పండుగ వేడుకలో పాల్గొన్న రైతు కమిషన్ కోదండరెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విత్తనం రైతు ప్రాథమిక హక్కుని, కానీ గత మూడు దశాబ్దాలుగా అది మల్టీ నేషనల్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిందన్నారు. ఫలితంగానే రైతు ఆత్మహత్యలు మొదలయ్యాని గుర్తుచేశారు. విత్తనం రైతు హక్కు అనేది నినాదం కాదని, అది రైతు జీవన విధానానికి మార్గదర్శకమన్నారు. ఒకప్పుడు రైతు తాను పండించిన పంటలో నుంచే విత్తనం పెంచుకొని భద్రపరిచి మళ్లీ వచ్చే పంటకు వాడుకునే వాడని, అంతటి ప్రాధాన్యత ఉన్న విత్తనం నేడు క్రమంగా రైతు చేతిలో నుంచి బయటకు పోయిందన్నారు. విత్తనం రైతు చేతుల్లో లేకపోతే దేశానికి ఆహార భద్రతే లేకుండా పోవచ్చన్నారు. మళ్లీ రైతులు చేతులకి విత్తనం రావాలని, రైతులు ప్రకృతి సాగు వైపు దృష్టిపెట్టాలని కోరారు. విత్తనాల పండుగ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన దొంతి నరసింహారెడ్డి అభినందించారు. ఇక భూసారం తగ్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి అన్నారు.

పెస్టిసైడ్ చల్లడం తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలన్నారు. భూసారం తగ్గడం వల్ల పంట దిగుబడి పడిపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని గుర్తు చేశారు. మన పూర్వికులు చేసిన పద్ధతుల్లో మళ్లీ పంటల సాగు చేయాలనీ సూచించారు. పురుగుమందులు ఎరువుల వాడకం తగ్గిస్తే మంచిదన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన రైతులు వారు తయారుచేసుకున్న విత్తన స్టాల్స్ ను పరిశీలించారు.

# ఈదురు గాలుల బీభత్సానికి విరిగిన చెట్టు

- తెగిన విద్యుత్ తీగ..
- విద్యుద్ఘాతంతో బాలుడు మృతి



బొంరాస్ పేట,ఏప్రిల్ 6 (జనం సాక్షి): ఈదురు గాలుల దాటికి చెట్టు విరిగి విద్యుత్ తీగలు పడడంతో విద్యుత్ తీగల కింద ఉన్న బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. బొంరాస్ పేట ఎస్సై అబ్దుల్ రావుఫ్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన పెద్ద కురువ బాలప్పకు ముగ్గురు సంతానం ఉన్నారు. ఆదివారం ఉదయం పాఠశాల సమీపంలోని నీటి తొట్టిలో పశువులకు నీరు తాగించేందుకు బాలప్ప కుమారుడు మణితేజ(9),తల్లి గౌరమ్మ (70) వెళ్లారు. ఒక్కసారిగా గాలి వేగంగా వియడంతో నీటి తోటి సమీపంలో ఉన్న చెట్టు వేర్లు చెట్టు విరిగి పడడంతో సమీపంలో ఉన్న కరెంటు తీగ బాలుడి మీద పడడంతో మణితేజ అక్కడికక్కడే మృతి చెందాడు. బాలప్ప తల్లి గౌరమ్మకు తీవ్ర గాయాలు కావడంతో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. మృతి చెందిన బాలుడు మణితేజ తండ్రి బాలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.





కేసీఆర్‌పై ఆర్టిస్ట్ , గాయకుడు ఈశ్వర్ రూపొందించిన పాటను బి.ఆర్.ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. శనివారం ఎర్రవెల్లిలోని నివాసంలో 'తెలంగాణ జాతిపిత కేసీఆర్ గారి పాట' పేరుతో ఉన్న సీడీ నమూనాను బి.ఆర్.ఎస్ అధినేత ఆవిష్కరించారు.

– హైదరాబాద్ (జనంసాక్షి) :

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
7 ఏప్రిల్ 2025
తెలంగాణ

# ఆరోగ్యకర కుటుంబాలు ఏవి?



ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన కుటుంబాల సంఖ్య భారీగా తగ్గుతున్నది. పోషక పౌష్టిక ఆహారం స్త్రీలకు లభించడం గగనం అయిపోయింది. కుటుంబాలలో వారి సంరక్షణ లేకుండా పోయింది. భారతదేశంలో నేటికీ 10 కోట్లకు పైగా నివసించే ఆదివాసి ప్రాంతాల్లో వైద్య సౌకర్యం అందరిని ద్రాక్షగానే మిగిలిపోయింది. ప్రతి ఏటా దేశంలో లక్షల తల్లుల నవజాతి శిష్యుల మరణాలు సంభవిస్తున్నాయి. 140 కోట్ల ప్రజలు ఉన్న భారతదేశంలో నేటికీ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక వాగులు వంకలు దాటి ఆసుపత్రి అందుబాటులో లేక వైద్యం అందుబాటులో లేక సరైన సమయానికి వైద్యమందక ఎన్నో మరణాలు వైద్యం ఆరోగ్యం పట్ల పాలకులకు పెద్దగా శ్రద్ధ లేదు, అనేది స్పష్టమైన విషయం.తల్లులు మరియు శిశువుల ఆరోగ్యం ఆరోగ్యకరమైన కుటుంబాలు సమాజాలకు పునాది లాంటివి. ఇది మన అందరికీ ఆశాజనకమైన భవిష్యత్తును నిర్ధారించడంలో ఆరోగ్యకరమైన గర్భాలు మెరుగైన ప్రసవానంతరం ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి డబ్ల్యూ హెచ్ ఓ మరియు భాగస్వాములు ఉపయోగకరమైన విషయాలను వెల్లడించడం జరుగుతుంది.

**ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం.**

ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ను నిర్వహించడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఒక ఆరోగ్య అంశంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా 1948 ఏప్రిల్ 7న డబ్ల్యూహెచ్ఓచే స్థాపించబడిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం తల్లి మరియు నవజాత శిశువుల మనుగడలో అంతరాల గురించి మహిళల దీర్ఘకాలిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం గురించి అవగాహన పెంచడం జరుగుతుంది. మహిళలు శిష్యుల ఆరోగ్యాన్ని మెరుపు పరిచే ప్రభావంతమైన పెట్టుబడులు అవసరం తల్లిదండ్రులు క్లిష్టమైన సంరక్షణ అందించే ఆరోగ్య నిపుణులకు మద్దతు ఇవ్వడానికి సమిష్టి చర్యను ప్రోత్సహించడం ప్రతి స్త్రీ మరియు శిశు మనుగడ సాగించడానికి అభివృద్ధి చెందడానికి సహాయం చేయాల్సినటువంటి పరిస్థితి ఉన్నాయి ఇది చాలా కీలకమైన అంశం. డబ్ల్యూహెచ్ఓ లెక్కల ప్రకారంఏటా 2 మిలియన్ల శిశువుల మరణాలు. ప్రతి ఏడాది రెండు మిలియన్లకు పైగా నవజాతి పిల్లల మరణాలు సంభవించినపుడు ప్రపంచ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో స్పష్టం అవుతున్నది. ప్రతి సంవత్సరం గర్భం దాల్చడం వల్ల లేదా ప్రసవం సమయంలో300.000 మంది మహిళలు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రాణాలు కోల్పోతున్నారు. పసిపిల్లలు మొదటి నెలలోనే మరణిస్తున్న దాఖలాలు ఉన్నాయి. అంటే ప్రతి ఏడు సెకండ్లకు ఒక నివారించగల మరణం సంభవిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఊహించని గర్భాలు ఉన్న 42 మిలియన్ల మంది మహిళలు ఒక అంచనా ప్రకారం గర్భస్రావాలను పెంచుకుంటున్నారు ఈ ప్రక్రియలో దాదాపు సగం మంది అంటే 20 మిలియన్లు అసురక్షితంగా ఉంటున్నారు ఏటా దాదాపు 68,000 మంది మరణిస్తున్నారు ఇది 13 శాతం ఉంటుంది అసురక్షిత గర్భస్రావం నుంచి బయటపడ్డ మహిళలను ఐదు మిలియన్ల మంది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న దాఖలాలు ఉన్నాయి.

**ప్రతీ ఐదులో 4 దేశాల్లో మరణాలు.**

ప్రస్తుత లెక్కల ప్రకారం ఐదు దేశాలలో నాలుగు దేశాలు 2030 నాటికి ప్రసూతి మరణాలను నివారించే పరిస్థితికి చేరుకోవడం అసంభవం గా కనిపిస్తున్నది. ప్రపంచంలోనే ప్రతి మూడు దేశాలలో ఒక దేశం నవజాత శిశు మరణాలను తగ్గించే లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నది. మహిళల మాట వినడం కుటుంబాలకు మద్దతు ఇవ్వడం అవసరం. తల్లి మరియు నవజాత శిశువుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అనేక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన పరిస్థితి ఉంది. వీటిలో ప్రసూతి సమస్యలు మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్య పరిస్థితులు అంటు వ్యాధి కాని ,వ్యాధులు కుటుంబ నియంత్రణ కూడా చోటు చేసుకుంటున్నది. అదనంగా మహిళలు కుటుంబాలు వారి ఆరోగ్యం హక్కులను కాపాడే చట్టాలు విధానాల ద్వారా మద్దతు పొందాలి. తల్లి ,నవజాత శిశువుల మనుగడలో అంతరాల గురించి మహిళల దీర్ఘకాలిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరాన్ని విస్మరించడం జరుగుతుంది.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# బుద్ధి జీవులుగా ఆదివాసులకు అండగా నిలుద్దాం



**ఆదివాసి ప్రాంతంలో ఉన్న ఉపాధిని దూరం చేయడమే కాకుండ ఆదివాసుల భద్రత ఇస్తామంటున్న పాలకులే అక్కడి జనజీవనంలో అభద్రతకు కారణం అవుతున్నారు ఆదివాసులను మావోయిస్టులని వారి సానుభూతిపరులని నిత్యం వేధింపులకు పాల్పడుతు సామాన్యలపై విచారణ పేరిట వేధింపులకు గురి చేస్తు ఎన్కౌంటర్లు చేయడము, మహిళలపైహత్యలకు, హత్యచారాలకు పాల్పడుతున్న ఘటనలు ఎన్నో వెలుగులోకి వస్తున్నాయి.**


అడవిని నమ్ముకుని జీవనము సాగిస్తున్న ఆదివాసులు ఈ దేశ మూల వాసులు జీవన విధానము ఎంతో వైవిధ్యంగా ఉంటుంది. అడవులే వాళ్ళ జీవన ఉపాధికి ఏకైక మార్గం పర్యావరణానికి నష్టం కలిగించకుండ పోడు వ్యవసాయము చేస్తూ జీవిస్తున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా వారి జీవితాలు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడుతూ వస్తున్నాయి నాడు తెల్లదొరల నుండి నేటి నల్ల దొరల వరకు అడుగడుగున మోసపోతునే ఉన్నారు. నాడు చిన్న పెద్ద పిల్ల జెల్ల తేడా లేకుండా బ్రిటిష్ వార్ని ఈ దేశం నుండి వెళ్లగొట్టడానికి సంవత్సరాలాది పాటు పోరాటాలు చేసి అనేకమంది ప్రజలు ఎందరో వీర కిశోరులు ఈ దేశం కోసం వాళ్ళ అమూల్యమైన ప్రాణాలు త్యాగం చేసినారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి అయినప్పడికి వచ్చిన స్వాతంత్రాన్ని ప్రజలకు చెందకుండా నల్లవాని చేతిలో బంద్ గా మారిపోయినది. నేడు స్వాతంత్రాన్ని అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని చేతిలో పెట్టుకొని ఓట్ల ద్వారా ప్రజలను మోసం చేస్తూ కార్పొరేట్ సంస్థల కొమ్ము కాస్తూ ఈ దేశ సంపాదన మొత్తం కార్పొరేట్ సంస్థలకు అమ్మ చెబుతున్నాడు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను ఈరోజు కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి కార్పొరేట్ సంస్థలను కొమ్ముకాస్తున్న పాలకులు ప్రజలను అనేక ఇబ్బందులకుగురిచేస్తున్నారు.

అదేవిధంగా నేడు అడవులలో అనేక ఖనిజా సంపదలు 27 రకాల తో భూగర్భంలో ఉన్న వాటిని రాష్ట్ర,కేంద్ర పాలకులు కార్పోటర్ సంస్థలకు. అందజేసేందుకు అడ్డుగా వున్న ఆదివాసులను తొలగించేందుకు కగార్ ఆపరేషన్ పేరుతో ఆదివాసుల పైన యుద్ధం ప్రకటించి అనేక చిత్రహింసలు పెడుతూ ఆదివాసులపై దాడులు ప్రాణాలు పోయే విధంగా సైన్యం చేత దాడులు చేయిస్తూ ప్రాణాలను తీస్తూ వాళ్ల జీవనశైలి విధానాన్ని కనుమరుగే విధముగా ఈ దేశ ప్రభుత్వం కుట్రలు చేస్తు పాలకులు ప్రవేశపెట్టిన ప్రైవేటీకరణ విధానాల రూపంలో వారికి ఆ సంపదలని సులభంగా కొల్లగొట్టె అవకాశాలు ఏర్పడ్డాయి. ఇదే అదనుగా ఆదివాసులకు రక్షణగా నిలుస్తున్న పెస లాంటి అనేక చట్టాలను ప్రభుత్వం బలహీన చేస్తూ ఆదివాసుల హక్కులను కాల రాస్తున్నారు. భారత్ ప్రధాన మంత్రి మోడీ ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్ పేర చేస్తున్న కుట్రలకు దండకారణ్యంలో నెత్తురు ఏరులై పారుతున్నది. మావోయిస్టుల ఏరువేత పేరుతో నడుస్తున్న ఈ కగార్ ఆపరేషన్ వెనుక అటవీ సంపదలని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యము ఆదాని, అంబాని లాంటి కార్పొరేటర్ శక్తులకు అండ గా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్న క్రమంలో 2005లోనే సల్వ జుడుం 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్, గ్రీన్ హంట్ సమాధాన్, 1,2 చేపట్టినప్పటికీ ఇప్పుడు ఏకంగా ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో బహుళ జాతి కార్పొరేట్ కంపెనీల రాజ్యము ఏర్పాటుకు రంగము సిద్ధమవుతోంది ఛత్తీస్గఢ్ తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలో విస్తరించిన దండకారణ్యంలో వజ్రాలు, ఇనుము, సున్నం, రాయి, బ్రాకైట్,డోలో మైట్ సహా 27 రకాల విలువైన ఖనిజ సంపద భూగర్భంలో దాగి ఉన్నాయి ఈ సంపదలని తవ్వుకొని తరలించేందుకు కార్పొరేటర్ శక్తులు చాలా కాలం నుంచి ప్రయత్నాలు చేస్తున్నాయి. కార్పొరేటర్ శక్తుల అండదండల కోసం పరితపిస్తూ కేంద్ర రాష్ట్ర పాలకులు ఆ సంపదను తరలింపులకు అక్కడ ప్రజలు అడ్డం తగులుతూ ఉన్నారని శాంతి భద్రతల పేర మావోయిస్టులను అంతం చేస్తామంటూ కగార్ ఆపరేషన్ చేపట్టారనే వాదన బలంగా పుంజు కున్నది. అభివృద్ధి పేరిట అడవులను విధ్వంసం చేస్తున్నారు. అటవీ సంపదలు క్రమముగా కార్పొరేటర్ శక్తులపరము కావడం వల్ల ఆదివాసుల ఆవాసాలు కనుమరుగయే స్థితి ఏర్పడినది అటవీ ఉత్పత్తులు పోడు వ్యవసాయంతో బతుకుతున్న ఆదివాసుల జీవితాలు అభివృద్ధి ముసుగులో బుగ్గి పాలు అవుతున్నది. ప్రభుత్వాలు దండకారణ్యంలో చేస్తున్న అభివృద్ధి పని ఏదైనా ఉన్నదంటే అది రోడ్లు వేయడం తప్ప మరొకటి కనిపించదు పాఠశాలలు నిర్మాణము ఆరోగ్య కేంద్రాలు అడవి బిడ్డలకు నివాసాలు ఇతర కనీస వసతులు ఏర్పాటు వంటివి ప్రభుత్వాలు దృష్టిలో లేవు ఆదివాసీల ఆర్థిక సామాజిక వెనుకబాటును పేదరికాన్ని రూపుమాపే ఏ చర్యలు ప్రభుత్వాలు తీసుకోవడం లేదు, ఆకలి తీర్చడం కనీస బడి, హాస్పత్రు లు పోషకాహారము లోపాలకు సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు ఉన్న అవేవీ పాలకులకు పట్టడం లేదు, జనసంచారము పెద్దగా లేని మార్మూల ప్రాంతాలకు కూడా ఆరు లైన్ల రహదారాలు వేస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది ఆ రోడ్ల పైన ఖనిజలను తరలించే భారీ రవాణా వాహనాలు తప్ప సాధారణ వాహనాలు రాకపోకలు అసలు కనిపించవు. ఆ రోడ్లకు దగ్గరగా జీవించే ప్రజలు కనీసము చెప్పులు కూడా వేసుకునే స్తోమత లేదు ఇదే తరుణంలో దండకారణ్యంలో వందలాది పోలీసు క్యాంపులు ఏర్పడడంతో ఆదివాసుల్లో బహుళత్వము ఏర్పడినది పాల మిలిటరీ దళాలు కేంద్ర రిజర్వు పోలీసు దళము జిల్లా రిజర్వార్డులు సిఆర్పిఎఫ్ కోబ్రా వంటి వివిధ దళాలు అడవిలో తిష్ట వేసి ఆదివాసులకు భారత రాజ్యాంగము కల్పించిన రక్షణను ఆదివాసులకు దూరం చేస్తున్నాయి. భారత ప్రభుత్వానికి ఆదివాసి ప్రజలకు స్వాతంత్ర్యం పైన ప్రేమ గనుక ఉంటే అక్కడ లక్షల కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టుతున్న సైనికుల కోసం అందులో పైసలు ఆదివాసుల కోసం ఖర్చు పెడితే అక్కడ ఎంతో మేరుగైన సౌకర్యాలు ఆదివాసులకు దక్కెటిది కానీ ఈ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తు వాళ్లు వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడి మన దేశ ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికే ప్రయత్నాలు ముమ్మురముగా కొనసాగుతున్నాయి. దండకారణ్యంలో అత్యంత భయంకరమైన వాతావరణాన్ని సృష్టిస్తూ ఆదివాసులను ఎన్కౌంటర్ల పేర అత్యంత దారుణంగా చంపి వేస్తున్నారు. దండకారణ్యంలో ఆదివాసుల గ్రామాలను తగలబెట్టడం వ్యవసాయ పంటలను ధ్వంసం చేస్తు కాల్చి వేయడము ఆహార ధాన్యాలను నీళ్లల్లో పోయడము వంట పాత్రలో విషం కలపడం, విషపూలికలు మత్తు పదార్థాలను ఆహార పదార్థంలో కలిపి ఆదివాసి ప్రజలను అత్యంత దారుణంగ, వేదింపులకు గురిచేస్తు చంపి వేస్తున్నారు. ఇతర దేశాలలో కూడా ఇంత దారుణమైన సంఘటనలు జరిగిన చరిత్ర ఎక్కడ కనబడడంలేదు.

భారత దేశ ప్రజలను మన దేశ సైన్యం చేత చంపించబడుతున్న ఈ ప్రభుత్వము చరిత్రలో నిలిచి ఉంటుంది. ప్రజలందరు పన్నుల రూపకంగ చెల్లిస్తున్న డబ్బులతో ప్రభుత్వాన్ని నడుపుతున్న పాలకులు ప్రజల పైననే యుద్ధం చేయడము ఎంతో హెయమైన చర్య బార్డర్‌లో ఉండవలసిన సైన్యము గ్రామాల్లో తిరుగుతూ అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజల్ని మానవత్వం లేకుండ దాడులు చేస్తు చంపడం ఇలనే కొనసాగుతే రానున్న రోజుల్లో ప్రజలు తిరుగుబాటు చేస్తూ మన భారత సైన్యంపైన యుద్దానికి సిద్ధం కానున్న రోజులు రానున్నయి.

దండకారణ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన లక్షల మంది సాయుధ బలగాలు ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక పోలీస్ క్యాంపు ఏర్పాట్ చెసి 9 మంది ఆదివాసులకు ఒక సైనికుడు మొహరింపు చేయడం వల్ల ఆదివాసుల జీవితాన్ని అస్తవ్యస్తము చేస్తున్నాయి. ఆదివాసులు నిరంతరము డి ఆర్ జీ, క్యాంపుల, డ్రోన్ల నిఘా లల్లో జీవించవలసిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయి. బైట కు పోవాలంటే అర చేతుల్లో ప్రాణాలు పెట్టుకొని తిరిగి వస్తామా అన్న ఆశ లేకుండ పాలకులు చేస్తున్నారు..

ఆదివాసి హక్కుల పరిరక్షణకు ఉద్యమాలకు సంఘీభావంగా ప్రజలందరూ ముందుకు వచ్చి ఆదివాసి ప్రజలకు అండదండగా ఉంటూ వాళ్ళ ఆదివాసుల హక్కుల కోసం కగార్ ఆపరేషన్ వ్యతిరేకిస్తూ బుద్ధి జీవులు గా ఆదివాసులకు అండ,రక్షణగా పోరాటాల్లో భాగస్వాములము కావలసిన అవసరం మనపై బాధ్యత ఉన్నది.



బాలసాని రాజయ్య
విప్లవ రచయితల సంఘం
కరీంనగర్ ఉమ్మడి జిల్లా

# సాహితీ సేద్యంలో మోతుబరి.. మోతుకూరు నరహరి

**ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకృత విధానాలు అమలులోకి వచ్చిన తరువాత సామాజిక జీవితంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. సమష్టితత్వం వ్యష్టితత్వంగా మారింది. వ్యక్తిగతంగాను వ్యవస్థగాను గమనించినప్పుడు సైద్ధాంతిక విలువలు అనేవి రోజురోజుకు అడుగంటుతున్నాయి. అలాగే మానవ సంబంధాలలో అనేక మార్పులు వచ్చాయి. ఈ నేపథ్యంలో నమ్మిన విలువలను సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా ఆచరించేవారు అరుదైనారు. అలాంటి విశిష్ట వ్యక్తులలో ఉపాధ్యాయ సంఘాలలోనూ ప్రజా సంఘాలలోనూ వామపక్ష భావజాలంతో నిరంతరం పాల్గొంటున్న నిఖార్సైన నాయకులు, వక్తలు, సాహితీవేత్తలు, శ్రీ మోత్కూరు నరహరి గారు ముఖ్యులు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీజావాపనం చేసిన నల్లగొండ జిల్లా ఆలేరు పక్కనున్న ఇక్కుర్తి అనే గ్రామంలో తేదీ 11-4-1944న జన్మించారు**



మోత్కూరు మండలం బుజిలా పురం గ్రామ వాస్తవ్యులైన అమ్మమ్మ గారి ఇంట్లోనే వారి పాఠశాల విద్య కొనసాగింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు నరహరి గారు చిన్నప్పటినుండే చదువులోనూ నాయకత్వ లక్షణాలతోనూ చురుకుగా ఉంటూ ఆ రోజుల్లోనే విద్యార్థి సంఘ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. హెచ్.ఎస్.సి పూర్తి చేసి తర్వాతి కాలంలో హైదరాబాదులోనే ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ఆంధ్ర ప్రాచ్య కళాశాలలో డిప్.ఓ.ఎల్,బి.ఓ.ఎల్ పూర్తిచేసుకుని వరంగల్ లోని శిక్షణ కళాశాలలో తెలుగు పండితులుగా శిక్షణ పొందారు.1971-1973 నడిమి కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ప్రైవేట్ గా ఎం.ఏ తెలుగు చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు కొంతకాలం పాటు క్లర్క్ గా అలాగే ఆలియా ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితులుగా విధులు నిర్వహించారు. శ్రీ నరహరి గారు సంప్రదాయ కుటుంబంలో పుట్టిన మొదటి నుండి ఆధునిక అభ్యుదయ భావాలు కలవారు. ఆచరించినవారు. బహుశా ఆ ప్రభావమే కావచ్చు శ్రీశ్రీ కవిత్వంలో సామాన్య మానవుని చిత్రణ అనే అంశంపై ఆచార్య కులశేఖర రావు గారి పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పరిశోధన చేసి ఎం.ఫిల్ డిగ్రీని అందుకున్నారు. తెలంగాణలో తెలుగు భాషా దీపం కొడిగట్టుకు పోరాదనే లక్ష్యంతో స్థాపించిన ఆంధ్రసారస్రత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో 1974 నుండి 2002 వరకు ఉపన్యాసకులుగా, ప్రాచార్య లుగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కాలంలో వారు విద్యార్థులకు బాల, ప్రౌఢ వ్యాకరణాలతోపాటు అలంకార శాస్త్రం, ఆధునిక సాహిత్యం, సంస్కృతాన్ని బోధించారు. గురువుల వద్ద చదువుకున్న ఇక్కడి విద్యార్థులు తర్వాతి కాలంలో ఉపాధ్యాయులుగా, ఆచార్యులుగా, పాత్రికేయులుగా, పత్రికా సంపాదకులుగా, వివిధ రంగాలలో పనిచేశారు మసన చెన్నప్ప , కే.శ్రీనివాస్, గోరేటి వెంకన్న లాంటి వారెందరో ఈ కళాశాల పూర్వ విద్యార్థులు. ప్రాచ్య కళాశాల అయినా ప్రగతిశీల భావాలను నింపిన కళాశాల ఇది. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించే వివిధ సాహిత్య సదస్సులు అక్కడి విద్యార్థులను ప్రభావితం చేసేవి. మనవు గురించి అయినా మార్క్స్ గురించి అయినా శ్రీనాధుని గురించి అయినా శ్రీశ్రీ గురించి అయినా అక్కడ జరిగే సభలు, ప్రసంగాలు, విశ్లేషణలు ప్రామాణికంగా ఉండేవి. ప్రధాన ఆచార్యులు కె.కె.రంగనాథచార్యులు గారి ఆధ్వర్యంలో సాగే కళాశాలలో ఆనాడు పరాయి తం కృష్ణమూర్తి శాస్త్రి, నాయని కోటేశ్వరి, సుందరాచార్యులు, సింగరాచార్యులు, మోత్కూరు నరహరి, డి.చంద్ర శేఖర రెడ్డి, డాక్టర్ పి.వి చలపతిరావు, చక్రపాణి, బి.జితేందర్ రెడ్డి మొదలైన వారు పాఠాలు చెప్పేవారు. ఒక్కొక్కరు తమ తమ విషయాలలో ఆరితేరిన వారు. గురజాడ అన్నట్లు కొత్తపాతల మేలు కలయికగా ఆ కళాశాల విలసిల్లేది.

ఈ నేపథ్యంలో సాహిత్యం సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా విశ్వసించి శ్రీ నరహరి గారు వివిధ వేదికల పైన ప్రసంగించారు. అలాగే పలు గ్రంథాలలో, పత్రికలలో, సాహిత్య వ్యాసాలు రాశారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు గురైనప్పుడు మతం అంటే ఏమిటి అంటూ విశ్లేషిస్తూ ప్రజాశక్తిలో వ్యాసాలు రాశారు. నల్లకుంట లోని కళా స్రవంతి సాహిత్య సాంస్కృతిక సంస్థ వారు 1973లో వెలువరించిన సాహితీ మంజూషలో ప్రజాకవి వేమన, ప్రాచ్య కళాశాల రజతోత్సవాల సందర్భంగా వెలువరించిన తెలుగు సాహిత్యం చారిత్రక నేపథ్యం అనే గ్రంథంలో 14వ శతాబ్దంలో తెలుగు సాహిత్యం సాహిత్య తాత్వికత శీర్షికన వ్యాసం రాస్తూ వీరశైవం తగ్గిన ఆ మతానుయాయులైన కవులు సృష్టించిన ద్విపద మాత్రం దానికి గల గేయ గుణ సౌలభ్యం వల్ల ప్రజల్లో నిలిచిపోయింది అన్నారు. అందుకు ఉదాహరణగా తెలంగాణలో వినవచ్చే బొడ్డెమ్మ పాటలు, బతుకమ్మ పాటలు, కోలాటం, విసురురాయి, జోల పాటలు అన్నీ ద్విపదలే కావడం ఆ చందస్సుకున్న ప్రత్యేకతగా చెప్పారు.అలాగే పాలకులు తాము ఏ మతాన్ని విశ్వసించిన ఎవరిమీద తమ విశ్వాసాలను రుద్దకపోవడం ఈ శతాబ్దపు విశేషం అని పేర్కొన్నారు. సాహితీమూర్తులు భాషా శాస్త్రవేత్తలు తమ సహాధ్యాపకులైన డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి గారి అభినందన సంచిక చెలిమి చందనంలో వ్యాసం రాస్తూ భాషా విమర్శ అనేది ఆయనకు రెండు కళ్ళని నావల్ల కాదు అనే మాట ఆయనకు నిషేధాక్షరి అంటూ వారి సాహిత్య వ్యక్తిత్వాలను ఆవిష్కరించారు. శిష్యులు రాసిన పుస్తకాలకు గురువులు అభినందనలు ఆశీస్సులు అందజేయడం సాధారణం. కానీ గురువుగారి రచనలకు ముందుమాట రాసే అవకాశం శిష్యులకు దొరికే అరుదైన అవకాశం అర్హత ఆధారంగానే చంద్రశేఖరునికి దక్కిందని అభినందన వ్యాసం రాశారు. అలాగే మిత్రులు , పల్లేర్ల రామ్మోహన రావు రచించిన అవాల్మీకములు అనే పుస్తకానికి పీఠిక రాస్తూ రామాయణం పారాయణ గ్రంథం కాదని అది ఆచరణ గ్రంథం అని రాముడు ఆత్మానాం మానుషం మన్యే అని చెప్పుకున్నాడని వాల్మీకి రామాయణము లో లేని ప్రచారంలో ఉన్న విషయాలను గూర్చి పాఠకులకు తేట తెల్లం చేస్తూ శ్రమతో కూడిన పరిశోధనా కార్యక్రమమే అయినా పల్లేర్ల దానిని జయప్రదంగా నిర్వహించాడని అభినందించారు.చైతన్య సాహితీ సమాఖ్య 2017 లో పునర్ముద్రించిన దేవులపల్లి రామానుజ రావు గారి అభినందన సంచిక అక్షర దీపం కు రాసిన ముందు మాట సంస్మరణ-సమర్పణ అనే వ్యాసంలో కులం ,మతం, ప్రాంతం, భాష, యాస పేరుతో సమాజంలో సాహితీవేత్తలు చీలికలు పీలికలు అవుతున్న తరుణంలో రావు గారి కార్యరంగం ఎంత విస్తృతమైందో వైవిధ్యభరితమైందో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది . ఆనందం కలుగుతుంది అని వారి వ్యక్తిత్వాన్ని గురించి చెప్పారు. నా ఉద్యోగ విరమణ సందర్భంగా 2024లో వేసిన అభినందన సంచిక శంకరమంచీయం కు పీఠిక రాస్తూ పాలకుర్తిలో సాహిత్య కార్యక్రమాల్ని నిర్వహించడంతోపాటు అక్కడి ప్రముఖులను గురించి రచనలు చేసి పాలకుర్తి ప్రశస్తిని తెలుగు నేల నాలుగు చెరగులా ప్రసరింప చేశాడని ఆశీస్సులు అందించారు. ముఖ్యంగా ఇటీవల 90వ పుట్టినరోజు పండుగను జరుపుకున్న వారి సహధ్యాపకులు డాక్టర్ కె.వి.సుందరాచార్యుల గారి అభినందన సంచిక సహృదయ సుందరంకు వ్యాసం రాస్తూ వారు సంస్కృతాధాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. వారి ప్రోత్సాహం వల్లనే కళాశాలలోనే కాక ఇప్పటికీ సంస్కృత భాషా సాహిత్యాల అధ్యయనాన్ని కొనసాగిస్తున్నానన్నారు. దాశరథి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఇటీవల నవ తెలంగాణ దినపత్రికలో వారి సాహిత్య విశేషాలను వివరిస్తూ ప్రత్యేక వ్యాసం రాశారు.అలాగే 23-11-2024 న ప్రత్యేక ప్రసంగం చేశారు.

శ్రీ మోత్కూరు నరహరి గారు ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు ఉద్యమాలలో కీలక బాధ్యతలు నిర్వహించారు. సామాజిక స్పృహ లక్ష్యంగా పనిచేస్తున్న టి.యు.టి.ఎఫ్ లో పలు పదవులు నిర్వహించారు. వివిధ భాషలలో పరిచయం, పాండిత్యం ఉన్న కారణంగా ప్రముఖుల ఉపన్యాసాలను అనువదించారు. వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తులు నిర్వహించే సదస్సులలో పాల్గొన్నారు. పలు రచనలకు ప్రూఫులు దిద్దారు. ప్రగతిశీల ప్రజా ఉద్యమాలలో పౌర వేదికలలో పనిచేసేవారు వారిని పండిట్ జీ గా వ్యవహరిస్తారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్లను అలాగే వేదాల నుంచి సూక్తులను ఉటంకిస్తూ వారి చేసే సమన్వయ ప్రసంగాలు సభికుల్ని ఆకట్టుకుంటాయి. నవోదయ విద్యాలయాలలోనూ, వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలలో, విశ్వవిద్యాలయ వేదికలపై వారు పలు సాహిత్య ప్రసంగాలు చేశారు. అవన్నీ ఎంతో విజ్ఞానదాయకమైనవి. వారి సాహిత్య వ్యక్తిత్వం మరెందరికో స్ఫూర్తినివ్వాలని ఆశిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

# స్టాలిన్ నిర్ణయం చారిత్రాత్మకం

కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్ని రూపొందించి ప్రపంచానికి అందించిన జర్మన్ తత్వవేత్త కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో ప్రతిష్టించనున్నట్లు ఆ రా ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ గత గురువారం శాసనసభలో ప్రకటించడం హర్షణీయం. ఆ విధంగా ఆయన చేసిన ప్రకటన సమతా సమాజ ఆకాంక్షకు ప్రతిబింబించింది అని చెప్పవచ్చు. హేతువాదానికి ప్రతీకగా నిలిచిన ద్రవిడ నేల తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని ప్రతిష్టించనుండడం నిజంగా గర్వించదగ్గ విషయం. నేడు దేశంలోని ప్రజలలో అసమానతలు సృష్టిస్తూ అసహనానికి గురిచేస్తున్న ప్రజా వ్యతిరేక రాజకీయాలను సమూలంగా నేలమాలిగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తమిళ నేలలో ద్రవిడ ఉద్యమం మరియు కమ్యూనిస్ట్ ఉద్యమాలు సమాంతరంగా ముందుకు కొనసాగుతూనే ఉన్నాయి. అందువలన సమష్టి పోరాటాల ద్వారా ఉద్యమిస్తే సమానత్వం సిద్ధించి సమసమాజం వికసిస్తుంది అని చెప్పవచ్చు. ఈ తరుణంలో ఎం.కె. స్టాలిన్ ద్రవిడ సిద్ధాంతంతో పాటు మార్క్సిస్ట్ సిద్ధాంతానికి ఎనలేని ప్రాధాన్యతని కల్పిస్తూ ఆ దిశగా ముందుకు సాగడం ప్రశంసనీయం.

"ప్రపంచ చరిత్ర గతిని మార్చిన కొద్ది మంది వ్యక్తులలో కార్ల్ మార్క్స్ ప్రముఖ మేటివ్యక్తిగా ఉన్నారు. ఆయన అందించిన సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా విప్లవాలకు దారితీశాయి. ప్రపంచం ఇప్పటివరకు ఆయన సిద్ధాంతాల ఆధారంగా అనేక మార్పులకు పునాదిగా నిలిచాయి. 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప' అనే గొప్ప నినాదాన్ని కార్ల్ మార్క్స్ అందించి ప్రపంచ కార్మికులందరికీ ఉద్బోధ చేసి బాసటగా నిలిచారు. ఆయన గొప్ప విజనరీ కల తాత్వికుడు. కార్మికులు గెలవడానికి ఒక ప్రపంచం ఉంది అనే విశ్వాసాన్ని కూడా ఆయన కలిగించడంలో సఫలమయ్యారు" అని ఎం.కె. స్టాలిన్ అసెంబ్లీ సాక్షిగా కార్ల్ మార్క్స్ చేసిన కృషిని ప్రశంసించడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఈ విధంగా ఆయన అసెంబ్లీలో కార్ల్ మార్క్స్ కృషిని ప్రశంసించడం ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోయింది అని చెప్పవచ్చు. 'భారతదేశంలో గతంలో రాజకీయాలు ఎలా ఉన్నప్పటికిని, సామాజిక రాజకీయ పరిస్థితులు ఏమాత్రం మారనప్పటికిని భవిష్యత్తులో ఏదో ఒక సమయంలో దేశం ఆయా సామాజిక - రాజకీయ మార్పులకు ఆలంబనగా నిలిచి అందరికీ ఆదర్శ నమూనాగా ఉద్ధరించబడనుంది' అని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రత్యేకంగా కార్ల్ మార్క్స్‌ను ఉటంకిస్తూ పేర్కొనడాన్ని సునిశితంగా గమనించవచ్చు. 'భారతదేశం గురించి ఎవరూ రాయని సమయంలో దేశం గురించి విషయ విస్తృతంగా సరైన రీతి లో కార్ల్ మార్క్స్ గ్రంథస్థం చేశారు. కార్ల్ మార్క్స్ మరియు ఫ్రెడరిక్ ఎంగెల్స్ రాసిన కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టోను 1931లో పెరియార్ (ఇ.వి.రామసామి) ప్రత్యేకంగా తమిళంలోకి అనువదించి ప్రచురించారు' అని స్టాలిన్ ఈ సందర్భంగా గుర్తు చేయడం గమనార్హం.

కార్ల్ మార్క్స్ జీవించి ఉన్న కాలంలోనే ప్రఖ్యాత లేబర్ ఉద్యమం ఓ శతాబ్దం పాటు కొనసాగడాన్ని గమనించవచ్చు. వంద సంవత్సరాల క్రితం ట్రేడ్ యూనియన్ ఉద్యమం బాగా అభివృద్ధి చెందిన చెన్నై నగరంలో కష్టజీవుల తత్వవేత్త కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని తమిళనాడు ప్రభుత్వం అధికారికంగా నేడు ప్రతిష్టించబూనడం అన్ని విధాలుగా సముచితంగా ఉంటుంది అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. అందువలన ఈ క్రమంలోనే ఈ ద్రవిడ నమూనా తమిళనాడు ప్రభుత్వం 'కష్టజీవుల తత్వవేత్త కార్ల్ మార్క్స్ తాత్వికతను సమున్నతంగా గౌరవించాలి' అనే దానికి అత్యధిక ప్రాధాన్యాన్ని కల్పించడం శుభపరిణామం. అంతిమంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కష్టజీవుల తత్వవేత్త కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని చెన్నైలో ప్రతిష్టించే విధంగా సముచిత నిర్ణయాన్ని తీసుకొని ఆ దిశగా ముందుకు సాగడం తమిళ రాజకీయాలలో చారిత్రాత్మకంగా నిలిచిపోనుంది అని ఘం టాపథంగా చెప్పవచ్చు. ఏది ఏమైననూ 'చెన్నైలో ప్రతిష్టింప బోయే ఈ కార్ల్ మార్క్స్ విగ్రహం దోపిడి వ్యవస్థను నిలువరించేలా ప్రజా పోరాటాలకు క్రాంతదర్శిలా నిలిచిపోనుంది' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను అమలుపర్చాలి

- ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




తలకొండపల్లి, ఏప్రిల్ 6 (జనంసాక్షి) : దేశంలో ఉన్న ఏడు కోట్ల మందికి పైగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి 1996లో తీసుకొచ్చిన చట్టం అమలు చేయకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్,కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్,తలకోండపల్లి మండల మొదటి మహసభను భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నరసింహ్మ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు హాజరై ప్రసంగించారు. ఈ దేశంలో ఉత్పత్తిలో కీలకమైన కార్మికులకు సంపదను పంచడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ఈ దేశ నిర్మాణ రంగంలో ప్రముఖ పాత్ర కార్మికులదేనని,అయినా పాలక ప్రభుత్వాలు కార్మికుల కోసం ఉన్న చట్టాలను అమ్మలు పరచకుండా నిర్వీరం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు కార్మిక సోదరులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటియుసి యూనియన్ సమక్షంలో సంఘటితమై పోరాడాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఏప్రిల్ 21,22న శంషాబాద్ రంగారెడ్డి జిల్లాలో జరగబోయే 4,వ మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కార్మికులను కోరారు. అనంతరం తలకోండపల్లి మండల సిపిఐ. పార్టీ నిర్మాణ బాధ్యులు సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షునిగా జె.చందు, ప్రధాన కార్యదర్శిగా కుమార్,ఉపాధ్యక్షులుగా శ్రీను, ఉపాధ్యక్షులుగా దీప్లా నాయక్, ఉపాధ్యక్షులుగా బాలయ్య, సహాయ కార్యదర్శిగా శ్రీరామ్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేష్,రంగారెడ్డి జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు నరసింహ, ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శక్రు నాయక్, మండల కార్మికులు శ్రీశైలం, మల్లేష్, సిహెచ్.యాదయ్య, వెంకటయ్య, రమేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

# అంత్యోదయ స్ఫూర్తితో దూసుకుపోతున్న బీజేపీ

- బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నామాజీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** అణగారిన ప్రజల అభ్యున్నతి జనసంఘ్ నేతల అంత్యోదయ స్ఫూర్తితో బిజెపి నేడు దూసుకుపోతున్నదని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగు రావు నామాజీ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పేట పట్టణంలోని అన్ని వార్డులలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత జిల్లా కేంద్రంలోని నూతన పార్టీ కార్యాలయం ముందు పార్టీ జెండాను ఎగురవేసి పట్టణ పురవీధుల గుండా భారీ బైకులతో బైక్ ర్యాలీ నిర్వహించాటు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా పాల్గొన్న నాగు రావు నామాజీ, జిల్లా అధ్యక్షులు కే సత్య యాదవ్ మాట్లాడుతూ జనసంఘ్ బిజెపిగా అవతరించిన తరువాత ఎన్నో ఒడుదుడుకులు పడుతు నాడు ఇద్దరు ఎంపీలతో గెలుపు ప్రస్థానం ప్రారంభించి నేడు వరుసగా మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. అంతే కాకుండా బిజెపి స్వయంగా 15 రాష్ట్రాల్లో అధికారంలో మిత్ర పక్షాలతో కలిపి 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉండడమే కాకుండా ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం గల పార్టీగా బిజెపి నిలిచిందన్నారు. దీనికంతటికీ క్రమశిక్షణ గల కార్యకర్తలు ఉండదమెనని అన్నారు. అది పార్టీకి గర్వకారణమని అన్నారు. కార్యకర్తల బలంతోనే కేంద్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుని యావత్ ప్రపంచం భారత్ వైపు చూసేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘురామయ్యగౌడ్ ,పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్, సీనియర్ నాయకులు ఆశప్ప, విజయ్ కుమార్, గోపాల్ యాదవ్ ,రఘువీర్ యాదవ్ ,సిద్ది వెంకట్ రాములు,సత్య రఘుపాల్, పాండు,దానపోల్ల కతలప్ప, సత్యనారాయణ,శ్రీనివాసరెడ్డి,కృష్ణ, యువమోర్చా నాయకులు జాజాపూర్ మణిశంకర్ మోహన్ చేతన్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉరివేసి వేసుకుని వివాహిత మహిళ ఆత్మహత్య



**చేవెళ్ల, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** వివాహిత మహిళ ఇంట్లో ఉరివేసి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. చేవెళ్ల ఎస్సై శిరీష, మృతురాలు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న గోవిందగారి పురుషోత్తం రెడ్డికి గత రెండు సంవత్సరాల క్రితం హైదరాబాద్ నగరంలోని కాళీ మందిర్ చెందిన తరుణి అలియాస్ యమున (30) పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. అయితే భార్య భర్తలు ఇద్దరు అన్యున్యంగా తమ కుటుంబ సభ్యులతో కలిసి మెలసి జీవనం సాగిస్తున్నారు. అయితే ఈనెల 5వ తేదిన రాత్రి 11 గంటల సమయంలో తన ఇంట్లోనే బెడ్రూంలోకి వెళ్లి గడియపెట్టుకుంది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు ఏంతపిలిచినా తలుపులు తీయకపోవడంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా చున్నీ సాయంతో ఫ్యాన్ కు ఉరివేసుకుని ఉంది. దీంతో పోలీస్ లకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి పోలీస్ లు చేరుకుని మృతదేహన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం మృతదేహనికి పోస్టుమాతం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలు తల్లి పద్మావతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శిరీష తెలిపారు.

## తెలంగాణ విత్తనాల పండుగలో బిఆర్ఆర్ విద్యార్థులు



**జడ్చర్ల, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** ఈ నెల 4, 5, 6 తేదీలలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఎర్త్ సెంటర్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ విత్తనాల పండుగలో జడ్చర్ల డా. బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 వాలంటీర్లు రవీందర్, భరత్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. సదాశివయ్య ఆధ్వర్యంలో సుమారు 530 విత్తనాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పండుగలో దేశం నలుమూలల నుండి అనేక మంది రైతులు, రైతు సంఘాలు, ఇతర సంస్థలు స్టాల్ లను ఏర్పాటు చేయగా ప్రభుత్వ రంగం నుండి డా. బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్గొంది. అందరూ పంట మొక్కల విత్తనాలను ప్రదేశిస్తే విద్యార్థులు గత 3 సంవత్సరాలలో అనేక అటవీ ప్రాంతాల్లో సేకరించిన 530 జాతులకు చెందిన విత్తనాలను ప్రదర్శించారు. మొట్ట స్టాల్ లలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వన్యజాతుల విత్తన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఆదివారం ప్రముఖ సినీనటుడు నాగినీడు, నాగర్ కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి సందర్శించి డా. సదాశివయ్య ను విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. సుకన్య, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మర్పల్లి, ఏప్రిల్ 6 (జనంసాక్షి) : మండల పరిధిలోని పట్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 వ సంవత్సరంలో 10 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 29 యేండ్ల తరువాత కలిసినందుకు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారి బాగోగులు వారు చేస్తున్న పనులు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు విశ్వనాధం, సర్దార్ మియా,లాలయ్య, ప్రభాకర్, స్నేహలత, సురేశ్ పూర్వ విద్యార్థులు శాలువా మెమంటోతో సన్మానించారు.. ఈ కార్యక్రమం లో పూర్వ విద్యార్థులు రాజు, సునీల్, విశ్వనాథం, మధు స్వామి, ప్రేమ్ కుమార్, ప్రభు, శ్రీనివాస్, లాలు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాత నటరాజ్‌కు మానవత వీరుడు అవార్డు



**జడ్చర్ల, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** అత్యధిక సార్లు రక్త దానం చేసి రక్త దాతగా పేరొందిన ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ డాక్టర్ అంబటి నటరాజ్ కు జాతీయ స్థాయిలో మానవత వీరుడు (హీరో ఆఫ్ హ్యుమానిటీ) అవార్డు పొందారు. జిల్లా రక్త దాతలు, ప్రేరేపకుల ఫోరం కోరాపుట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదానంపై ఒడిషా రాష్ట్రం కోరాపుట్ లోని మున్సిపల్ ఆడిటోరియల్ లో ఈ నెల 5, 6 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ కాన్ఫరెన్స్ ముగింపు సందర్భంగా జాతీయ స్థాయిలో వందకు పైగా రక్త దానం చేసిన రక్త దాతలకు మానవత వీరుడు అవార్డులను ప్రదానం చేశారు. 167 సార్లకు పైగా రక్తదానం చేసి సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ కు మానవత వీరుడు అవార్డును ప్రదానం చేశారు. కోరాపుట్ జిల్లా కలెక్టర్ కీర్తి వాసన్, ఎమ్మెల్యే రఘురామ్, జిల్లా రక్త దాతల, ప్రేరేపకుల ఫోరం అధ్యక్షులు సంజీవ్, కార్యదర్శి షేక్ ఇబ్రహీంల చేతుల మీదుగా లయన్ నటరాజ్ మానవత వీరుడు అవార్డు అందుకున్నారు. అత్యధిక సార్లు రక్త దానం చేయడంతో పాటు గత ఏడాది రాష్ట్ర పతి నుంచి అవార్డు అందుకున్న నేపథ్యంలో నటరాజ్ సేవలను గుర్తించి జాతీయ కాన్ఫరెన్స్ కు ఆహ్వానించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నటరాజ్‌ను పలువురు అభినందించారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ పార్టీదే అధికారం

- బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు ఆవుల నారాయణ



**వీపనగండ్ల, ఏప్రిల్ 7 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 45 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఆవుల నారాయణ మాట్లాడుతూ 06-07-1980 ఏర్పడిన ప్రారంభంలో భారతీయ జనతా పార్టీ రెండు ఎంపీ సీట్లు నుండి ప్రస్తుతం మూడు పర్యాయాలు కేంద్రంలో వరుసగా అధికారం చేపట్టింది అని తెలిపారు. ప్రధానమంత్రి గా మూడుసార్లు నరేంద్ర మోడీ గెలుపు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. 370 ఆర్టికల్ ,అయోధ్య రామ మందిరం, త్రిబుల్ తలాక్, ప్రస్తుతం వోక్స్ బోర్డ్ ఇలాంటి చట్టాలను శాంతియుతంగా పరిష్కరించి ఎన్నో సంస్కరణను తీసుకువచ్చి దేశ ప్రజల అభిమానం పొందిన పార్టీగా భారతీయ జనతా పార్టీకి గుర్తింపు వచ్చింది అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి పార్టీ అధికారం రావడం ఖాయామని అన్నారు. అదేవిధంగా మండల ప్రజలకు బిజెపి కార్యకర్తలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు రాకేష్ యాదవ్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేష్ యాదవ్, ఉపాధ్యక్షులు విష్ణు, మండల కార్యకర్తలు ఎల్లగౌడ్,రవి,రవి గౌడ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యువత క్రీడా స్ఫూర్తితో రాణించాలి



**మల్దకల్, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో ఈనెల 14 తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం వైవిఆర్ గ్రౌండ్ లో ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా మొదటి రోజు బిజ్వారం యంగ్ ఫైటర్ చెన్నుగోనిపల్లి మధ్య జరుగుతున్న ఆటను కాంగ్రెస్ నాయకులు వై శ్రీనివాస్ రెడ్డి క్రికెట్ క్రీడలను పరిచయం చేసుకొని టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వై శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కాలంలో విద్యతో పాటు క్రీడ రంగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని క్రీడలకు పూర్వవైభవం తీసుకురావాలని, గ్రామంలో విద్యార్థులు, యువకులు విద్యతో పాటు క్రీడ రంగాల్లో కూడా నైపుణ్యత ఉండి క్రీడల్లో ఆడడం వల్ల మంచి ఆరోగ్యం,ఏకాగ్రత, శరీరాక దృఢత్వం,క్రీడల్లో గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు మంచి ప్రతిభను ప్రదర్శించి మీ తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే ఓడిపోయిన నిరుత్సాహం పడకూడదు, గెలిచిన అన్ని గర్వపడకూడదు, స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలి,ఓడిపోయిన ఓటమి విజయానికి నాందిగా భావించాలని ఆయన పేర్కొన్నారు.

# మత సామరస్యతను చాటుకోవడం ఆదర్శనీయం

- తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి




**తాండూరు, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** హిందూ, ముస్లింలు సర్వమత సమ్మేళనంకు ఆదర్శంగా నిలవడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. రంజాన్ పండగ తర్వాత నిర్వహించే ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని శనివారం రాత్రి జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో తాండూరు పట్టణం సమద్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు . ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో అన్ని మతాలు కలిసి మెలసి ఔనత్యాన్ని చాటుతున్నాయని అన్నారు. అన్ని వర్గాల వారు పండగలను సంతోషంగా జరుపుకుంటూ మత సామరస్యతను చాటుకోవడం ఆదర్శనీయ మన్నారు. ఈ కార్యక్రమం లో మైనారిటీ మత పెద్దలు డాక్టర్ ఖాలీద్ ముభాషీర్ ,ఉజ్ జాఫర్ సాబ్, అజిజ్ ఉజ్ రెహమాన్, మౌలానా ఖలీల్ ఉల్ రెహమాన్, సయ్యద్ సాబెర్ పాషా, అబ్దుల్ గఫ్ఫార్, కమల్ అత్తర్, సయ్యద్ అబ్దుల్లా మభశేర్, అంజాద్ హుస్సేన్, అహద్ సాబ్, ఖుర్షిద్ భాయ్, అబ్దుల్ రావుఫ్,రాష్ట్ర ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, గడ్డలి రవీందర్, బీదర్ రాజశేఖర్, అబ్దుల్ ఖవి, బిర్కెట్ రఘు, భగవాన్, సంకేత్, ఆనంద్ గౌడ్ చెన్నారం శేఖర్, మరియు హిందూ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ చైతన్య యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో అంబేద్కర్ చైతన్య యువజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా అధ్యక్షులు హనుమండ్ల నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు జుట్టు నాగరాజు, ప్రధాన కార్యదర్శి హనుమండ్ల సురేందర్, కోశాధికారి త్యాగరాజు, ప్రచార కార్యదర్శి తరుణ్ లను ఎన్నుకున్నారు ఈ సందర్బంగా నూతన కమిటీ కి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

**మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి**



**తాండూరు, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** అధైర్య పడకండి బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. యాలాల మండలం రాఘవాపూర్ బీఆర్ఎస్ కార్యకర్త సురేష్ తల్లి అనారోగ్యంతో తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆస్పత్రికి పైలెట్ రోహిత్ రెడ్డి వెళ్లి పరామర్శించారు అధైర్య పడకండి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో యాలాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవిందర్ రెడ్డి,మరియు మల్లారెడ్డి,బిఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడిగా ఫణింద్ర నియామకం



**ఉప్పల్, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** ఉప్పల్ డివిజన్ ఆధ్యక్షుడిగా ఫణీంద్ర నియమితులు కాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అతనికి నియామక పత్రం అందజేశారు. బీజేపీని డివిజన్ వ్యాప్తంగా మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, తాడూరి శ్రీనివాస్, మీసాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** పేద ప్రజల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం అని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి అన్నారు. ఆదివారం నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్, బాయిరం, జలాలపూర్ గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఎక్లాస్‌పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి సీనియర్ నాయకులు ఉషప్ప యువజన కాంగ్రెస్ నారాయణపేట మండల అధ్యక్షులు కాషా తారక్ మరియు తిమప్ప, జి లక్ష్మణ్, కె. ఆనంద్ వోజిర్, దేవప్ప, రాము, తంగమోల అంజప్ప,ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# మట్టి మాయం

## తహసిల్దార్, ఆర్ఐ కనుసన్నల్లో మట్టి తరలింపు...?



**పిల్లి కళ్లు మూసుకుంటే.. ఎంచక్కా ఎలుకల పని ఎలకలు చేస్తాయి. ఎలాంటి ఆందోళన, ఆత్రుత, భయం లేకుండా హాయిగా పాలు తాగి వెళతాయి. ఇదే పరిస్థితి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం లోని మొగుడంపల్లి మండలంలో నెలకొంది. మట్టి మాఫియా అధికారులకు ఇచ్చే మామూళ్ల కిక్కు అలాంటిది. ఇష్టారాజ్యంగా రోజుల తరబడి వందల సంఖ్యలో వాహనాల్లో మట్టి తరలిస్తున్నా అధికారులు కిమ్మనకుండా ఉంటున్నారు. ఆ వివరాలేంటో మీరే చదవండి.**

- సమాచారం ఇచ్చిన స్పందించని రెవెన్యూ అధికారులు
- మొగుడంపల్లిలో విలువైన ఎర్ర మట్టి అక్రమంగా తరలింపు
- రాత్రివేళల్లో టిప్పర్‌లతో..
- ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి

**మొగుడంపల్లి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి)**
అధికారుల అవినీతి కొంత.. నిర్లక్ష్యం మరికొంత. వెరసి..లక్షలాది రూపాయల విలువచేసే ఎర్ర మట్టి తరలిపోతోంది. అధికారుల మెతక వైఖరిని పసిగట్టిన మట్టి మాఫియా మట్టిని రాత్రి తెల్లవార్లు ఆగమే ఘాలపై మట్టి తన్నుకుపోతున్నారు. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన లక్షలాది రూపాయల రాయల్టీకి కన్నం వేస్తున్నారు. వ్యాపారులు ఇచ్చే మామూళ్లకు తలొగ్గేవారు గాఢ నిద్ర నటిస్తున్నారన్న విమర్శలువస్తున్నాయి.

**కనుమరుగవుతున్న గుట్టలు..**

మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్, గోపనపల్లి, మన్నాపూర్, ఖాన్ జమల్పూర్, గౌడిగార్పల్లి,అసద్ గంజ్, ఇప్పేపల్లి గ్రామ శివారుల్లో గల గట్టు గుట్టను రాత్రి వేళల్లో జేసీబీ లతో ఎర్రమట్టిని తవ్వి, టిప్పర్లలో తరలిస్తూ లక్షలాది రూపాయల అక్రమ దందుకుంటు న్నారు. దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం నిద్ర మత్తులో ఉన్నట్లు వ్యవహరిస్తుండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జెసిబితో మట్టిని తోడి టిప్పర్ల ద్వారా ఇండ్ల నిర్మాణాలకు, పొలాలకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్క టిప్పర్ కు 13 వందల నుంచి 15 వందల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మట్టి తరలించే ప్రదేశానికి ఎవరైనా తనిఖీకి వెళ్తే రెవెన్యూ అధికారులు ముందుగానే మట్టి వ్యాపారులకు సమాచారం ఇచ్చి అక్కడనుండి వెళ్లిపోయేలా చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. మట్టి తరలిస్తున్న జెసిబి, ట్రాక్టర్లను కొన్ని సందర్భాల్లో పట్టుకున్నప్పటికీ నామమాత్రపు జరిమానా వేసి రెవెన్యూ అధికారులు వదిలేస్తున్నట్లు తెలుస్తోంది.



**వాల్టా చట్టానికి తూట్లు..**

2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహజ వనరులను కాపాడేందుకు వాల్టా (వాటర్, ల్యాండ్, ట్రీస్) చట్టాన్ని రూపొందించింది. కానీ ప్రస్తుత అధికార యంత్రాంగం ఈ చట్టాన్ని పక్కన పెట్టి, అక్రమ మైనింగ్ కు లైన్ క్లియర్ చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. రెవెన్యూ, మైనింగ్, అండర్‌గ్రౌండ్ వాటర్ రిసోర్స్ శాఖల అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలించటానికి వీలుండదు. కానీ కొందరు స్వార్థపరులు అధికారుల కన్ను గప్పి, ప్రకృతి వనరులను ధారాదత్తం చేస్తున్నారు.

## పూలే విగ్రహావిష్కరణకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు ఆహ్వానం



**బిజినేపల్లి, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో ఈనెల 9న మహత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో భాగంగా చేపట్టిన పూలే విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ను దళిత, బీసీ సం ఘాల నాయకులు ఆహ్వానించినట్లు తెలిపారు. హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో కలిసి పూలే విగ్రహా ఆవిష్కరణకు ఆహ్వానించి పుష్పగుచ్చం. శాలువాతో ఘనంగా సన్మానించినట్లు బీసీ సంఘం నాయకుడు గంగనమోని కిరణ్, దళిత బహుజన సంఘాల నాయకుడు మంగి విజయ్, విగ్రహా ఆవిష్కరణ కమిటి అధ్యక్షుడు అంతటి రాజేందర్ గౌడ్ తెలిపారు. సామాజిక ఉద్ధరణకు జీవితాని త్యాగం చేసిన మహనీయుడి విగ్రహా ఆవిష్కరణ మహోత్సవానికి హాజరవుతానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీసీ సంఘం మండల అధ్యక్ష డు సత్యశీల సాగర్, సిద్ధుల శివ తదితరులు ఉన్నారు.

## ఇండియన్ ఆర్మీకి ఎంపికైన యువకులను సన్మానించిన రాజ్‌కుమార్ రెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** ఇండియన్ ఆర్మీ, నేవి, టెరిటోరియల్ విభాగాలకు నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలానికి చెందిన పలువురు యువకులు ఎంపికయ్యారు. మండలానికి చెందిన టి.ఆనంద్, బి.రవికుమార్, వివేక్, ఊషప్ప, అనిల్ కుమార్, టి.శ్రీకాంత్, చింటు నాయక్, శ్రీకాంత్, కుమార్ గౌడ్, ఉషనప్ప, శివ, సిద్ధూ, యోగేష్, పవన్ కుమార్, రఘువర్ధన్ లు ఎంపికయ్యారు. విషయాన్ని తెలుసుకున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ఇండియన్ ఆర్మీ తదితర విభాగాలకు దామరగిద్ద మండలానికి చెందిన యువకులను ఆదివారం నారాయణపేటలో సన్మానించారు. దామరగిద్ద మండలానికి చెందిన యువకులు ఎంపిక కావడం సంతోషకరమని అన్నారు. అంతకుముందు ఆర్మీ తదితర విభాగాలకు ఎంపికైన యువకులను రాజ్ కుమార్ రెడ్డి శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్, రుద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనిల్, శివరాజ్, ఎం.సంతోష్, అశోక్, వెంకటరావు, నాగురావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లయోధులకు ప్రోత్సాహం

- కుస్తీ పోటీలకు సహకారం
- సామాజిక సేవకులు ఖిజర్ యఫై



**జహీరాబాద్, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** పోటీల్లో ఒకరు గెలవడం ఇంకొకరు ఓడటం సహజమని, పోటీల్లో ఇద్దరు గెలిస్తే ఆది పోటీ కాదు స్నేహపూర్వక ఆట అని, కుస్తీల్లో గెలిచిన వారు రాబోయే పోటీలకు సన్నద్ధమై మరిన్ని కుస్తీల్లో గెలవడానికి ప్రయత్నించాలని సామాజిక సేవకులు, బీఆర్ఎస్ నాయకుడు ఖిజర్ యఫై అన్నారు. చివరి పోటీల్లో విజేతలుగా నిలిచిన మొహమ్మద్ పహిల్వాన్ మరియు కోచ్ మొహమ్మద్ ఖాదీర్ అహేమద్ కు ఖిజర్ యఫై చారవాని ద్వారా అభినందించారు. విజేతలుగా నిలిచిన పహిల్వాన్లకు ఖిజర్ యఫై ప్రతినిధి మల్చేల్మా మాజీ ఎంపిటిసి మొహమ్మద్ ఇస్మాయిల్, బీఆర్ఎస్ మండల మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ వాహీద్ ద్వారా నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మల్చేల్మా గ్రామ ఎంపిటిసి మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మంచి శిక్షణ కలిగిన మల్లయోధులు ఇక్కడికి విచ్చేసి తమ ప్రదర్శనలు చుయించడం స్వాగతించదగ్గ పరిణామం అని, కొన్ని పోటీలు మన ప్రియతమ నాయకులు ఖిజర్ యఫై గారి తరపున నిర్వహించడంపై వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని, భవిష్యత్తులో కూడా వారి సహకారం ఇలాగే కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ వాహీద్ మియా, మల్చేల్మా గ్రామ తాజా మాజీ సర్పంచ్ మోగిలిగుండ్ల పాండురంగ రెడ్డి, జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షుడు మొహమ్మద్ ఖాదీర్ అహేమద్, మాజీ ఉప సర్పంచ్ మొహమ్మద్ చంద్ పాష, మొహమ్మద్ జాఫర్, అశోక్ శెట్టి, మాజీ ఎంపిటిసి మొహమ్మద్ అబ్దుల్ హాఫిజ్, మొహమ్మద్ సోహైల్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోదండరాముడికి కొత్త పల్లకి అందజేత



**శివ్వంపేట, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన శివంపేట గ్రామంలో అతి పురాతనమైన కోదండ రామస్వామి ఆలయం ఉన్నది. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉన్నది, ఇక్కడ ఉన్న రాములవారిని కొర్ర మీసాల రాముడిగా భక్తులు, గ్రామస్తులు పిలుస్తారు. గ్రామ దేవతగా, భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం గా పేరు గాంచిన ఈ కోదండ రాముడికీ ప్రతినిత్యం ధూప దీప నైవేద్యాలతో పాటు అభిషేకాలు ఘనంగా జరిపేవారు. కాలక్రమేనా వచ్చిన మార్పులకు అనుగుణంగా దేవాలయం యొక్క అభివృద్ధి కోసం భక్తులు, గ్రామస్తులే ముందుకు వచ్చి గత రెండు సంవత్సరాల నుంచి రాముల వారి కల్యాణ తంతును భక్తుల సహకారంతో వేద పండితులు వామన శర్మ ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శివ్వంపేట గ్రామానికి చెందిన శేరిపల్లి రాములు అనే భక్తులు సీతారాముల పల్లకి సేవ కోసం తన సొంత డబ్బులతో నూతనంగా తయారు చేయించిన కొత్త పల్లకిని శ్రీరామ నవమి రోజున ప్రముఖ వేద పండితులు శాస్త్రుల వామన శర్మకు స్థానిక కోదండ రామాలయంలో అందజేశారు.

## ఘనంగా అభ్యాస స్కూల్ వార్షికోత్సవ వేడుకలు






**మక్తల్, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** మఖ్తల్ పట్టణ కేంద్రంలోని అభ్యాస ది స్కూల్ ప్రైవేట్ పాఠశాలలో 2025 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వార్షిక వేడుకలను పాఠశాల యాజమాన్యం రాజకీయ ప్రముఖులు సరస్వతి చిత్రపటానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాలల్లో వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులలోని ప్రతిభ పాటవాలు వెలికి తీయడానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్న శిఖరాలను అధిరోహించాలని, సోషల్ మీడియాలకు బానిసలు కాకుండా తగు జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్న ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్న ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో పాటు తల్లిదండ్రుల పెంపకం చాలా ముఖ్యమని అన్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు పలు సందేశాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్సులు,కరాటే,పౌరాణిక దేశభక్తి నృత్యాలతో పలువురిని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బలరాం రెడ్డి,దేవరెంటి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ కర్నె లక్ష్మి,రమేష్ రావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్, విభీషణ్, స్కాలర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కర్నె క్రిష్ణ మూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరి, విజయలక్ష్మి, అంబరీష్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 5 లక్షల బియ్యపు గింజలపై శ్రీరామ నామం





**గద్వాల్ రూరల్, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వెంకటరమణ కాలనీకి చెందిన ఎల్లూరు శ్రీలక్ష్మి గృహిని భర్త వెంకటేష్ అడ్వకేట్.శ్రీరాముని పై ఉన్న భక్తి తో శ్రీలక్ష్మి శ్రీరామనవమి కోసం గత పది సంవత్సరాలుగా ప్రతి ఏటా శ్రీరామనవమి సందర్భంగా జరిగే సీతారాముల వారి కళ్యాణానికి ఇప్పటివరకు సుమారుగా 5 లక్షల బియ్యపు గింజలపై శ్రీరాముని నామాలను రాసి తన భక్తిని చాటు కుంది.ప్రతి ఏడాది బియ్యపు గింజలపై శ్రీరామ నామము వ్రాసి భద్రాచల రాముల వారికి,ఒంటిమిట్ట ఆంజనేయ స్వామి దేవాలయానికి గత సంవత్సరం నుండి అయోధ్య శ్రీరాముల వారికి ప్రతి ఏడాది గద్వాల్ కోటలోన్నీ ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణానికి తలంబ్రాలుగా వీటిని అందిస్తున్నట్లు తెలిపారు.గత సంవత్సరం భద్రాచల రాముల వారికి 1,50,116 బియ్యపు గింజలను స్వామివారి కల్యాణానికి సమర్పించినట్లు ప్రతి రోజు శ్రీ సీతారాముల పాదాల చెంత ఉంచి అనంతరం అక్షితలలో కలిపి భక్తులకు పంచడం ఆనవాయితీగా వస్తోంది అన్ని శ్రీరాముడి కృప,కుటుంబ సభ్యుల సహాయం వలన ప్రతి ఏడాది రెట్టింపు బియ్యపు గింజలపై శ్రీరాముని నామాలను రాయడం జరుగుతుందని శ్రీరామనవమి కి నాలుగు నెలల ముందు నుండి బియ్యంపై శ్రీరామ నామాలను రాసే ప్రక్రియ చేపట్టి ప్రతి శ్రీరామ నవమికి ముందు శ్రీరాముని నామాలతో ఉన్న బియ్యాన్ని సిద్ధంగా ఉంచుతానని తెలిపారు.కాగా ఈ ఏడాది 12,000 బియ్యపు గింజలపై శ్రీరాముని నామాలను లిఖించి వేడుకలకు సిద్ధం చేసినట్లుగా ఆమె తెలిపారు.

## టేక్మాల్ మండల కేంద్రంలో కలెక్టర్ పర్యటన



**టేక్మాల్, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** టేక్మాల్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్ మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్ సంబంధిత వాటిని పరిశీలించి, ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు మెరుగైన వైద్య అందించాలని, వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టుకోవాలని, సమయపాలనతో విధులు సక్రమంగా నిర్వహించి ప్రభుత్వ ఆదేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలిస్తూ విద్యార్థులను ప్రశ్నలతో జవాబులతో సామర్థ్యాలను పరీక్షించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కోతలు లేని విద్యుత్ అందించడం లక్ష్యంగా అధికారులను సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

## పలు గ్రామాల్లో బీజేపీ జెండా ఆవిష్కరణ



**నంగునూరు, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** నంగునూరు మండలంలోని సిద్ధన్నపేట,మగ్దుంపూర్, రాజగోపాల్పేట గ్రామాలలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ,అమిత్ షాల నేతృత్వంలో వచ్చే ఎన్నికలలో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు వాసర యాదమల్లు, పరకాల తిరుపతిరెడ్డి, గంధం పరమేశ్వర్ రెడ్డి, పంగ నరసింహారెడ్డి, మంత్రి కొమురయ్య, అన్న రాజయ్యలు తెలిపారు. పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం నినాదాలతో హోరెత్తించారు. చిన్నారులు, వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లు తిరుపతి, కత్తుల పరమేశ్వర్ రెడ్డి, చిలుకల తిరుపతిరెడ్డి, అచ్చిన రవి, కొలుపుల ఆశోక్ నాయకులు బెండల రాజ లింగం,జాప అంజయ్య, మయోజు రాజయ్య,బండారు భూపతి తదితరులు పాల్గొన్నారు.

## బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమలో పేలిన బాయిలర్

- తప్పిన పెను ప్రమాదం



**సదాశివపేట, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** సదాశివపేట మండల పరిధి నందికంది గ్రామ శివారులోని బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమలలో ఆదివారం నాడు ఉదయం 5:50 నిమిషాల సమయంలో సంభవించిన భారీ ప్రమాదం. పరిశ్రమలోని బాయిలర్ పేలడంతో తీవ్రత అధికంగా ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. విస్ఫోట తీవ్రతకు గోడలు, ఇనుప పైపులు, రేకులు, యంత్రాలు ఇతర పరికరాలు తునా తునకలయ్యాయి. ఘటన జరిగిన సమయంలో ప్లాంట్లో ఎవ్వరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.వెంటనే స్పందించి యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని కోరారు.





# ఇల్లందకుంట కన్నుల పండువలా..

శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం
కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు.

**కరీంనగర్ బ్యూరో (ఇల్లందకుంట) , ఏప్రిల్ 06 (జనంసాక్షి) :**



కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగలా సాగింది. భద్రాచలం తర్వాత రెండవ అతిపెద్ద కళ్యాణ మహోత్సవం ఇల్లందకుంటలో జరుగుతుండడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున కళ్యాణానికి తరలివచ్చారు. హుజురాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. వేద మంత్రోచ్చారణ మధ్య ఇల్లంతకుంట దేవస్థానం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, హుజురాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తదితరులు స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. దేవస్థానంలో ఈ నెల 4 నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 16 వరకు కొనసాగనున్నాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలతో, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తోంది. కళ్యాణం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం షామియానాలు, చలువ పందిళ్ళు, భారీకేడ్లు, కార్పెట్లు ఏర్పాటు చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి కల్పించారు. స్వామి వారి కళ్యాణాన్ని జిల్లా వ్యాప్తంగా భక్తులు వీక్షించేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. వివిధ మార్గాల ద్వారా కళ్యాణానికి హాజరయ్యే భక్తుల కోసం ఆరు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ చేయించారు. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయి, లక్ష్మీ కిరణ్, ఆర్డీఓలు రమేష్ , మహేష్, ఏసీపీ శ్రీనివాస్, దేవస్థానం ఈవో సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 (జనంసాక్షి)**



హరిహర క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అదివారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు,తలంబ్రాలను కార్యాలయం నుండి రాజన్న ఆలయం వరకు మేళతాళాలతో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కమిషనర్ అన్వేష్ సిబ్బంది తీసుకువచ్చారు. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు వేములవాడ బిజెపి నాయకులు స్వామి వారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలను సమర్పించారు. భక్తులు కళ్యాణాన్ని తిలకించేందుకు ఆలయ అధికారులు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. భక్తులు ఎండ వేడిమి తట్టుకునేందుకు చలువ పందిళ్లు,కలకత్తా డెకరేషన్ పందిర్లు ఆలయ అవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. కళ్యాణ వేదిక వద్ద ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసి భక్తులను జోన్ల వారీగా కూర్చోబెట్టారు. దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ, త్రాగు నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. 30 వేల మంది భక్తులకు పార్కింగ్ స్థలంలో ఆలయం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## రీసైకిల్ బాటిల్స్‌తో పర్యావరణ అనుకూల బెంచ్



**ఖైరతాబాద్, ఏప్రిల్ 06 (జనం సాక్షి) :** పర్యావరణ బాధ్యతలో భాగంగా దేశంలోని ప్రముఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బ్రాండ్‌లలో ఒకటైన క్లియర్ ప్రీమియం వాటర్ డెహ్రాడూన్‌లో 38వ జాతీయ క్రీడల్లో మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజీలో రీసైకిల్ ప్లా స్టిక్ బాటిళ్లతో తయారు చేసిన బెంచీలను ఏర్పా టు చేసినట్లు క్లియర్ ప్రీమియం వాటర్ ఫౌండర్, సీఈఓ నయన్ షా ఆదివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. వీటిని ఉత్తరాఖండ్ క్రీడల మంత్రి రేఖా ఆర్య సమక్షంలో ఆవిష్కరించినట్లు తెలిపా రు. ఆయన మాట్లాడుతూ ఉపయోగించిన ప్లాస్టిక్ బాటిళ్లను పబ్లిక్ యుటిలిటీలుగా మార్చడం ద్వా రా ప్లాస్టిక్ వ్యర్థాలపై లూప్‌ను మూసివేసి, పర్యావ రణ ప్రయోజనాల కోసం నేరుగా నమూనాను రూ పొందిస్తున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌తో విస్మరించిన బాటిళ్లను కూడా అర్థవంతంగా మిషన్ జీరో ప్లాస్టిక్ బాటిల్ వేస్ట్ సాధించవచ్చని ప్రపంచానికి చూపిస్తు న్నామని చెప్పారు.

## ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలి : ఏఐకేఎంఎస్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 6, (జనంసాక్షి)**

ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపి వేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం గుండ్ల సోమారం గ్రామంలో ఈనెల 8న ఇందిరా పార్క్ వద్ద జరిగే ప్రజా ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసి జాతి హననానికి బిజెపికి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎడతెగని విధంగా హత్యాకాండకు తెగబడుతున్నాయని అన్నారు. చత్తీస్గడ్ రాష్ట్రంలో వందలాది మందిని ఎన్కౌంటర్ల పేరిట హత్య గావిస్తున్నారని విమర్శించారు. ఈ హత్యకాండను ప్రత్యేకించి ఆదివాసి జాతిని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం హతమారుస్తున్న విధానాన్ని దేశంలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ఆలోచనపరులు తీవ్రంగా వ్యతిరేకించి ఖండించాలని అన్నారు. దేశంలో ఇప్పటికే ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ కు కట్టబెట్టారని, నేడు అడవి సంపదను అదానికి అప్పగించడానికి 2026 మార్చి నాటికి అడవుల నుండీ ఆదివాసులను గెంటివేయడానికి ఆఫరేషన్ కగార్ ను తీసుకొచ్చిందని ఆరోపించారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చెస్తూ ఏప్రిల్ 8న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ప్రజాధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, ఏఐకేఎంఎస్ నాయకులు దుగుట రెడ్డి, బాపు, మల్లేష్, లింగన్న, లక్ష్మీ, మల్లీశ్వరి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కంచె గచ్చిబౌలి భూమి విషయంలో ముఖ్యమంత్రి తీరు బాగాలేదు

**ప్రభుత్వం కేటాయించిన భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఎలా అమ్ముతారు?**
**రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య**



**హైదరాబాద్ (జనంసాక్షి) :**

రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య కంచె గచ్చిబౌలి భూమి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు బాగాలేదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్టూడెంట్స్ అసోసియేషన్, అల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, ఓయూ జేపీసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఆర్ కృష్ణయ్య. 400 ఎకరాల భూమి వేలం అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆయన ఆ తీర్పు ప్రభుత్వానికి "చెంపపెట్టు లాంటిది" అంటూ పేర్కొన్నారు. కంచె గచ్చిబౌలి ప్రాంతంలోని యూనివర్సిటీని బుల్డోజర్లతో ధ్వంసం చేసే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతిని ధ్వంసం చేయడం సరికాదు, ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయని ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లను పరిగణలోకి తీసుకుని, 400 ఎకరాల భూమిని యూనివర్సిటీకి అప్పగించాలని కోరారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు మంచిది అవుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ అంశం తెలంగాణ రాజకీయాలలో తీవ్ర చర్చనీయంశంగా మారింది.

# మూవర్స్ అండ్ ప్యాకర్స్ ముసుగులో గంజాయి



ఒడిషా నుంచి హర్యానా వరకు గంజాయి స్మగ్లింగ్ ప్లాన్
షామీర్పేట్ వద్ద పోలీసులు రూ. కోటి విలువైన గంజాయి స్వాధీనం

**శామీర్ పేట (జనంసాక్షి)**

ప్యాకర్స్ అండ్ మూవర్స్ పేరిట ఇంటి సామాన్లను తరలిస్తున్నట్లు బిల్డ్ అప్ ఇచ్చి, వాస్తవానికి భారీగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను షామీర్పేట్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం నాడు ఓఆర్ఆర్ వద్ద ఈ స్మగ్లింగ్ బస్తీ బట్టబయలైంది. ఈ ఘటన వివరాలను సైబరాబాద్ డీసీపీ కోటిరెడ్డి ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. బోయిన్‌పల్లికి చెందిన ప్రదీప్ కుమార్ అనే వ్యక్తి తనకు ఉన్న బొలెరో వాహనాన్ని ప్యాకర్స్ అండ్ మూవర్స్ పనులకు ఉపయోగిస్తూ ఉండేవాడు. అదే ప్రాంతానికి చెందిన సన్నీ అనే వ్యక్తి డ్రైవర్‌గా, మనీష్ కుమార్ హెల్పర్‌గా చేరారు.మార్చి 31న ప్రదీప్ కుమార్, హర్యానాకు చెందిన సాహిల్‌తో కలిసి ఒడిషా వెళ్లి, అక్కడ సుభాష్ అనే వ్యక్తి నుండి 273 కిలోల గంజాయిను ?1.30 లక్షలకే కొనుగోలు చేశారు. తర్వాత ఆ గంజాయిని హర్యానాకు తరలించాలన్న ప్లాన్‌తో తెలంగాణ మీదుగా ప్రయాణం మొదలెట్టారు. ఈ సమాచారం పక్కాగా తెలిసిన ఎస్ఓటీ, షామీర్పేట్ పోలీసులు కలిసి ఓఆర్ఆర్ వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అందులో గంజాయి దాచినట్టుగా బయటపడింది. ఘటనకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లో కాలి సామాన్లను తరలిస్తున్నట్లు నటిస్తూ, వాస్తవంగా ఒడిషా నుంచి హర్యానాకు గంజాయి తరలించడానికి ఈ ముఠా పక్కా ప్రణాళిక వేసింది. దీనికోసం బొలెరో వాహనం, మొబైల్ ఫోన్లు, జియో డాంగిల్ వంటివన్నీ సీజ్ చేశారు. మొత్తం స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ దాదాపు రూ. కోటి వరకు ఉంటుందని డీసీపీ తెలిపారు. డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ, "అక్రమ గంజాయి రవాణాపై పౌరులు అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా అనుమానాస్పద సమాచారం ఉన్నా వెంటనే డయల్ 100 లేదా వాట్సాప్ నెంబర్ 9490617444 ద్వారా తెలియజేయండి" అని కోరారు.



## సాటాపూర్ గేట్ రైల్వే గేటు మూసివేత

**ఎడపల్లి, ఏప్రిల్ 6 ( జనంసాక్షి ) :**



ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ వద్దగల రైల్వేగేటును సోమ వారం నుంచి తాత్కాలికం గా మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ మారమ్మతులు, అభివృద్ధి పనుల్లో భాగంగా మూసి వేయనున్నాన్నట్లు పేర్కొన్నారు. తిరిగి పనులు పూర్తైన తర్వాత యథావిధిగా వాహనాల రాకపోకలు సాగించవచ్చన్నారు. ముందస్తు సమాచారం లేకుండా ఆదివారం గేటు మూసివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో తిరిగి గేటును తీశారు.

# హజ్ యాత్రలో విధిగా నియమాలు, పద్ధతులను పాటించాలి

**హజ్ మాస్టర్ ట్రైనర్ ముఫ్తి ఆసీఫుద్దీన్ నద్వీ**
**లబ్బయిక్ హజ్ సొసైటీ ఎల్ఈడి స్క్రీన్**
**డిజిటల్ పద్ధతిలో హజ్ యాత్రికులకు శిక్షణ**




**కరీంనగర్, ఏప్రిల్ 06 (జనంసాక్షి)**

: హజ్ యాత్ర 2025 సంవత్సరానికి వెళ్లేవారు హజ్ యాత్రలో భాగంగా కనీస నియమాలను క్రమం తప్పకుండా పాటించాలని మాస్టర్ హజ్ ట్రైనర్ ముఫ్తి ఆసీఫుద్దీన్ నద్వి సందేశం ఇచ్చారు. నగరంలోని గోదాం గడ్డ ప్రాంతంలో ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో లబ్బయిక్ సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో ఎల్ఈడి స్క్రీన్ ద్వారా డిజిటల్ పద్ధతిలో రెండవ శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కు చెందిన ప్రముఖ హజ్ మాస్టర్ ట్రైనర్ ముఫ్తి ఆసీఫుద్దీన్ హాజరై హజ్ యాత్రకు వెళ్లే వారికి పూర్తిస్థాయి నియమాలను, పద్ధతులను కూలంకషంగా వివరించారు. లబ్బయిక్ హజ్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సొసైటీల ద్వారా పొందేటువంటి సేవలు, విమానయానం, ఇమ్మిగేషన్, వసతులు, సౌకర్యాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ మాస్టర్ ట్రైనర్ ముఫ్తి ఆసీఫుద్దీన్ నద్వి, లబ్బయిక్ హజ్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇర్ఫాన్ ఉల్ హక్, ఉపాధ్యక్షుడు హాఫిజ్ ముదస్సిర్ రహమాన్, ప్రధాన కార్యదర్శి హాఫిజ్ రిజ్వాన్, సభ్యులు అబ్దుల్ కరీం జాహిద్, హాఫిజ్ వసీముద్దిన్, సాధక్ అలీ, తాజ్, హఫిజ్ తో పాటు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన హజ్ యాత్రికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ ఎర్త్ డ్యాం వద్ద అగ్నిప్రమాదం



**నల్లగొండ (జనంసాక్షి) :**

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యాం పరిధిలో మరోసారి అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం మద్యాహ్నం ఎర్త్ డ్యాం దగ్గర మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అప్పటికే మంటలకు ఎర్త్ డ్యాం పై ఉన్న సీసీ కెమెరాలు, విద్యుత్ వైర్లు ధ్వంసం అయ్యాయి. డ్యాం దగ్గర ఇటీవల అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మార్చి 19న నాగార్జునసాగర్ ప్రధాన ఎర్త్ డ్యాం వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పాయింట్ నుంచి శివుడి పార్క్ వరకు ఎర్త్ డ్యాం వెంట ఉన్న చెట్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ ఆఫీసర్లు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 15, 21 తేదీల్లో డీఫారెస్ట్ ఏరియాలో అగ్ని ప్రమాదం జరిగి చెట్లు, మొక్కలు కాలి బూడిదయ్యాయి. తాజాగా మరోసారి ప్రమాదం జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

# నవనాథ సిద్దేశ్వరాలయం తెలంగాణకే తలమానికం

**కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**ఆర్మూర్, ఏప్రిల్ 6 (జనం సాక్షి)**





: నవనాథ సిద్దేశ్వరాలయం తెలంగాణకే తలమానికంగా నిలుస్తుందని తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దేశ్వర ఆలయంపై శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం సతీ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర మార్కెట్ చైర్మన్ మార గంగారెడ్డి,నిజామాబాద్ మాజీ గ్రంథాలయ చైర్మన్ మారా చంద్రమోహన్ ఆయన వెంట పాల్గొని ఆశీర్వాదం అందుకున్నారు.సిద్దుల గుట్ట ప్రాంతంలోని శివాలయం,అయ్యప్ప ఆలయాలను సందర్శించారు.ఆలయ కమిటీ కార్యవర్గం వేద పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి టూరిజం శాఖకు పెద్దపీట వేస్తున్నారని, పర్యాటకరంగా అభివృద్ధిలో భాగంగా నవనాథ సిద్దుల గుట్టను అభివృద్ధి చేస్తామని చెప్పారు.మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కంచె గచ్చిబౌలి స్థలం విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్,మాజీ మున్సిపల్ చైర్మన్ లు అయ్యప్ప శ్రీనివాస్,పండిత్ పవన్,కౌన్సిలర్లు రవి గౌడ్, మురళి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయినాథ్ గౌడ్, సిద్దలగుట్ట ఆలయ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



**తలంబ్రాలతో లొద్ది రామన్న స్వామికి మొక్కులు**

ఆర్మూర్ డివిజన్ పరిధిలోని భీంగల్ మండలం పిప్రి గ్రామంలో శ్రీ లొద్ది రామన్న స్వామి ఆలయంలో శ్రీ రామనవమి సందర్భంగా తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
తలంబ్రాలతో మొక్కులు చెల్లించుకున్నారు.శ్రీ సీతారామ కళ్యాణంలో
పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయన వెంట బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వినయ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సన్నబియ్యంతో నిజమైన పేదలకు లబ్ధి

**• మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**



**చౌటుప్పల్, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** సన్నబియ్యంతో నిజమైన పేదలకు లబ్ధి చేకూరుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో ఆదివారం సన్న బియ్యం లబ్ధిదారుడు దళితుడి ఇంట్లో వారి కుటుంబంతో కలిసి రాజగోపాల్‌రెడ్డి దంపతులు సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ అధిష్టానం నిర్ణయం మేరకు సన్నబియ్యం లబ్ధిదారుల ఇంట్లో ఎమ్మెల్యేలు, మంత్రులు భోజనం చేయాలన్న కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పబ్బు రాజు గౌడ్, బోయ రామచంద్రం, కడగంచి జనార్ధన్, కడగంచి వెంకటేశం, చీరిక అంజిరెడ్డి, ఉబ్బు వెంకటయ్య, చింతల దేవరాజు, రాచకొండ భార్గవ్, చింతల సాయిలు, వీరమల్ల సత్తయ్యలు పాల్గొన్నారు.

**బోయ దేవేందర్ కుటుంబానికి పరామర్శ**

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్ సతీమణి బోయ నవనీత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆట్టి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అపోలో ఆసుపత్రిలో చేర్పించి తమ సొంత ఖర్చులతో వైద్యం చేయించారు. ఇటీవలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన దేవేందర్ సతీమణిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా గ్రామంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

# కల్తీ మద్యం తయారీ ముఠా అరెస్ట్

**• నిందితుల వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** అక్రమంగా కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్న ముఠా ను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. వీరి వద్ద నుండి దాదాపు 25 లక్షల విలువ గల 600 లీటర్ల స్పిరిట్ ను,అక్రమంగా తయారు చేసిన 660 లీటర్ల కల్తీ మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ కల్తీ మద్యం తయారీ ముఠా వివరాలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. చండూరు పట్టణానికి చెందిన ఎర్రజెల్ల రమేష్ ఏ-1గా ఉన్నాడు. ఏ-2 గా బెంగళూరుకు చెందిన శ్రీనివాస్ గౌడ్డ,దారిలో ఉన్నాడు. ఏ-3గా చండూరు పట్టణానికి చెందిన మహమ్మద్ జానీ పాషా,ఏ-4గా చండూర్‌కు చెందిన దోమలపల్లి యాదగిరి (మంగలి గిరి) పరారీలో ఉన్నాడు. ఏ-5గా కనగల్ మండలం జి ఎడవల్లికి చెందిన బొమ్మరబోయిన భార్గవ్,ఏ6-గా చండూర్ కు చెందినసాయం ఉపేంద్ర,ఏ-7గా చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన జాల వెంకటేష్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అదే విధంగా చండూరు మండలం దుబ్బగూడెం గ్రామంలో ఒక గుడిసెలో నెరస్తులకు సంబంధించిన 20 బాటిల్స్ 400 లీటర్లు స్వాధీన చేసుకొని ఎక్సైజ్ చందూర్ పోలీస్ లు కేసు నమోదు చేశారు. కల్తీ మద్యం ముఠా నేరస్తులను పట్టుకోవడములో దేవరకొండ ఏ ఎస్ పి పి.మౌనిక, పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ సీఐ ఏ.రమేశ్ బాబు, ఎస్సై లు మహేందర్, శివ ప్రసాద్ లు నాంపల్లి సర్కిల్ సిఐ శ్రీ రాజు ఆద్వర్యములో నాంపల్లి ఎస్సై ఎం శోభన్ బాబు, నాంపల్లి పోలీసు స్టేషన్ సిబ్బంది,ఎక్సైజ్ పోలీస్ కలిసి సంయుక్తంగా నేరస్థులను పట్టుకున్నారు. ఈ నేరస్థులను పట్టుకోవడములో ప్రతిభ కనభర్చిన సిబ్బందిని జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

## సన్నబియ్యం నిల్వలు పరిశీలన



**పాపన్నపేట, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆశాఖ అధికారులకు,సిబ్బందికి ఆదేశించారు. ఆదివారం పాపన్నపేట పాతూరు లోని పౌర సరఫరాల శాఖ గోదాం లోని నిల్వ ఉన్న బియ్యం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. అంగన్‌వాడి, హాస్టల్స్ సరఫరా చేసే బియ్యం, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీకి సంబందించిన వివరాలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. గోదాం ఇంచార్జ్ నర్సింలు,తదితరులు ఉన్నారు.

## వెల్లివిరిసిన మతసామరస్యం




**ఖమ్మం, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** సమాజంలో మనుషుల మధ్య మతాల పేరుతో వైషమ్యాలు సృష్టించి తమ పబ్బం గడుపుకుంటున్న రాజకీయ పరిస్థితుల్లో మతాల్లో జీవించే ప్రజలు మాత్రం దీనికి బిన్నంగా సామరస్య వాతావరణంలో జీవించాలని కోరుకుంటున్నారు. అందులో భాగంగా శ్రీరామ నవమి సందర్భంగా 42 వ డివిజన్ లోని ముస్లిం యువకులు షుమారు 10 డ్రమ్ములు అనగా 3 వేల మందికి మజ్జిగ పంపిణీ చేసారు. వైరా రోడ్డులోని స్థానిక నిజాం పేట మసీదు ప్రాంతంలో ముస్లిం యువకులు ఎండలో రోడ్డుపై వెళ్తున్న వారికి వాహనాల దగ్గరికి వెళ్లి మజ్జిగ గ్లాసులు పంచి పెట్టారు. శ్రీరామ నవమి సందర్భంగా నిజాంపేట్ యువత అధ్వర్యంలో మజ్జిగ పంపిణి కార్యక్రమంలో నిజాంపేట్ యువత అహ్మద్(బాబా), జావీద్ ,అజీమ్ చోటు, అబ్బాస్, మహబూబ్ , షకీల్, యాకూబ్, సమద్, గౌస్, నిజాంపేట్ యూత్ పాల్గొన్నారు.

## రోడ్డు మలుపులో ప్రమాదకరంగా వ్యవసాయ బావులు



**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** మండల పరిధిలోని జగత్ పల్లి గ్రామంలో పోచంపల్లి వెళ్లే రోడ్డు మూల మలుపు వద్ద అదేవిదంగా నారాయణగిరి వెళ్లే రోడ్డులో కూడా ప్రమాదకరంగా వ్యవసాయ బావులు ఉన్న కనీసం హెచ్చరిక సూచికలు కూడా ఏర్పాటు చేయలేదు. సరైన రోడ్డు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మూలమలుపు వద్ద వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉండడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆ బావి వద్ద పక్కన చెట్ల పొదలు ఉండడం వల్ల బావి ఉన్నట్లు ఏర్పడడం లేదు. సైడ్ వాల్స్ లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేసి, బావుల పక్కన సైడ్ వాల్స్ హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పండుగపూట బాలానగర్‌లో విషాదం

**• ఈత కోసం వెళ్లి ఇద్దరు యువకుల మృతి**





**మెదక్, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** శ్రీరామనవమి పండుగ పూట ఆ గ్రామంలో విషాదం నెలకొంది. మెదక్ మండలం బొల్లారం మత్తడిలో ఈత కోసం వెళ్ళిన ఇద్దరు యువకులు గల్లంతు అయ్యారు. ఏడు గంటలపాటు పోలీసులు, గజ ఈతగాళ్లు శ్రమించి బొల్లారం మత్తడిలో గాలింపు చర్యలు చేపట్టి రెండు మృతదేహాలను బయటకు తీశారు. శ్రీరామనవని పండుగ పూట ఇద్దరు యువకులు మరణించడంలో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలానగర్ గ్రామానికి చెందిన తుడుం అనిల్ (21) తుడుం నవీన్(22) ఇద్దరు కలిసి నిన్న గ్రామ శివారులో ఉన్న బొల్లారం మత్తడిలో ఈత కోసం వెళ్లారు 10 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోయేసరికి కుటుంబీకులు గ్రామస్తులు మత్తడి వద్దకు వెళ్లి చూశారు అక్కడ అనిల్ నవీన్‌ల బట్టలు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉదయం గజ ఈతగాలతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకి తీసి పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**• ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి**



**నిడమనూర్, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా తమ ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను పాటించి ఏ గ్రేడ్ 2320 బి గ్రేడ్ 2300 కనీస మద్దతు ధర పొందాలని కోరారు. తూకంలో అవకతవకలు లేకుండా తరుగు కింద ధాన్యాన్ని తీయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ధాన్యం సెంటర్ల నిర్వహించే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిడమనూర్ పిఎసిఎస్ చైర్మన్ జిల్లా బ్యాంక్ డైరెక్టర్ విరిగిన అంజయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఎంపీడీవో రమేష్, మార్కెట్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,నాయకులు కొండ శ్రీనివాస్ రెడ్డి, నందికొండ మట్టారెడ్డి, ముంగి శివ మరయ్య, ఉన్నం చిన్న వీరయ్య, నర్సింగ్ విజయ్, విశ్వనాధుల రమేష్, సీఈఓ జానయ్య, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చందర్ రావు, ఎస్సై ఉప్పు సురేష్, ఏ ఎస్ ఐ రమేష్, నాయకులు గోవిందరెడ్డి, ఉన్న ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా నదిలో జాలరి మృతి



**కొల్చారం, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** చేపలు పట్టడానికి వచ్చిన వ్యక్తి వల కాళ్లకు చుట్టుకోవడంతో మంజీరా నదిలో శవమై తేలిన సంఘటన కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామ శివారులో ఆదివారం బయటపడింది. టేక్మాల్ మండలం అచ్చన్న పల్లి గ్రామానికి చెందిన గుండ్ల యాదగిరి(30) అనే మత్స్యకారుడు శనివారం రాత్రి అందాక 9 గంటల సమయంలో చేపలు పట్టడానికి ఇంట్లో నుండి బయలుదేరి వచ్చి నాడు. తిరిగి ఇంటికి వెళ్ళనందున ఆదివారం ఉదయం అందాజ ఏడు గంటల సమయంలో మృతుడి కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ మంజీరా నది వెంట రాగా తుక్కాపూర్ శివారులోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద మృతుడి మోటార్ సైకిల్ ఉండగా, అనుమానం వచ్చి మంజీరా నది నందు వెతుక్కుంటూ వెళ్ళగా బ్రిడ్జి కింద గల మడుగు వద్ద మృతుడి చెప్పులు ఉన్నాయి. అనుమానం వచ్చి అట్టిమడుగు నందు వెతకగా మృతుడు చేపలు పట్టుచుండగా ప్రమాదవశాత్తుగా చేపలు పట్టే వల రెండు కాళ్లకు చుట్టుకోవడం వల్ల నీటిలో మునిగి మృతి చెందినాడు. మృతుడి భార్య గుండ్ల ప్రియాంక అలియాస్ అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొల్చారం ఎస్ఐ మమ్మద్ గౌస్ తెలిపారు.

## మెట్లకుంటలో అలరించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకం



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 6 (జనం సాక్షి) :** మండల పరిధిలోని మెట్లకుంట గ్రామంలో గత ఐదు రోజులుగా ప్రదర్శిస్తున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర వీధి నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నేటి కంప్యూటర్, టీవీ, మొబైల్ ఫోన్, యుగంలో కూడా వీధి నాటకాలకు ప్రజాధరణ తగ్గట్లేదు. మగవారు ఆడవారి వేషధారణలో పాత్రధారులుగా పాత్రలకు జీవం పోస్తూ నటించారు. వీధి నాటక ప్రదర్శనను విజయవంతం చేసినందుకు గ్రామ ప్రజలకు నాటకోపాధ్యాయులు కావలి నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయాలలో చోరీ నిందితులు అరెస్ట్



**జిన్నారం, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** ఆలయాల్లో రాత్రి వేళల్లో చోరీలు చేస్తున్న నిందితులను అరెస్టు చేసినట్లు జిన్నారం సీఐ నయిముద్దీన్ తెలిపారు. ఆదివారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా శివంపేట మండలం శభాష్ పల్లి కి చెందిన ఫయాజ్, చాపల సంజీవ్ ముదిరాజ్ లు గుమ్మడిదల మండలంలోని రామ్ రెడ్డి బావి, కానుకుంట, నల్లవల్లి గ్రామాలలో రాత్రి వేళల్లో రెక్కీ నిర్వహించి తాళాలు వేసి ఉన్న మందిరాలలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆలయాలలోని హుండీలు పగుల కొట్టి డబ్బులతో పాటు విలువైన వస్తువులను చోరీ చేస్తున్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం గుమ్మడిదల , సిసిఎస్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 25వెలు, ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. నిధితుల్లో షేక్ ఫయాజ్ పైన 33 చోరీ కేసులు, చాపల సంజీవ్, నవాజ్ పైన 26 చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. సీఐతో పాటు ఎస్సై మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

## ఆకాశవాణిలో ప్రతిభ చాటిన బొమ్మనపల్లి విద్యార్థులు



**టేకులపల్లి, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** కేవలం స్కూలుకే పరిమితం కాకుండా ప్రసార మాధ్యమాల ద్వారా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటి చెప్పున్నారు. ఆదివారం కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారమైన చిన్నారి లోకం లికదంబలి కార్యక్రమంలో బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సుమారు అరగంట సేపు తమ చదువులకు సంబంధించిన, నేర్చుకుంటున్న విద్యను కథలు, పాటలు, గేయాలు, నాటికలు, పొడుపు కథలు, సామెతలు, ఇంగ్లీష్ రైమ్స్ రూపంలో ప్రదర్శించి సత్తా చాటారు. బొమ్మనపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు ఈ రేడియో కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా విన్నారు. పిల్లల యొక్క ప్రతిభ పాటవాలను రేడియో ద్వారా విన్న తల్లిదండ్రులు అమిత మైన సంతోషాన్ని వ్యక్తం చేశారు. బొమ్మనపల్లి లిచరిత్రలో తొలిసారిలి గా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆకాశవాణి కేంద్రం ద్వారా తమ వాణిని వినిపించి స్కూలు తో పాటు, తమ గ్రామం యొక్క ప్రతిష్టను ఇనుమడింపజేశారు. విద్యార్థుల ప్రతిభ ఆకాశవాణి ద్వారా విన్న టేకులపల్లి ఎంఈఓ జగన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ పొగాకు లక్ష్మి, కాంప్లెక్స్ హెచ్ ఎం మంగీలాల్ లు హర్షం వ్యక్తం చేశారు.

# యువత క్రీడల వైపు దృష్టి సారించాలి

**• కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి**



**రామన్నపేట, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** యువత వ్యసనాల వైపు మళ్లకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మరియు మండల నాయకుల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన మైదానంలో రామన్నపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 3 టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా హాజరై టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో మైదానంలో బ్యాటింగ్ చేసి అలరించారు. గ్రామీణ ప్రాంత యువకులు క్రికెట్లో చక్కటి ప్రదర్శన ద్వారా గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి ఎదగాలని ఆయన కోరారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనపరిచినప్పుడే విజేతలుగా నిలుస్తారన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజం అని, ఓడినవారు మరోసారి గెలుపునకు ప్రయత్నించాలని సూచించారు. ఆటలతో శారీరక దారుఢ్యం మెరుగు పరచడమే కాకుండా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, అందరితో స్నేహపూర్వకంగా మెదులుకోవాలని సూచించారు. మీకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు జినుకల ప్రభాకర్,మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్, గుత్తా నరసింహారెడ్డి,మాజీ ఎంపిటిసి ఎండి రెహాన్, జెల్లా వెంకటేష్,రామిని రమేష్,ఎండి జమీరుద్దీన్, గరిక సత్యనారాయణ, ఎండి అక్రమ్,సాల్వేరు లింగం, మోటే రమేష్,కోట సుధాకర్,కొమ్ము శేఖర్, వడ్లకొండ సాయి కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 6 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి మంత్రులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం హెలికాప్టర్లో హైదరాబాద్ నుండి నేరుగా సారపాక ఐ టి సి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఐటిసి అతిధి గృహంలో విరామం తీసుకుని కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడనుండి రోడ్డు మార్గం ద్వారా శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనం చేసుకొని మిథిలా స్టేడియంలో స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి, సారపాక తాళగుమ్మూరులో బూరం శ్రీనివాసరావు ఇంట్లో రేషన్ షాపు ద్వారా సరఫరా చేసిన సన్నబియ్యంతో తయారుచేసిన వంటకాలను ఆరగించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఘనంగా వీడ్కోలు పలకడంతో బిపిఎల్ హెలిప్యాడ్ గ్రౌండ్ నుండి హెలిక్యాప్టర్ ద్వారా హైదరాబాదుకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఇతర శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది, ఇంటిలిజెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## చైనా సుంకాల దెబ్బకు.. దిగివచ్చిన బంగారం

### ఇంకా తగ్గనున్న ధరలు




**జనంసాక్షి:**అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' ప్రపంచ దేశాలపై సుంకాలను ప్రకటించారు. ఆ తరువాత చైనా.. యూఎస్ఏ మీద 34 శాతం ప్రతీకార సుంకం ప్రకటించింది.దీంతో బంగారం ధర సుమారు రూ. 2,800 లేదా రెండు శాతం తగ్గింది. అమెరికా ప్రతీకార సుంకాల కారణంగా స్టాక్ మార్కెట్ భారీ నష్టాలను చవిచూసింది. ఈ సమయంలోనే బంగారం ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా గోల్డ్ రేటు మరింత తగ్గే అవకాశం ఉందని కమోడిటీ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.అమెరికా, చైనాతో సహా ఇతర దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా.. బంగారం ధరల ర్యాలీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నదని ఎస్ఎస్ వెల్త్‌స్ట్రీట్ వ్యవస్థాపకురాలు 'సుగంధ సచ్‌దేవా' పేర్కొన్నారు. అయితే అమ్మకాలు మాత్రమే స్థిరంగా కొనసాగుతున్నాయి.ఇండియన్ మార్కెట్లో బంగారం ధరలు రూ. 83,100 (22 క్యారెట్ 10 గ్రామ్స్), రూ. 90,660 (24 క్యారెట్ 10 గ్రామ్స్) వద్ద ఉన్నాయి. వెండి ధరలు కూడా భారీగానే తగ్గుముఖం పట్టాయి. రాబోయే రోజుల్లో బంగారం ధరలు మరింత తగ్గే సూచనలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

**ఇంటి కొనుగోళ్లలో**

# మారుతున్న అభిరుచులు

- విస్తీర్ణానికే మొదటి ప్రాధాన్యత.. బడ్జెట్ తరువాత సంగతి
- కస్టమర్ల అభిరుచి మేరకు నిర్మిస్తున్న బిల్డర్లు



**జనంసాక్షి:**కరోనా తర్వాత నుంచి గృహ కొనుగోలుదా రుల అభిరుచులు మారా యి. నివాస కొనుగోళ్ల ట్రెండ్‌ను కరోనాకు ముం దు, ఆ తర్వాత అని విభజించాల్సిన పరిస్థితి వచ్చింది. కోవిడ్ కంటే ముందు ఇల్లు కొనాలంటే మొదటి ప్రాధాన్యత బడ్జెట్ ఎంత అనే.. కానీ, కరోనా తర్వాత బడ్జెట్ అంటే లెక్కేలేదు. విస్తీర్ణమైన ఇళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మహమ్మారితో వర్క్ ఫ్రం హెూమ్, ఆన్‌లైన్ క్లాసుల నేపథ్యంలో ఇంటిలో గడిపే సమయం పెరిగింది. మరోవైపు ఐసొలేషన్ కారణంగా విశాలమైన, ప్రత్యేక గదుల అవసరం ఏర్పడింది. దీంతో గృహ కొనుగోలుదారులు క్రమంగా విశాలమైన ఇళ్లకు మారిపోతున్నారు. అప్పటిదాకా 2 బీహెచ్‌కే వాసులు.. క్రమంగా 3 వైపు.. 3 బీహెచ్‌కే వాసులు నాలుగు పడక గదుల్లో ఉండేందుకు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో గ్రేటర్‌లో ఇంటి విస్తీర్ణాలు క్రమంగా పెరుగుతున్నాయి. కస్టమర్ల అభిరుచులకు తగినట్టుగా డెవలపర్లు కూడా విశాలమైన ఇళ్లనే నిర్మిస్తున్నారు. స్థిరమైన ధరలు, అధిక రాబడుల కారణంగా హైదరాబాద్‌లో ప్రాపర్టీలలో పెట్టుబడులకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. పెద్ద కుటుంబాలు, విలాసవంతమైన జీవనశైలి, ఆధునిక వసతులు కోరుకునేవారు ఎక్కువగా 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేస్తున్నారు. మియాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కొంపల్లి, కూకట్‌పల్లి వంటి ప్రాంతాలలో 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సైనిక్‌పురి, యాప్రాల్, నాచారం, మల్లాపూర్, తార్నాక, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లోని యూనిట్లకూ ఆదరణ బాగానే ఉంది. వీటి సగటు ధర రూ.1.78 కోట్ల నుంచి ఉన్నాయి.హైదరాబాద్‌లో ఏటేటా అపార్ట్‌మెంట్ల విస్తీర్ణాలు పెరుగుతున్నాయి. 2014లో నగరంలో ఫ్లాట్ల సగటు విస్తీర్ణం 1,830గా ఉండగా.. 2018 నాటికి 1,600లకు తగ్గాయి. నాలుగేళ్లలో ఏకంగా ఫ్లాట్ల సైజు 13 శాతం తగ్గింది. కోవిడ్ కాలంలో ఇంట్లో గడిపే సమయం ఎక్కువైపోయింది. దీంతో ఇంటి అవసరం తెలిసొచ్చింది. వర్క్ ఫ్రం హెూమ్, ఆన్‌లైన్ క్లాస్‌లతో ఇంట్లో ప్రత్యేక గది అనివార్యమైపోయింది. దీంతో ఇంటి విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2019లో నగరంలో ఫ్లాట్ల సగటు విస్తీర్ణం 1,700 చ.అ.లుగా ఉండగా.. ఇప్పుడది ఏకంగా 2,200 చ.అ.లకు పెరిగింది.కరోనా కంటే ముందు లగ్జరీ గృహాలైన 4 బీహెచ్‌కే ఫ్లాట్లకు 27 శాతం డిమాండ్ ఉండగా.. ఇప్పుడది ఏకంగా 45 శాతానికి పెరిగిందని అనరాక్-ఫిక్కీ హెూమ్ బయ్యర్స్ సెంటిమెంట్ సర్వే వెల్లడించింది. గత ఐదేళ్లలో దేశంలోని ఏడు నగరాల్లో అపార్ట్‌మెంట్ల విస్తీర్ణాలు 32 శాతం మేర పెరిగాయి. 2019లో సగటు ఫ్లాట్ సైజు 1,145 చ.అ.లుగా ఉండగా.. ఇప్పుడది 1,513 చ.అ.లకు పెరిగింది.



**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 4.05 | ₹ 4.07 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 83,100 (22 క్యారెట్లు) | ₹ 90,660 (24 క్యారెట్లు) |
| --- | --- |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,03,000

## ఎన్ఎస్‌డీఎల్ లిస్టింగ్‌కు గడువు పెంపు

**న్యూఢిల్లీ:** పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్)కు వెసులుబాటు లభించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా 2025 జులై 31వరకూ గడువు పెంచింది.ఎన్ఎస్‌డీఎల్ అభ్యర్థనమేరకు గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయ్యేందుకు మరింత గడువును సెబీ అనుమతించింది. దీంతో మార్కెట్ల పరిస్థితులు అనుకూలించేటంతవరకూ కంపెనీ లిస్టింగ్‌కు వెసులుబాటు లభించింది.నిజానికి 2024 సెప్టెంబర్‌లోనే ఎన్ఎస్‌డీఎల్ ఐపీవోకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐపీవోలో భాగంగా ఎన్ఎస్‌డీఎల్ ప్రస్తుత వాటాదారులు ఎన్ఎస్ఈ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5.72 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నాయి. దేశీయంగా తొలి సెక్యూరిటీల డిపాజిటరీగా కార్యకలాపాలు ప్రారంభించిన ఎన్ఎస్‌డీఎల్ 2024 సెప్టెంబర్‌కల్లా 6 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తోంది.



## నిద్రపుచ్చే రోబో..

**జనంసాక్షి:**కంటి నిండా నిద్రపోతే కలిగే మేలు ఎంతో, కలత నిద్రతో జరిగే కీడు కూడా అంతే! తాజాగా నిద్రలేమి సమస్యతో గుండెజబ్బులు వస్తున్నాయని తేలింది. మిమ్మల్ని హాయిగా నిద్రపోయేలా చేసే స్మార్ట్ టెక్నాలజీతో రూపొందించిన గాడ్జెట్స్ గురించి తెలుసుకుందాం. అమ్మలా మిమ్మల్ని జోకొట్టి, పాటలు పాడి, కథలు చెప్పే రోబోలు చాలానే వచ్చేశాయి. అలాంటి వాటిలో ఒకటే ఈ 'సోమ్నాక్స్ స్లీప్ రోబో'. ఇది మిమ్మల్ని నిద్రపోయే ముందు విశ్రాంతి తీసుకోవడానికి బాగా సహాయ పడుతుంది. సంగీతం, కథలను వినిపిస్తూ నిద్ర పుచ్చుతుంది. మెత్తగా, వెచ్చగా ఉండే వీటిని పక్కనే పట్టుకొని నిద్రపోతే ఎటువంటి భయం లేకుండా చాలా ధైర్యంగా ఉంటుంది. ఇక ఇందులో వివిధ ప్రకృతి శబ్దాలు, ఆహ్లాదకరమైన సంగీతంతో పాటు శ్వాస వ్యాయామాలు, ధ్యానం చేసేలా వాల్యూమ్ నియంత్రణలు, నైట్‌లైట్ ఎంపికలు వంటి ఆప్షన్లు ఉన్నాయి. ధర రూ.46,976.

## స్మార్ట్ పరుపు.. స్లీప్ ట్రాక్ రింగ్

**జనంసాక్షి:**హెల్త్ ట్రాకర్లు చాలావరకు అన్ని ఆభరణాల రూపాల్లోనూ వచ్చేసినట్టు, అనేక రకాల స్లీప్ ట్రాకర్లు కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి. వేలికి ధరించే ఈ 'ఔరా రింగ్ జెన్3' నిద్ర వ్యవధి, నాణ్యతను ట్రాక్ చేస్తుంది. వీటితోపాటు హృదయ స్పందన, శ్వాస విధానాలు, శరీర కదలికలను కూడా పర్యవేక్షించి, 'స్లీప్ ఫిట్‌నెస్ స్కోర్'ను ఇస్తుంది. మొబైల్‌కు అనుసంధానం చేసుకొని, యాప్ సాయంతో ఉపయోగించుకోవచ్చు. ధర రూ. 21,414. మంచి నిద్రకు మంచి పరుపు చాలా ముఖ్యం. మెత్తటి పరుపులు నిద్రకు అనుకూలంగా ఉంటాయి.



కాని, ఇప్పుడు వచ్చే ఈ స్మార్ట్ పరుపులు మిమ్మల్ని హాయిగా నిద్రపోయేలా చేస్తాయి. ఇవి నిద్ర అలవాట్లు, కదలికలను పర్యవే క్షించడానికి వీటిలో సెన్సార్లు ఉంటాయి. మీరు ఎంత బాగా నిద్రపోతున్నారనే విషయాన్ని ట్రాక్ చేసి, సమాచారం ఇస్తాయి. సౌకర్యవంతంగా ఉండటానికి శరీర ఉష్ణోగ్రతను అనుకూలంగా మార్చి, హాయిగా నిద్రపోయేలా చేస్తాయి.

## ఎక్కువ డేటా కోసం.. జియో కొత్త రీచార్జ్ ప్లాన్

**జనంసాక్షి:**భారతదేశంలో అతిపెద్ద టెలికాం కంపెనీ అయిన రిలయన్స్ జియో.. తన వినియోగదారుల కోసం ఎప్పటికప్పుడు సరికొత్త ప్లాన్స్ ప్రవేశపెడుతూనే ఉంది. ఇప్పుడు ఇంటర్నెట్ ఎక్కువగా ఉపయోగించేవారికోసం రూ.1049 ప్లాన్ తీసుకొచ్చింది. దీని గురించి మరిన్ని వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.రిలయన్స్ జియో రూ.1,049 ప్లాన్ ద్వారా.. 84 రోజుల పాటు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎమ్ఎస్‌లను పొందవచ్చు. అంతే కాకుండా రోజుకు 2 జీబీ డేటా లభిస్తుంది. అదనంగా ఈ ప్లాన్‌లో 50జీబీ జియోఏఐ క్లౌడ్ స్టోరేజ్, 90 రోజుల పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ కూడా లభిస్తుంది. జియో టీవీ మొబైల్ యాప్ ద్వారా జీ5, సోనీలివ్ వంటి వాటికి కూడా యాక్సెస్ లభిస్తుంది.460 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లతో రిలయన్స్ జియో భారతదేశంలో అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా నిలిచింది. ఈ కంపెనీ అపరిమిత కాలింగ్, ఎస్ఎమ్ఎస్, డేటా వంటి వాటికోసం విభిన్న శ్రేణి రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తుంది. ప్రస్తుతం సంస్థ 5జీ, 4జీ, 4జీ ప్లస్ అనే సర్వీసులను అందిస్తోంది.

**గర్ల్‌ఫ్రెండ్‌ను రప్పించడం కోసం ఆమె తండ్రి**

## చితాభస్మాన్ని దొంగిలించి..

### చివరికి కటకటాల పాలు..

అవతలి వాళ్లు మన నుంచి దూరంగా వెళ్లిపోయే పరిస్థితి తెచ్చుకోకూడదు. ఒకవేళ ఆ పరిస్థితి వస్తే..వాళ్లు మనల్ని దూరం చేసుకున్నామనే ఫీల్ కలిగేలా మన ప్రవర్తన ఉండాలి.అంతేతప్ప దిగజారి దారుణాలకు ఒడిగడితే పరిస్థితి ఇలానే ఉంటుంది. ఇక్కడొక వ్యక్తి అలాంటి పనిచేసే కటకటాల పాలయ్యాడు. అంతేగాదు తన గర్ల్‌ఫ్రెండ్‌కి మరింత అసహ్యం కలిగేలా చేసుకున్నాడు.ఈ ఘటన తైవాన్‌లో చోటుచేసుకుంది. 57 ఏళ్ల కోళ్ల పెంపకందారుడు ఎల్వీ 48 ఏళ్ల టాంగ్ అనే మహిళతో రిలేషన్‌షిప్‌లో ఉన్నాడు. వాళ్ల బంధం 15 ఏళ్లు కొనసాగింది. అయితే ఎల్వీ ప్రవర్తన సరిగా లేకపోవడం, కుటుంబ తోడ్పాటుకు ఎటువంటి సహకారం లేకపోవడంతో విసిపోయిన టాంగ్ అతడితో బంధానికి స్వస్తి చెప్పింది. అప్పటి నుంచి ఆమె వేరుగా జీవిస్తోంది. దీన్ని జీర్ణించుకోలేని ఎల్వీ, టాంగ్‌ని పదే పదే బెదిరింపులకు గురి చేయడం ప్రారంభించాడు. అక్కడితో ఆగక ఇక ఆమెను ఎలాగైనా.. తన వద్దకు రప్పించుకుని, కలిసే జీవించేలా చేద్దామనే దురుద్దేశంతో దురాగతానికి తెరతీశాడు. ఆమె తండ్రి సమాధి వద్ద ఉండే చితాభస్మాన్ని దొంగలించి ఆమె మనోవ్యధను కలిగిస్తే..కచ్చితంగా తన వద్దకు తిరిగి వచ్చేస్తుందని భావించాడు.కానీ అతడు ఒకటి తలిస్తే..విధి మరొకటి తలిచింది. అయితే ఇదంతా టాంగ్‌కు తెలియదు. అతడు తన తండ్రి చితాభస్మం నా దగ్గర ఉందని చెప్పినా..టాంగ్ అవన్నీ బెదిరింపులే అనుకుని కొట్టిపారేసింది. నమ్మను కూడా నమ్మలేదు. అయితే ఎలా దొంగలించానో..ఫోటోలతో సహా వివరంగా పంపించాడు. అప్పుడే ఆమె తన తండ్రి స్మశాన వాటికను సందర్శించి అసలు విషయం తెలుసుకుంది.ఇక టాంగ్ అతడిని క్షమించకూడదన్న పట్టరాని కోపంతో..పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇక వాళ్లువెంటనే రంగంలోకి దిగి విచారించగా..అతడే టాంగ్ తండ్రి చితాభస్మాన్ని అపహరించాడని తేల్చారు. అయితే అప్పటికే ఎల్వీ మనీలాండరింగ్‌కి సంబంధించిన కేసులో జైల్లో ఉన్నాడు. ఇక ఈ ఘనకార్యంతో ఎల్వీపై మరిన్ని అబియోగాలు మోపి అరెస్టు చేశారు.అలాగే అతడి నుంచి ఆమె తండ్రి చితాభస్మాన్ని కూడా స్వాధీన పర్చుకుని టాంగ్‌కి అప్పగించారు. ప్రేమతో మన నుంచి దూరమైన వాళ్ల మనుసుని గెలుచుకోవాలే గానీ ఇలాంటి పనులతో బలవంతంగా రప్పించుకుంటే..విధి సైతం సహకరించదు అంటే ఇదే కదూ..!.



# టారిఫ్ టెన్షన్



### షాపింగ్ మాల్స్ ముందు లాక్‌డౌన్ దృశ్యాలు

**జనంసాక్షి:** అమెరికాలోని సూపర్ మార్కెట్లన్నీ వినియోగదారుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ఇక్కడికి వచ్చిన జనమంతా తమకు అందిన వస్తువులన్నింటినీ కొనుగోలు చేసి, తమ ట్రాలీలలో నింపేసుకుని, బయటకు వస్తూ కనిపిస్తున్నారు. దీనిని చూసినవారికి త్వరలో లాక్‌డౌన వస్తుందనే విధంగా అక్కడి దృశ్యాలు కనిపిస్తున్నాయి. అమెరికాలో ప్రస్తుతం 'ఇప్పుడే షాపింగ్ చేయండి.. లేదంటే పశ్చాత్తాప పడతారు' అనే ట్రెండ్ నడుస్తోంది. అమెరికాలోని వినియోగదారులు షాపింగ్ మాల్స్‌కు పరుగులు తీయడం వెనుక ప్రధాన కారణం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త టారిఫ్ పాలసీ ఏప్రిల్ 2న డోనాల్డ్ ట్రంప్ భారత్, చైనాతో సహా పలు దేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై భారీ సుంకాలను విధించారు. దీనిపై అమెరికన్లు కలత చెందుతున్నారు. రాబోయే రోజుల్లో పలు వస్తువులు చాలా ఖరీదైనవిగా మారుతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ భయంతోనే వారంతా ఉప్పు మొదలుకొని టీవీలు, ఫ్రిజ్‌లు.. ఇలా అన్నింటికీ కొనుగోలు చేస్తున్నారు.నిపుణుల అభిప్రాయం ప్రకారం ట్రంప్ ప్రభుత్వ సుంకాల విధానం దిగుమతులపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపనుంది. ఇది కంపెనీల ఖర్చును పెంచుతుంది. ఫలితంగా ఆ భారం కస్టమర్‌పై పడుతుంది. అయితే డోనాల్డ్ ట్రంప్ అమెరికాకు ఈ సుంకాలు మేలు చేస్తాయని చెబుతున్నారు. అమెరికన్లు ప్రస్తుతం చేస్తున్న షాపింగ్ తీరు చూస్తుంటే.. వారెవరికీ ట్రంప్ హామీలపై పెద్దగా నమ్మకం లేదని అనిపిస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు మైక్రోవేవ్‌లు అత్యధిక సంఖ్యలో అమ్ముడవుతున్నాయి.అమెరికాకు ఎలక్ట్రానిక్స్ వస్తువులు, విడిభాగాలు చైనా తదితర దేశాల నుండి దిగుమతి అవుతాయి. సుంకాల పెరుగుదల కారణంగా భవిష్యత్తులో అవి మరింత ఖరీదైనవిగా మారే అవకాశం ఉంది. సుంకాలు విధించాక ధరలలో 15-20శాతం మేరకు పెరుగుదల తప్పకుండా ఉంటుందని డీలర్లు స్పష్టంగా చెబుతున్నారు. అందుకే అమెరికన్లు వివిధ రకాల షోరూంలకు క్యూ కడుతున్నారు. రాబోయే రోజుల్లో ధరలు పెరిగే అవకాశం ఉన్నందున జీన్స్, స్పోర్ట్స్ వేర్, వర్క్ వేర్, క్యాజువల్ షూలను కూడా ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాఫీ, స్నాక్స్, సాస్‌లు, అంతర్జాతీయ కిరాణా వస్తువులు కూడా జోరుగా విక్రయమవుతున్నాయి. బ్లెండర్లు, ఎయిర్ ఫ్రైయర్లు, మసాజ్ కుర్చీలు, ట్రెడ్‌మిల్స్ కూడా విరివిగా అమ్ముడవుతున్నాయి.

## కెనడా పార్లమెంట్‌కు తాళాలు..

### ఎన్నికల వేళ అసలేం జరుగుతోంది?

**జనంసాక్షి:**కెనడా పార్లమెంటు భవనంలోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించడంతో తాత్కాలికంగా మూసివేసినట్లు ఒట్టావా పోలీసులు వెల్లడించారు. అక్రమంగా పార్లమెంట్ హిల్‌లోని ఈస్ట్ బ్లాక్‌లోకి ప్రవేశించిన ఓ వ్యక్తి రాత్రంతా లోపలే ఉన్నట్లు పోలీసులు గుర్తించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది.అయితే, దుండగుడి వద్ద ఆయుధాలు ఉన్నాయా లేదా అనే దానిపై స్పష్టత లేదని పోలీసులు తెలిపారు.శనివారం రాత్రి ఓ వ్యక్తి పార్లమెంట్ భవనంలోకి అక్రమంగా చొరబడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భవనం చుట్టూ పోలీసులను మోహరించారు. బ్యాంక్ స్ట్రీట్ నుండి సస్సెక్స్ డ్రైవ్ వరకు వెల్లింగ్టన్ స్ట్రీట్‌లోని అన్ని రోడ్లను మూసివేశారు. పెద్ద సంఖ్యల్లో పోలీసులు మోహరించారు. తూర్పు బ్లాక్‌లో ఉన్న సిబ్బంది మొత్తం ఒకే గదిలోకి చేరుకొని తాళాలు వేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆ వ్యక్తిని



అరెస్ట్ చేసినట్లు పోలీసులు ప్రకటించారు. దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. సహకరించిన ప్రజలకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.కాగా, కెనడాలో అక్టోబర్ 27న జరగాల్సిన ఎన్నికలను ఆరు నెలలకు ముందుగానే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 28న ముందస్తు ఎన్నికల నేపథ్యంలో కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ పార్లమెంటును రద్దు చేశారు. ఈ క్రమంలో పార్లమెంట్ భవనంలోకి దుండగుడు ప్రవేశించడంపై అధికారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అపహరించడానికి దుండగుడు ప్రయత్నించి ఉంటాడా అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



## సుంకాలు మీకు ఓకేనా?

**జనంసాక్షి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వివిధ దేశాలపై సుంకాలను విధించిన తరుణంలో ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సమావేశం కానుండడం ఆసక్తికరంగా మారింది.ఏప్రిల్ 7న జరగనున్న ఈ భేటీలో ఇరువురు నేతలు గాజా స్వాధీనం కోసం తుది యుద్ధ ప్రణాళికను సిద్ధం చేశారని తెలుస్తోంది.ఇజ్రాయెల్ త్వరలోనే గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోబోతోందని, ఇందుకు ట్రంప్ మద్దతుగా నిలుస్తున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అలాగే అమెరికా సర్కారు కొత్తగా విధించిన సుంకాలపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ట్రంప్ చర్చించనున్నారని సమాచారం.ట్రంప్ రెండవసారి అధ్యక్షుడైన తర్వాత వైట్ హౌస్‌లో నెతన్యాహుతో ఇప్పుడు రెండోసారి సమావేశమవుతున్నారు. ఈ సమావేశాన్ని వైట్ హౌస్ తో పాటు నెతన్యాహు కార్యాలయం ధృవీకరించాయి. హమాస్ తీవ్రవాదులపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ గతకొంతకాలంగా గాజా స్ట్రిప్‌లోని నూతన భద్రతా కారిడార్‌లో సైన్యాన్ని మోహరిస్తున్న తరుణంలో ఇద్దరు నేతల మధ్య సమావేశం జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గత నెలలో ఇజ్రాయెల్ కాల్పుల విరమణను ఉల్లంఘించి, అకస్మాత్తుగా గాజాపై బాంబు దాడి చేసింది. ఈ చర్యకు వైట్ హౌస్ మద్దతు పలికింది. కాగా బెంజమిన్ నెతన్యాహు, డొనాల్డ్ ట్రంప్ ఈ సమావేశంలో సుంకాల సమస్య, ఇజ్రాయెల్-టర్కీ సంబంధాలు, ఇరాన్ నుండి పొంచివున్న ముప్పు తదితర అంశాలపై చర్చించనున్నట్లు నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గత వారం గాజాలో హమాస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా అనేక మంది పాలస్తీనియన్లు ప్రాణ భయంతో శిబిరాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**జాతీయం అంతర్జాతీయం**

## ఇజ్రాయెల్ అత్యుత్సాహం

### బ్రిటన్ ఎంపీల నిర్బంధం

**జెరూసలేం(జనంసాక్షి):** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వేళ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన ఇద్దరు బ్రిటన్ ఎంపీలను అక్కడి అధికారులు అడ్డుకుని నిర్బంధించారు.దీంతో, ఈ ఘటనపై బ్రిటన్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని యూకే విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ మండిపడ్డారు.వివరాల ప్రకారం.. బ్రిటన్‌లో అధికార లేబర్ పార్టీకి చెందిన యువాన్ యాంగ్, అబ్తిసామ్ మొహమ్మద్ ఇద్దరూ శనివారం ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లారు. లుటాన్ నుంచి ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో వారిని అధికారులు అడ్డుకుని నిర్బంధించారు. అనంతరం కొంత సమయం తర్వాత వారిద్దరినీ విడిచిపెట్టారు. తమ భద్రతా దళాల కార్యకలాపాలను డాక్యుమెంట్ చేయడంతో పాటు తమపై వ్యతిరేకతను పెంచేందుకు ఆ ఎంపీలు వచ్చారని ఇజ్రాయెల్ ఆరోపించింది. అందుకే వారి రాకను అడ్డుకున్నట్లు తెలిపారు. సమాచారం లేకుండా ఇక్కడ వచ్చారు? అని ప్రశ్నించారు అధికారులు. దీంతో, ఇజ్రాయెల్ టెల్‌అవీవ్ చర్యను యూకే విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ తీవ్రంగా పరిగణించారు.ఈ నేపథ్యంలో డేవిడ్ లామీ స్పందిస్తూ..' ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన యూకే పార్లమెంటరీ ప్రతినిధి బృందంలోని ఇద్దరు ఎంపీలను అక్కడి అధికారులు నిర్బంధించారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారి చర్య తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మా ఎంపీలతో వారు ఈ విధంగా వ్యవహరించడం సరికాదు. ఇదే విషయాన్ని అక్కడి ప్రభుత్వంలోని నా సహచరులకు స్పష్టం చేశాను. ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ, గాజాలో శాంతి నెలకొల్పడం వంటి అంశాలకు సంబంధించిన చర్చలపైనే మా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది' అని తెలిపారు.ఇక, యువాన్ యాంగ్ బ్రిటన్‌లోని ఎర్లీ, వుడ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. అబ్తిసామ్ మొహమ్మద్ షెఫీల్డ్ సెంట్రల్‌కు ఎంపీగా ఉన్నారు. వీరిద్దరి నిర్బంధానికి సంబంధించిన కథనాలు పలు మీడియా చానల్స్‌లో ప్రసారం అయ్యాయి.



## బ్రిటన్‌కు అణు జలాంతర్గాములపై రష్యా నిఘా !

**ఆ దేశ సముద్రగర్భంలో రహస్య సెన్సర్లు అంతర్జాతీయ మీడియా కథనాలు**

మాస్కో(జనంసాక్షి):బ్రిటన్‌కు సంబంధించిన అణు జలాంతర్గాములపై రష్యా నిఘా పెట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ జలాంతర్గాములను ట్రాక్ చేసేందుకు రహస్య సెన్సర్‌లను మోహరించినట్లు తెలిపాయి. బ్రిటన్ చుట్టుపక్కల ఉన్న జల మార్గాల్లో కొన్ని రహస్య పరికరాలను రాయల్ నేవీ గుర్తించింది. దీంతో మాస్కో తమపై నిఘా ఉంచిదంటూ యూకే ఆరోపిస్తోంది.

# పదేళ్లుగా హోప్ వేసవి సేవలు

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 06 (జనంసాక్షి)**

: శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధి జాతీయ ప్రధాన రహదారిపై హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ కొండా విజయ్ కుమార్ చలివేంద్రాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మొదటి రోజులో భాగంగా ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు మజ్జిగను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారానికే ఎండాకాలం ఎండలు మండిపోతున్నాయని, ప్రజలు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉదయం 9 గంటల వరకే సూర్యుడి ప్రభావం కనిపిస్తుండడంతో బయట తిరగలేని పరిస్థితి నెలకొంది అన్నారు

. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వడదెబ్బతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ హెచ్చరించారు. వేసవికాలంలో శేరిలింగంపల్లి పరిధిలో స్థానిక ప్రజలు, ప్రయాణికులు, చిరు వ్యాపారులను దృష్టిలో ఉంచుకొని గత 10 సంవత్సరాలుగా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్వాడి సమాజ్ సభ్యులు సునీల్, రాజేష్, హేమంత్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## వెల్లివిరిసిన మత సామరస్యం



**బెల్లంపల్లి, ఏప్రిల్ 6, (జనంసాక్షి)**

బెల్లంపల్లి పట్టణంలో మత సామరస్యం వెల్లివిరిసింది. ఆదివారం ముస్లింలు బెల్లంపల్లి పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో హనుమాన్ మాల ధారణ వేసిన స్వాములకు బిక్ష ( అన్నప్రసాద ) కార్యక్రమం నిర్వహించారు. హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లాగ కలిసి మెలిసి ఉంటామని, మత కలహాలు కాదు, మానవత్వంమే ముద్దు అని వారు అన్నారు. మాల ధారణ చేసిన అంజన్న స్వాములకు అన్న ప్రసాదం అందించి హిందూ, ముస్లింల ఐక్యతను చాటారు. ఈకార్యక్రమంలో సిరాజ్, మిరాజ్, హనీఫ్, దీక్షా స్వాములు లక్ష్మణ్ రావు, పిన్ని రెడ్డి, ఇందూరి ప్రభాకర్, రాజశేఖర్ గౌడ్, బొడ్డు రామకృష్ణ, బందెల మురళి, నక్క సంతోష్, కుంబాల రాజేష్, దెబ్బటి రమేష్, గోవర్ధన్, గాదె మొండి, గడ్డం అశోక్, అసాది మధు, ఇతర బిక్ష స్వాములు పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలను హైదరాబాద్‌లో రద్దు చేయాలి

**పలు సంఘాల డిమాండ్**

**కమర్షియల్ మార్కెటింగ్ కోసం అందాల పోటీలు : జస్టిస్ చంద్రకుమార్**

**ఖైరతాబాద్, మార్చి 6 (జనంసాక్షి)**

: హైదరాబాద్ వేదికగా మే నెలలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ (ఎఐడీఎస్‌వో), ఆల్ ఇండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్ (ఎఐడీవైవో), ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం (ఎఐఎంఎస్-ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశంలో రాచరిక వ్యవస్థ ఏర్పడిన తర్వాత మహిళలను అణచివేయడం ప్రారంభించారని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం విద్య అనేది కొందరికే దక్కేదని, కాని సావిత్రిబాయి పూలే లాంటి వారి చొరవతో మహిళలు చదువుకున్నారని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్త్రీ పురుషులకు సమాన హక్కులు కల్పించారని పేర్కొన్నారు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ మరోసారి మహిళను బానిసగా చూడటం ప్రారంభమైందని అన్నారు. ఆడపిల్లలను అందమైన వస్తువుగా చూపిస్తూ మార్కెటింగ్ వ్యవస్థ విస్తృతికి ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ఆడపిల్లలను ఓ శాస్త్రవేత్త, వ్యాపారవేత్త, సంఘసంస్కర్త, విద్యావేత్తగా చూపించాల్సి ఉండగా, కమర్షియల్ మార్కెటింగ్ కోసం అందాల పోటీలను నిర్వహిస్తూ మరోసారి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు అలాంటి సాంకేతాలనిస్తుందని, దానిని విరమించుకునేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం రాష్ట్ర కన్వీనర్ హేమలత మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మే 7 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే 72వ మిస్ వరల్డ్ అందాల పోటీలు కాస్మోటిక్ కంపెనీలకు వేలాది కోట్ల లాభాలను చేకూర్చేందుకు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ పోటీల వల్ల మహిళలకు ఎలాంటి ఉపయోగం లేదని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం అందుకు రూ.54కోట్లు ఖర్చుచేయడం అర్థరహితమని అన్నారు. కొలతల ద్వారా అందాన్ని నిర్ణయించడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఈ ఆలోచన మానుకోవాలని హితవుపలికారు. ఈ సమావేశంలో అటవీ శాఖ విశ్రాంత డిప్యూటీ సెక్రటరీ జి. కృష్ణవేణి, రచయిత, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ అలూరి విజయలక్ష్మి, సామాజికవేత్త, న్యాయవాది ఎం. మధు, ప్రొఫెసర్ గంగాధర్, ఎన్. శైలజ తదితరులు పాల్గొన్నారు.



## బస్తీలో తాగుబోతుల బెడద ఎక్కువైంది

**ఎమ్మెల్యే దానం నాగేందర్ కు మహిళల ఫిర్యాదు**



**హైదరాబాద్ (జనంసాక్షి)**

ఫిలింనగర్ బస్తీల్లో ఎక్కడ చూసినా గంజాయి మత్తులో యువకులు మునిగిపోతున్నారు. దీన్ దయాళ్‌నగర్ బస్తీలోని ఆలయ పరిసరాల్లో పగలురాత్రీ అనే తేడా లేకుండా మందుబాబులు తిష్టవేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానిక మహిళలు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను చుట్టుముట్టి తమ గోడును వెల్లబోసుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్‌కు వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పెద్ద సంఖ్యలో మహిళలు చుట్టుముట్టారు. తమ బస్తీలో తాగుబోతుల బెడద ఎక్కువైందని, గుడిలోనే మద్యం తాగుతూ వచ్చీపోయేవారిని వేధిస్తున్నారంటూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పెట్రోలింగ్ పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, మీకు ఓట్లు వేసి గెలిపించినందుకు మీరైనా పట్టించుకోండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు కాల్ చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్ పోలీసుల పనితీరుపై జనం నిలదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గంజాయి విచ్చలవిడిగా అమ్ముతుంటే మీరేం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

# బ్యాటరీలతో ఎగిరే విమానం

**సిద్దిపేట యువకుని సాహస ప్రయత్నం**

**విమాన తయారీకి రూ.1.50 లక్షలు**



**సిద్దిపేట (జనంసాక్షి)**

: సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ యువకుడు విమానం తయారు చేసి ఎగురవేయడానికి ప్రయత్నిస్తున్నాడు. అతడి ప్రయత్నాలు ఇప్పుడు కీలక దశకు చేరుకున్నాయి. సుమారు 20 అడుగుల ఎత్తుకు ఎగురవేసి, 40 మీ. వరకు ముందుకు సాగేలా చేశాడు. అతడే బాసంగారి లక్ష్మీనరసింహ. ప్రస్తుతం హైదరాబాద్లో చివర ఏడాది ఇంజినీరింగ్ చదువుతూ, తన నైపుణ్యానికి పదును పెడుతున్నాడు. గతేడాది మేలో ఒకసారి ట్రయల్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరిన్ని మార్పులతో శనివారం జిల్లా కేంద్రంలోని శివారు ప్రాంతంలో మరోమారు ప్రయత్నించాడు. రెక్కలో మార్పులు చేసి, బ్యాటరీ సామర్థ్యాన్ని పెంచి తను అనుకున్న ఫలితాన్ని అందుకున్నాడు. హైదరాబాద్లో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న లక్ష్మీనరసింహ చిన్నప్పటి నుంచే బ్యాటరీ ఆధారంగా నమూనాల రూపకల్పనను ఆసక్తిగా మార్చుకున్నాడు. ఇప్పుడు ఇలా నమూనా విమానాన్ని తయారు చేసి దాన్ని కొంత వరకు ఎగిరించాడు.

**విమాన తయారీకి రూ.1.50 లక్షలు**

ఆ యువకుడు ఏడాదిగా శ్రమిస్తూ విమానం ఎగురవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. సుమారు ఆరున్నర కిలోల బరువున్న నమూనా తయారీకి డెప్రాన్ షీట్స్ను వినియోగించారు. ఆరు చిన్నపాటి టైర్లు, నాలుగు చొప్పున ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్, సర్వో, ప్రొపెల్లర్స్, మోటార్లు సహా రెండు లిథియం పాలీమర్ బ్యాటరీలు, పాలీ కవర్, రేడియం స్టిక్కర్స్, టేకు కలప వినియోగించారు. రూ.1.50 లక్షలు వెచ్చించి ఈ విమానాన్ని తయారు చేశారు. తాజా ప్రయత్నంలో కొంతదూరం ఎగిరి ముందుకు సాగింది.

**నెలాఖరుకు పూర్తిస్థాయిలో ఎగురవేస్తా : లక్ష్మీనరసింహ**

బ్యాటరీతో నడిచే ఈ విమానం ట్రాన్స్మిటరు ఆధారంగా ఆపరేట్ చేయవచ్చు. ఇటీవల పలు ప్లేస్ నమూనాలు తయారీ చేశానని తెలిపారు. ఇంకా మెరుగుపర్చి ఈ నెల చివర్లో కచ్చితంగా పూర్తిస్థాయిలో ఎగురవేస్తానని లక్ష్మీనరసింహ ధీమా వ్యక్తం చేశారు.

## తెలుగు విద్యార్థులు సేఫ్



**అమెరికాలో అగ్నిప్రమాదం నుంచి బయటపడ్డ స్టూడెంట్స్**

**బాధితులంతా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాసులు**

**బర్మింగ్‌హామ్ (జనంసాక్షి) :**

అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి పది మంది తెలుగు విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. శనివారం సాయంత్రం 6.20 గంటల సమయంలో బర్మింగ్‌హామ్‌లోని కెల్లామ్ స్ట్రీట్‌లో ఉన్న రెండు అపార్టుమెంటుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బిల్డింగ్ మొత్తానికి వ్యాపించడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అపార్టుమెంట్లలో ఉన్న పది మంది విద్యార్థులను రక్షించారు. వారిలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో దవాఖానకు తరలించారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. బాధితులంతా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులని పేర్కొన్నాయి. వారు అలబామా విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నారని తెలిపాయి. అపార్టుమెంట్లు పూర్తిగా దగ్ధమయ్యాయని వెల్లడించాయి. శనివారం సాయంత్రం 6.20 గంటలకు బిల్డింగ్‌లో మంటలు వ్యాపించాయని బాధితుల్లో ఒకరు ఇన్‌స్టా పోస్టు ద్వారా వెల్లడించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, వేగంగా అపార్టుమెంట్ మొత్తం వ్యాపించాయని తెలిపారు. అందరం వెనుక డోర్ నుంచి బయటకు వచ్చేశామని, కానీ ఒకరు మాత్రం పొగలు దట్టంగా అలముకోవడంతో అందులో చిక్కుకుపోయాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇద్దరు ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి నిలకడగానే ఉన్నదని అందులో తెలిపారు. అగ్నిప్రమాదం నుంచి తాము బయటపడటం చాలా గొప్పవిషయమని చెప్పారు.

## మండుతున్న ఎండలు.. మీ ఆరోగ్యం జాగ్రత్త

**హైదరాబాద్ (జనంసాక్షి) :**




ఎండలు భగ్గుమంటున్నాయి. ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. వేసవి కాలంలో వృద్ధులు త్వరగా వారి శక్తిని కోల్పోతుంటారు. వారి జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థపై ఎండాకాలం ప్రభావం చూపనుందని నిపుణులు సూచిస్తున్నారు. ఏటా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, విపరీతమైన వేడి కారణంగా వృద్ధులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి లైఫ్?స్టైల్?ను మార్చుకోవాలని నిజామాబాద్ బోధనాసుపత్రి పర్యవేక్షణాధికారిణి డా.ఫరీదా వెల్లడించారు. ఆమె చెప్పిన పలు సూచనలు ఇవే.వేసవిలో చేయాల్సిన పనులు : వేడి వాతావరణం శరీరాన్ని నిర్జలీకరణం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఇది తీవ్రమైన బద్ధకం కలిగిస్తుంది. వృద్ధులు వడదెబ్బ, ఇతర వేసవి అనారోగ్యాల నుంచి బయటపడటానికి కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలి. పుష్కలమైన నీరు తాగడం ద్వారా వృద్ధుల్లో శరీర వేడి తగ్గి నాణ్యమైన ఆరోగ్యానికి దోహదపడనుంది. సమతుల ఆహార పదార్థాలు తినేలా జాగ్రత్తపడాలి. కాలానుగుణంగా లభించే పండ్లు, కూరగాయలు, గింజలు, అధిక నీటి శాతం ఉన్న మొదలైన ఆహార పదార్థాలను తీసుకోవాలి.లోపాలకు అనుగుణంగా : వేసవితో సహా ఏడాది పొడవునా వృద్ధుల ఆరోగ్య శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడంలో న్యూట్రిషన్ సప్లిమెంట్లు ప్రముఖంగా కీలక పాత్ర పోషిస్తాయి. విటమిన్ బి6, బి12, డి, కాల్షియం, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వంటి కొన్ని సప్లిమెంట్లను అందించాలి. డాక్టర్ల పర్యవేక్షణలోనే వాటిని తీసుకోవాలి. వృద్ధుల వ్యక్తిగత అవసరాలను అంచనా వేసి పోషక లోపాలను పరిష్కరించడానికి ఈ సప్లిమెంట్లను డాక్టర్ ఫరీదా సూచించారు.

# మ్యాట్రిమోనీలో మాయగాళ్లు

**ఆన్‌లైన్‌లో పరిచయం.. అన్నివిధాలా యువతికి మోసం**

**హైదరాబాద్ (జనంసాక్షి)**



: హైదరాబాద్‌కు చెందిన ఒక యువతి ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తి చేతిలో లైంగిక వేధింపులకు, ఆర్థిక దోపిడీకి గురైంది. ఆమె ఫిర్యాదు ఆధారంగా, చిల్కల్‌గూడ పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడు, నాగోల్ నివాసి అయిన 34 ఏళ్ల కొర్రా రాజా అలియాస్ కొర్రా రాజ్ చౌహాన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. మాయమాటలతో నమ్మించి బాధితురాలిని లైంగికంగా లోబరుచుకున్నట్లు నిందితుడు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. బాధితురాలు ఏప్రిల్ 1న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. చిల్కలగూడ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ బి.అనుదీప్ మాట్లాడుతూ.. నిందితుడు మ్యాట్రిమోనియల్ యాప్ ద్వారా యువతిని సంప్రదించాడని, ఆమె నమ్మకాన్ని సంపాదించడానికి మూడు నెలలపాటు మాయ మాటలు చెప్పినట్లు గుర్తించారు. ఆమెతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పరచుకున్న తర్వాత, పలుమార్లు ఆమెపై లైంగిక దాడి చేశాడు. తరువాత ఆమె సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించి ఆమెను బ్లాక్ మెయిల్ చేశాడు. రూ. 1.5 లక్షలు బలవంతంగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొర్రా రాజాకు ఆల్రెడీ మ్యారేజ్ అయినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. అతను మహిళలను ట్రాప్ చేసేందుకు మ్యాట్రిమోనియల్ సైట్లలో అనేక నకిలీ ప్రొఫైల్‌లను సృష్టించాడని పోలీసులు చెబుతున్నారు. బాధితులను ఆర్థికంగా, మానసికంగా దోపిడీ చేసేవాడని వెల్లడించారు. విచారణలో, నిందితుడు వివాహ యాప్‌ల ద్వారా చాలా మంది మహిళలను వేధించినట్లు అంగీకరించాడు. పోలీసులు మ్యాట్రిమోనియల్ యాప్ నుంచి చాట్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీ రుజువులు, ఇతర డిజిటల్ ఆధారాలతో సహా బలమైన ఆధారాలను సేకరించారు.

# రామాలయంలో కూలిన టెంట్లు

**ముగ్గురు భక్తుల తలలు పగిలి తీవ్ర గాయాలు**

**పాలకుర్తి మండలంలో గాలి దుమారం బీభత్సం**

**పాలకుర్తి (జనంసాక్షి)**



జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడి రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం వేళ అపశృతి చోటు చేసుకుంది. వల్మిడి ఆలయం సమీపంలో సుడి గాలి బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల ధాటికి శ్రీరామనవమి సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు కుప్పకూలాయి. ఒక్కసారిగా టెంట్లు కూలడంతో భక్తులు పరుగులు పెట్టారు. దీంతో ముగ్గురు భక్తుల తలలపై టెంటు రాడ్లు పడ్డాయి. దీంతో భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.

**భోజనాలు నేలపాలు**

వారిలో గంట్లకుంట గ్రామానికి చెందిన సంధ్యారాణి, చెన్నూరు గ్రామానికి చెందిన మనుశ్రీ, వసురి మారమ్మ అనే మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్సు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనాలలో తీసుకువెళ్లారు. శ్రీరామనవమి సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన భోజనాలు నేలపాలయ్యాయి.

## నేనింకా ఐపీఎల్లో ఆడుతున్నా..



ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని శనివారం వార్తలొచ్చాయి. చెపాక్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షించేందుకు ధోనీ తల్లిదండ్రులు పాన్ సింగ్, దేవకీదేవీ స్టేడియానికి వచ్చారు. సాధారణంగా వారు మ్యాచ్‌లు చూసేందుకు రారు. కానీ ఢిల్లీ మ్యాచ్‌కు రావడంతో మాహీ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని కథనాలు పుట్టుకొచ్చాయి. మ్యాచ్ అనంతరం ధోనీ ఆ ప్రకటన చేయకపోవడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ధోనీ.. తన రిటైర్మెంట్ వార్తలను ఖండించాడు. సీజన్ పూర్తయ్యేవరకు ఐపీఎల్ కు వీడ్కోలు పలికే ఆలోచన లేదని పేర్కొన్నాడు. "ఇప్పటికిప్పుడు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించను. నేనింకా ఐపీఎల్‌లో ఆడుతున్నా. ఈ విషయంపై ఏడాదికి ఒకసారి సమీక్షించుకుంటా. ప్రస్తుతం నాకు 43 ఏళ్లు. జులైలో 44వ ఏటలోకి అడుగు పెడతా. ఇంకా ఆడాలా? వద్దా అని నిర్ణయించు కోవడానికి నాకు 10 నెలల సమయం ఉంది. నా రిటైర్మెంట్ ఎప్పుడు అని నిర్ణయించేది నేను కాదు.. నా శరీరం. సీజన్ ప్రారంభానికి ముందు శరీరం సహకరిస్తోందనిపిస్తే ఆడతా, 'ఇక చాలు' అని అనిపించేంతవరకు ఇదే విధానాన్ని కొనసాగిస్తా"

**- మహేంద్ర సింగ్ ధోనీ**

## ఫస్ట్ ఓవర్‌లోనే..

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ స్పీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్ దూకుడుగా బౌలింగ్ చేస్తున్నాడు. ఫస్ట్ ఓవర్ లాస్ట్ బంతికి ట్రావిస్ హెడ్ (9)ను ఔట్ చేశాడు సిరాజ్. 2 బౌండరీలు కొట్టిన స్టార్ బ్యాటర్.. మియాపై పైచేయి సాధించినట్లే కనిపించాడు. కానీ మంచి బంతితో అతడి పనిపట్టాడు సిరాజ్. ఆ తర్వాత వరుస బౌండరీలతో దూకుడు మీద ఉన్న అభిషేక్ శర్మ (18)ను వెనక్కి పంపి ంచాడు. ఇలా ఆదిలోనే ఆరెంజ్ ఆర్మీ జోరుకు బ్రేకులు వేశాడు. ముఖ్యంగా హెడ్‌ను పంపడం ఎస్ఆర్‌హెచ్‌కు బిగ్ మైనస్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్స్.. హెడ్ మీద మియా పగ తీర్చుకున్నాడని, ఇది ఐపీఎల్‌కు మించిన రైవల్రీ అని కామెంట్స్ చేస్తున్నారు. లోకల్ బాయ్ క్వాలిటీ పేస్, పర్ఫెక్ట్ లైన్ అండ్ లెంగ్త్‌తో అదరగొడుతున్నాడని మెచ్చుకుంటున్నారు.

# సమిష్టి కృషిగా

## సన్‌రైజర్స్‌ను ముంచేసిన బ్యాటర్లు

### గుజరాత్ ఘన విజయం




**ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఒక్కరంటే ఒక్కరు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. మంచి స్టార్ట్స్ అందుకున్నాక అనవసరంగా వికెట్లు పారేసుకున్నారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్ల బెండు తీస్తారేమో అనుకుంటే.. వాళ్ల ముందు బెండ్ అయిపోయారు. అభిషేక్ శర్మ (18), ఇషాన్ కిషన్ (17) మంచి స్టార్ట్స్ అందుకున్నా ఔట్ అయ్యారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ట్రావిస్ హెడ్ (8) ఫస్ట్ ఓవర్‌లోనే పెవిలియన్‌కు చేరడం ఆరెంజ్ ఆర్మీ భారీ స్కోరు ఆశల్ని అడియాశలు చేసింది.**

సన్‌రైజర్స్ హైదరాబాద్ తీరు మారలేదు. ఇప్పటికే మూడు పరాజయాలతో సతమతమైన సన్‌రైజర్స్ స్వంత మైదానంలో నాలుగో ఓటమిని మూటగట్టుకుంది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ విఫలమై మరో పరాజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు చక్కగా రాణించిన గుజరాత్ టైటాన్స్ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. 16.4 ఓవర్లలోనే హైదరాబాద్ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంది. టాస్ గెలిచిన గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బౌలింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ గుజరాత్ బౌలర్లు చెలరేగిపోయారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ట్రావిస్ హెడ్ (8) ఫస్ట్ ఓవర్‌లోనే పెవిలియన్‌కు చేరి నిరాశపరిచాడు. అభిషేక్ శర్మ (18), ఇషాన్ కిషన్ (17) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఓపెనర్లిద్దరినీ సిరాజ్ అవుట్ చేసి గట్టి దెబ్బ తీశాడు. ఆ తర్వాత నితీష్ కుమార్ (31), క్లాసెన్ (27) నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. వారు అవుట్ అయిన తర్వాత మిగిలిన బ్యాటర్లెవరూ రాణించలేకపోయారు. దీంతో హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. సిరాజ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ప్రసిద్ధ్ కృష్ణ, సాయి కిషోర్ రెండేసి వికెట్లు తీశారు.

153 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్‌కు ఆరంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. సాయి సుదర్శన్‌ను షమీ, బట్లర్‌ను ప్యాట్ కమిన్స్ అవుట్ చేసి సన్‌రైజర్స్‌ను గేమ్‌లోకి తీసుకొచ్చారు. అయితే నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వాషింగ్టన్ సుందర్ (29 బంతుల్లో 49) మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. మరో ఎండ్‌లో గిల్ (61) అర్ధశతకం సాధించి గుజరాత్‌ను విజయ తీరాలకు చేర్చాడు. చివర్లో రూథర్‌ఫర్డ్ (30) వేగంగా ఆడాడు. హైదరాబాద్ నిర్దేశించిన లక్ష్యాన్ని గుజరాత్ 16.4 ఓవర్లలోనే ఛేదించింది. సన్ రైజర్స్ బౌలర్లలో షమీ రెండు వికెట్లు, ప్యాట్ కమిన్స్ ఒక వికెట్ దక్కించుకున్నారు.

"బ్యాటింగ్ రాక్షసులతో నిండిన సన్‌రైజర్స్‌కు బౌలింగ్ పెద్ద హెడెక్‌గా మారింది. బ్యాటర్లలో ఇద్దరు, ముగ్గురైనా క్లిక్ అవుతున్నారు. కానీ బౌలింగ్ యూనిట్‌లో ఒక్కరూ రాణించ డం లేదు. కెప్టెన్ కమిన్స్ దగ్గర నుంచి షమి, సిమర్జీత్, హర్షల్ పటేల్ వరకు అంతా దారుణంగా విఫలమవుతున్నా రు. అవసరమైనప్పుడు బ్రేక్‌త్రూలు అందించలేకపోతున్నారు. ధారాళంగా పరుగులు ఇచ్చుకుంటున్నారు. బౌలింగ్‌లో భారీగా రన్స్ లీక్ చేయడం వల్ల బ్యాటర్ల మీద ఒత్తిడి పెరుగుతోంది. కాబట్టి బౌలర్లు మారాల్సిందే. ఎఫెక్టివ్‌గా బౌలింగ్ చేయాల్సిందేననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా యి. ప్రతి బంతిని, ప్రతి పరుగును కీలకంగా తీసుకోవాలనే సూచనలు వస్తున్నాయి.



## ఎక్కడికక్కడ బ్రేకులు

తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి (31), కాటేరమ్మ పెద్ద కొడుకు హెన్రిక్ క్లాసెన్ (27) సెటిల్ అయ్యారు. ఇక, ఢోకా లేదని ఫ్యాన్స్ అనుకున్నారు. కానీ తక్కువ గ్యాప్‌లో ఇద్దరూ 5 పరుగుల తేడాతో పెవిలియన్ చేరారు. ఇలా ఎక్కడికక్కడ బ్రేకులు పడటం తో స్కోరు బోర్డు వేగం అందుకోలేక పోయి ంది. ఆఖర్లో అనికేత్ వర్మ (18), కమిన్స్ (22 నాటౌట్) పోరాడినా పెద్దగా ఫలితం లేకపోయింది. మొత్తానికి 20 ఓవర్లు ముగి సేసరికి 8 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఉప్పల్ లాంటి బ్యాటింగ్ పిచ్‌పై ఈ స్కోరును ప్రత్యర్థి జట్టు బ్యాటర్లు ఉఫ్‌మని ఊదేసే ప్రమాదం ఉంది. బౌలర్లు పట్టుదల తో బౌలింగ్ చేసి ఏదైనా మ్యాజిక్ జరిగితే తప్ప సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లో గెలవడం దాదాపుగా అసా ధ్యంగా కనిపిస్తోంది. కానీ క్రికెట్ అంటేనే ఆశ్చర్యాలకు వేదిక. కాబట్టి ఇప్పుడే ఏమీ చెప్పలేం. ఏమో మన బౌలర్లు చెలరేగావచ్చు.. గుజరాత్ పుట్టి మునగావచ్చు. అద్భుతాలు చెప్పి జరుగుతాయా ఏంటి.. అని అభిమానులు ఇంకా సన్ రైజర్స్ విజయంపై నమ్మకంగానే ఉన్నారు.

# రోహిత్‌తో.. జ్ఞాపకాలు మరవలేం..



భారత క్రికెట్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సుదీర్ఘ కాలంగా జట్టుకు సేవలందిస్తున్న ఈ ఇద్దరూ ఎన్నో అద్భుత విజయాల్లో భాగమయ్యారు. ఒకరి నాయకత్వంలో ఒకరు ఆడుతూ జూనియర్లకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. అంతేకాదు తమమధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు వచ్చిన ప్రతిసారి.. తమ స్నేహంతోనే చెక్ పెట్టారీ లెజెండ్స్. అభిమానులు ముద్దుగా రో–కోగా పిలుచుకునే ఈ జోడీ.. ఐపీఎల్ 18వ సీజన్‌లో మాత్రం ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. ఏప్రిల్ 7, సోమవారం ముంబై ఇండియన్స్ తో మ్యాచ్‌కు ముందు కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో రోహిత్‌తో తనకున్న అనుబంధం గురించి వెల్లడించాడు. ఆ వీడియోను ఆర్సీబీ ఫ్రాంచైజీ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రోహిత్, నేను సుదీర్ఘ కాలం జాతీయ జట్టుకు ఆడుతున్నాం. గత ఏడాది వరకూ మూడు ఫార్మట్లలో కొనసాగిన మేము.. ఎంతో సఖ్యతగా ఉండేవాళ్లం. దేశం తరఫున మైదానంలోకి కలిసి దిగిన ప్రతిసారి ఇద్దరం ఆటను ఆస్వాదించాం. నిజం చెప్పాలంటే రోహిత్‌తో ఆడడం, టీ20 వరల్డ్ కప్ గెలుపొందడం, ఛాంపియన్స్ ట్రోఫీని అందుకోవడం నాకు ఎప్పటికీ చిరస్మరణీయం. ఆ జ్ఞాపకాలు నాతో ఎల్లప్పుడూ ఉంటాయి. పొట్టి వరల్డ్ కప్ ఛాంపియన్లుగా స్వదేశం వచ్చాక.. బస్ పరేడ్‌లో రోహిత్, నేను ట్రోఫీని పట్టుకొని అభిమానులకు అభివాదం చేయడం మర్చిపోలేను' అని కోహ్లీ తెలిపాడు.

రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు బార్బడోస్‌లో జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై గెలుపొంది ట్టు టీ20 వరల్డ్ కప్‌ను అందుకుంది. సఫారీలపై విజయంలో కోహ్లీ 75 పరుగుల ఇన్నింగ్స్ ది కీలక పాత్ర. అయితే.. ఆ విజయోత్సాహంలోనే ముందుగా విరాట్.. పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాడు. అతడిని అనుసరించి న రోహిత్ తాను కూడా టీ20ల నుంచి వైదొలుగుతున్నాని చెప్పాడు.



# మాది అత్యుత్తమ జట్టు

ఐపీఎల్ 18వ సీజన్‌లో దుమ్మరేపుతున్న పంజాబ్ కింగ్స్‌కు తొలి ఓటమి ఎదురైంది. వరుసగా రెండు విజయాలు సాధించిన ఆ జట్టు సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ చేతిలో పరాజయం పాలైంది. అయితే.. ఓటమికి తాము కుంగిపోవడం లేదని.. ఈసారి కచ్చితంగా ప్లే ఆఫ్స్ చేరుతామని అంటున్నాడు యజ్వేంద్ర చాహల్. ఈ సీజన్‌లో మాది అత్యుత్త మ జట్టు. మా బ్యాటింగ్, బౌలింగ్ దళం ఎంతో పటిష్టంగా ఉంది. బ్యాటింగ్ లో 10వ స్థానం వరకూ చెలరేగి ఆడగల ఆటగాళ్లు ఉన్నారు. ఇక బౌలింగ్ విషయానికొస్తే.. 7 నుంచి 8 మంది బంతితో విజృంభించగలరు. అందుకే.. మా టీమ్ ఈసారి పాయింట్ల పట్టికలో టాప్ -2గా నిలుస్తుంది. దర్జాగా ప్లే ఆఫ్స్ ఆడుతుందిబీ అని వెల్లడించాడీ స్పిన్నర్. అంతేకాదు.. తనకు పంజాబ్ చెల్లిస్తున్న రూ.18 కోట్లకు న్యాయం చేస్తానని అన్నాడు చాహల్.

టీ20 స్పెషలిస్ట్ స్పిన్నర్ అయిన చాహల్ భారత జట్టుకు దూరమై రెండేళ్లు కావొస్తోంది. టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉన్నప్పటికీ తుది జట్టులో మాత్రం చోటు దక్కలేదు. అయినా సరే నిరాశ చెందని చాహల్ ఐపీఎల్‌లో అదరగొడుతున్నాడు. నిరుడు రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన అతడిని మెగా వేలంలో రూ.18 కోట్లకు పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసింది. 18వ సీజన్‌లో 3 మ్యాచ్‌లు ఆడిన చాహల్ ఒకే ఒక వికెట్ తీశాడు. అయితే.. తనకు భారీగా డబ్బులు చెల్లిస్తున్న ఫ్రాంచైజీ అంచనాలు నిలబెట్టుకుంటానని చెబుతున్నాడీ లెగ్ స్పిన్నర్.

# బుమ్రా రాకతో జోష్‌లో ముంబై



ఐపీఎల్ 18వ సీజన్‌లో ఓటములతో సతమతం అవుతున్న ముంబై ఇండియన్స్ అభిమానులకు తీపి కబురు. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆదివారం జట్టుతో కలిశాడు. ఈ విషయాన్ని ముంబై ఫ్రాంచైజీ వెల్లడించింది. 'సింహం వచ్చేసింది. రాజుగా మళ్లీ తన సామ్రాజ్యాన్ని పాలించేందుకు సిద్ధంగా ఉంది' అనే క్యాప్షన్‌తో పోస్ట్ పెట్టింది. దాంతో, ఐదుసార్లు ఛాంపియన్ ముంబై మళ్లీ జోరు కొనసాగించడం పక్కా అని ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. వెన్నునొప్పి కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన బుమ్రా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో లేడు. దాంతో, ఈ పేస్ గన్ రాక కోసం యాజమాన్యం, అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఈ క్రమంలోనే కెప్టెన్ హార్దిక్ పాండ్యా, కోచ్ మహేల జయవర్ధనేలు బుమ్రా కమ్ బ్యాక్ గురించి హింట్ ఇచ్చారు. గాయం నుంచి కోలుకున్నాడని త్వరలోనే జట్టుతో కలుస్తాడని మీడియాతో చెప్పారు. అనుకున్నట్టే నేషనల్ క్రికెట్ అకాడమీ అతడికి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వడంతో ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. ఏప్రిల్ 7న వాంఖడేలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో ఈ యార్కర్ కింగ్ బరిలోకి దిగే అవకాశముంది.







*చిత్రంలో కనిపిస్తున్న గుర్రం పెయింటింగ్ చూస్తే చేయితిరిగిన కళాకారుడే వేసిఉంటాడని అనుకుంటున్నారు కదూ! అయితే పప్పులో కాలువేసినట్లే.. కేవలం పద్నాలుగేళ్ల వయస్సు , తొమ్మిదో తరగతి చదవుతున్న బాలిక ఈ పెయింటింగ్ వేసిందంటే ఆశ్చర్యం కలుగకమానదు. దీన్ని బట్టి ఆమె ప్రతిభా పాటవాలను బేరీజు వేసుకోవచ్చు.*

# పెయింటింగ్‌లో 'దారం' అల్లిక..



## చిన్న వయసులోనే 'సుమేధ' ప్రతిభ

**జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి , కరీంనగర్ :**



కీర్తిశేషులు డాక్టర్ దారం నాగభూషణం పేరు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఆయన వైద్య సేవలతో ప్రాచుర్యం పొందారు. ఏకంగా అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దానికి తోడు ఆయనలో కళా తృష్ణ కూడా ఉంది. ఇందులో భాగంగా కళాకృతు లు గల ఎండిన చెట్లను సేకరించేవారు. దీంతో పాటు స్టాంపులు, సముద్ర తీరాల్లో దొరికే గవ్వలు, మహనీయుల జీవిత చరిత్రకు సంబంధించిన విశేషాలను సేకరించడంతో పాటు ఏకంగా ఓ మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఆయన కుమారుడు డాక్టర్ రఘ రామన్ తండ్రి బాటలోనే నడుస్తున్నారు. మ్యూజియం నిర్వహణతో పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. వారి మనవరాలే దారం సుమేధ.



కేవలం పదేళ్ల వయస్సులోనే రంగులు, బొమ్మలకు ఆకర్షితురాలైన ఆమె బొమ్మలు వేయడం, వాటికి రంగులు అద్దడం ప్రారంభించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆమె మరో వైపు గ్లోబల్ ఆర్ట్ స్కూల్‌లో శిక్షణ పొందుతు న్నారు. తమ టీచర్ మీతా సూచనలతోనే బొమ్మలు వేస్తున్నట్లు చెప్పారు. తన స్నేహితురాలు జోయా తోడు కూడా ఉందన్నారు.



ప్రత్యేకించి తల్లిదండ్రులు సింధూర, తరుణ్ ప్రోత్సాహం, తాత డాక్టర్ రఘురామన్ మెప్పుకోలు తోడైందన్నారు. తండ్రి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, తాత డాక్టర్ అయినప్పటికి తన లక్ష్యం మాత్రం పెయింటర్‌గా ఎదగడమేనని చెప్పారు. ప్రజాజీవితం, జంతువులు, దేవతలు, లాండ్‌స్కేప్ పెయింటింగ్ చేయడం తనకు ఇష్టంగా పేర్కొన్నారు.

పాఠశాల స్థాయిలో ఈ రంగంలో మెడల్స్ కూడా అందుకున్నట్లు చెప్పారు. ఆమె వేసిన పెయింటింగ్స్ చూసిన పలువురు బహుషా ముత్తాత డాక్టర్ నాగభూషణం కళా తృష్ణ ఆమెలో ఈ రకంగా బహిర్గతమైనట్లు చెప్పుకుంటున్నారు. ఇంతదాక జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పీటీ రెడ్డి, తోట వైకుంఠం, ఆగాచార్య పేరెన్నికగన్నారు. అదే కోవలో కరీంనగర్ జిల్లా మరో పెయింటర్‌ను రేపటి తరంలో అందిస్తుందని ఆశిద్దాం..

## ఆఫ్రికన్‌ల వీసాలను రద్దు చేస్తున్న అమెరికా

అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారుల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సరైన పత్రాలు లేకుండా తమ దేశంలో ఉంటున్న వారిని నిర్దాక్షిణ్యంగా స్వదేశాలకు పంపిస్తున్నారు. అక్రమంగా అమెరికాకు వచ్చిన ఆఫ్రికా పౌరులు చాలామందిని ఇటీవల తమ దేశాలకు తిరిగి పంపారు. అయితే వారిని స్వీకరించడానికి ఆయా ఆఫ్రికా దేశాలు నిరాకరించాయి. దాంతో ట్రంప్ కన్నెర్ర చేశారు. అక్రమ వలసదారుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. యూఎస్‌కు వెళ్లిన ఆయా దేశాల పౌరులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి వీసాలను ట్రంప్ యంత్రాంగం రద్దు చేస్తోంది. ఇమ్మిగ్రేషన్ చట్టాల అమలును వేగవంతం చేసే ప్రయత్నాలలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు యూఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో శనివారం ప్రకటించారు. డిపోర్టేషన్ విషయంలో తన ప్రవర్తన మార్చుకొని, సమస్యను పరిష్కరించే వరకు దక్షిణ సూడాన్‌కు చెందిన వారి వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేశామని, కొత్త వీసాల జారీ ప్రక్రియను నిలిపివేస్తున్నామని మార్కో రూబియో ప్రకటించారు. దాంతో అక్కడి పౌరులు ఎవరూ వీసాపై అమెరికాలోకి ప్రవేశించే అవకాశం ఉండదన్నారు. దక్షిణ సూడాన్ పాస్‌పోర్ట్‌దారులకు అమెరికాలో ఉన్న ఏ వీసాలకు విలువలేదని చెప్పారు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. ఆఫ్రికా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని రూబియో చెప్పారు. దక్షిణ సూడాన్ ట్రంప్ పరిపాలనా విధానానికి సహకరించినప్పుడు మాత్రమే ఈ కఠిన నియమాలను సమీక్షిస్తామని ఆయన పేర్కొన్నారు.

## దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో అవసరం

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి

మొయినాబాద్, ఏప్రిల్ 06 (జనసాక్షి):



చలివేంద్రాల ఏర్పాటుతో పాదాచారులకు, వాహనాదారులకు ఎండాకాలంలో ఎంతో దాహార్తి తీర్చడం జరుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. ఆదివారం హిమాయత్నగర్ చౌరస్తాలో దాదూమందిర్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి పాల్గొని ప్రారంభించారు. ప్రయాణికులకు త్రాగునీరు అందించారు. ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. దాదూమందిర్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాల నుంచి హిమాయత్నగర్ చౌరస్తాలో ప్రతి సంవత్సరం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో వారిని అభినందించారు. ప్రజలు, వాహనాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ కంజర్ల భాస్కర్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, మాజీ సర్పంచ్ ముది గొండ రాజయ్య, దాదూమందిర్ సభ్యులు రాజేష్ దాదూ, గన్షామ్ లడ్డూ, పురుషోత్తం లడ్డూ, జైకుమార్ అగర్వాల్, కమల్ కిషోర్, నాగేష్తోయల్, వినోదాదూ, నాయకులు మల్లేష్యాదవ్, గిరిబాబు, కాళీదాస్ పాల్గొన్నారు.

# భార్యపై భర్త హత్యాయత్నం

- కొండాపూర్‌లో నడిరోడ్డుపై దారుణం..
- అపస్మరక స్థితిలో భాదిత గర్భిణి, ఆసుపత్రిలో చికిత్స
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 6 : గర్భవతిగా ఉన్న భార్యను ఆసుపత్రికి తీసుకు వచ్చిన ఓ భర్త బండరాయితో మోదీ హత్య చేసేందుకు యత్నించాడు. నడిరోడ్డు మీద భార్యపై దాడి చేసి దాదాపు పది నుంచి పదిహేను సార్లు బండరాయితో మోదడంతో తీవ్ర గాయాలపాలైన మహిళ చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య మీద క్రూరంగా దాడి చేసిన నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్‌కు చెందిన ఎండి బస్రత్ (32) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఇంటీరియర్ పనులు చేసుకుంటూ కుటుంబంతో కలిసి హాఫీజ్ పేట్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా 2023 జనవరిలో అజ్మీర్ దర్గాకు వెళ్లే క్రమంలో ప్రయాణంలో బస్రత్‌కు కోల్‌కతాకు చెందిన షబానా పర్వీన్(22) పరిచయం అయ్యింది. వీరి పరిచయం ప్రేమగా మారగా, 2024 అక్టోబర్‌లో పెళ్లి చేసుకున్నారు.

వివాహం అనంతరం ఇద్దరు హాఫీజ్ పేట్ ఆదిత్యనగర్‌లో కాపురం పెట్టగా, బస్రత్ ఇంటీరియర్ డిజైన్ పనులు చేస్తున్నాడు. పెళ్లి అనంతరం మొదట అత్తామామలతో కలిసి ఉండగా, కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. దీంతో బస్రత్, షబానా పర్వీన్‌లు స్థానికంగా వేరు కాపురం పెట్టారు. ప్రస్తుతం షబానా పర్వీన్ రెండు నెలల గర్భిణి కాగా, మార్చి 29వ తేదీన పర్వీన్‌కు వాంతులు కావడంతో కొండాపూర్ రాఘవేంద్రకాలనీలోని సియా లైఫ్ ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజులు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న తరువాత పర్వీన్‌ను ఏప్రిల్ 1వ తేదీన రాత్రి డిశ్చార్జ్ చేశారు. ఆసుపత్రి బయటకు రావడంతోనే, హాస్పిటల్ ముందే భార్యాభర్తలకు గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరుగడంతో బస్రత్ ఒక్కసారిగా తన భార్య పర్వీన్ మీద దాడికి తెగబడ్డాడు. నడిరోడ్డు మీద పెనుగులాటలో కిందపడిన భార్య మీద అక్కడే ఉన్న బండరాయితో దాడి చేశాడు. దాదాపు 10 నుంచి 12సార్లు రాయితో మోదడంతో పర్వీన్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లింది. చనిపోయిందని భావించిన బస్రత్ అక్కడి నుంచి పారిపోయాడు.

ఈ ఘటనను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న పర్వీన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా పర్వీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మియాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కోమాలో ఉన్న పర్వీన్ ప్రాణాలతో పోరాడుతుంది. పర్వీన్ కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడు బస్రత్‌ను ఈనెల 3వ తేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
07 ఏప్రిల్ 2025

# రేవంత్ ఓ రబ్బర్‌స్టాంప్ సీఎం

- మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీదే తుది నిర్ణయమని పీసీసీ చెప్పడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 06 (జనంసాక్షి) :** రేవంత్‌రెడ్డి ఓ రబ్బర్ స్టాంప్ సీఎం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం రోజు కరీంనగర్ లో విలేఖరుల సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సచివాలయం నుండి ఏఐసీసీ ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్ మంత్రుల కమిటీతో రివ్యూ చేయడమేందని ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణ విషయంలో ఏఐసీసీ అధిష్టానానిదే తుది నిర్ణయమని పీసీసీ అధ్యక్షులు చెప్పడం సిగ్గు చేటన్నారు. 'రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరుండాలి? ఎవరు వద్దు? ఎవరికి చోటు కల్పించాలనేది ముఖ్యమంత్రి విచక్షణాధికారం కానీ ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించడమేంది? సచివాలయంలో కాంగ్రెస్ నేత రివ్యూ చేయడమేంది? తెలంగాణలో పాలన భ్రష్టు పట్టిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?' అని మండిపడ్డారు. కేంద్ర సంక్షేమ పథకాలను పూర్తిగా తెలంగాణలో అమలు చేయడం లేదు. అన్ని రాష్ట్రాలను సమాన దృక్పథంతో చూస్తూ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం మోదీదే. రేషన్ షాపుల వద్ద ప్రజలకు ఇచ్చేది మోదీ బియ్యమే, కిలోకు రూ.37 లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం మోదీదే అని, సన్న బియ్యం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భరించేది రూ.10 లే అని అట్లాంటప్పుడు రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫోటో ఎందుకు పెట్టకూడదు?. రూ.10లకు కిలో సన్నబియ్యం ఎక్కడైనా వస్తాయా? ఆ విషయాన్ని తెలుసుకుని మంత్రులు, కాంగ్రెస్ నేతలు మాట్లాడితే మంచిదని, బీజేపీ కార్యకర్తలారా.. గ్రామగ్రామాన తిరిగి ప్రజలకు రేషన్ బియ్యం పై వాస్తవాలు వివరించండి. వడ్ల కొనుగోలు నుండి బియ్యం దాకా ప్రతిపైసా కేంద్రమే చెల్లిస్తోందని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి నిధులన్నీ ఎవరు చెల్లిస్తున్నారో చెప్పాలన్నారు. పాలనపై సీఎంకు పట్టులేకుండా పోయిందని హెచ్ సీయూ భూముల వ్యవహారమే ఇందుకు కారణమని కాంగ్రెస్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై మజ్లిస్ ను గెలిపించాలనుకుంటన్నయ్ అని హైదరాబాద్ ను మజ్లిస్ కు అప్పగించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయి. దేశ ద్రోహ పార్టీ మజ్లిస్, దేశభక్తి పార్టీ బీజేపీ, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దేశద్రోహ పార్టీకి, దేశభక్తి పార్టీకి మధ్య జరుగుతున్న ఎన్నికలని ఎవరి పక్షాన నిలబడి ఓటేస్తారో...హైదరాబాద్ కార్పొరేటర్లు, ఓటర్లు ఆలోచించాలని సిద్ధాంతం కోసం పనిచేసే బీజేపీ అభ్యర్థి గౌతంరావు గెలుస్తారనే నమ్మకం ఉందని బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నడో కుమ్మక్కైనయ్ అని, చెన్నయ్ లో డీలిమిటేషన్ మీటింగ్ కు రెండు పార్టీలు కలిసే హాజరైనయ్ అని వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రెండు పార్టీలు కలిసే ఓటేసినయ్ అన్నారు.

# నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక

- లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముమ్మరం
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం దృష్టి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున, ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఎంపిక ఉండేలా జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. మొదటి విడతలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి 71 వేల లబ్ధిదారులతో జాబితాను రూపొందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ గ్రామాన్ని వదిలేసి మిగతా గ్రామాల నుంచి ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాయి. పలు నియోజకవర్గాల్లో సంబంధిత జాబితాలు ఎమ్మెల్యేల చేతికి వెళ్లాయి. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల సూచనలను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకుంటూ, మొత్తంగా రెండు విడతల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందితో జాబితా రూపొందించారు. దాన్ని ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను ప్రకటించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూన్ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అప్పటిలోగా కనీసం పునాది, పిల్లర్ల వరకు నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. అలాగే లబ్ధిదారుల ఖాతాలో సంబంధిత సొమ్ము జమచేసేందుకు సర్కారు సిద్ధమవుతోంది. అందుకు అనుగుణంగా అధికారులు కూడా ఆ ప్రక్రియను వేగవంతం చేశారు.

**మళ్లీ విచారణ..**

మొదటి విడతలో మండలానికి ఒక గ్రామం చొప్పున 72 వేల మంది లబ్ధిదారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో చాలా మంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో 72 వేల మందికిగానూ, 42 వేల మందికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మంజూరు పత్రాలను ప్రభుత్వం జారీ చేసినట్లు తెలుస్తోంది. మిగతా 30 వేల మంది లబ్ధిదారులపై మళ్లీ విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెండో జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో జల్లెడ పట్టాలని జిల్లా అధికారులకు గృహ నిర్మాణశాఖ నుంచి ఆదేశాలు వెళ్లాయి. రెండు రోజుల క్రితం జరిగిన అంతర్గత సమావేశంలోనూ ఈ మేరకు గృహ నిర్మాణశాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గదర్శకం చేసి ఆ విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

# తెలంగాణకు ఎల్లో అలర్ట్

- ఏప్రిల్ 7, 8 తేదీల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి



హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణకు మరోసారి వర్ష సూచన చేసింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ నెల 7, 8 తేదీల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొన్నారు. కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ కూడా జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో పాట ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఏప్రిల్ 7వ తేదీన జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. ఈ జిల్లాల వాసులు వర్షం కారణంగా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఏప్రిల్ 8వ తేదీన జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హన్మకొండ, జనగామ, సిద్ధిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి అని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం పొడి వాతావరణం ఉంటుందని తెలిపింది వాతావరణ శాఖ పేర్కొంది. ఇటీవల తెలంగాణలోని చాలా జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భూమి వేడెక్కడం, ద్రోణి ప్రభావంతో క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది.క్యుములో నింబస్ మేఘాల వల్ల వడగండ్ల వానలు కూడా పడవచ్చని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఎస్ఎల్‌బీసీలో ఇంకా కొనసాగుతున్న ఆపరేషన్



**నాగర్‌కర్నూల్ (జనంసాక్షి) :** శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పైకప్పు కుప్పకూలిన ఘటన తాలుకా రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో పొక్లెయిన్స్ తో ఆయా విభాగాల సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 22వ తేదీన జరిగిన ఈ ఘటన ఎనిమిది కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. టన్నెల్ లో చిక్కుకుపోయిన వారు అందులోనే సమాధి అయిపోయిన ఘటన వారి కుటుంబాలలో తీరని ఆవేదనకు కారణమైంది. ఎస్ఎల్ బీసీ టన్నెల్ లో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్ ఇప్పటివరకు ఒక ఇద్దరు మృతదేహాలు లభ్యం కాగా ఇంకా ఆరుగురి మృతదేహాల కోసం ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. అయితే ఈ రెస్క్యూ ఆపరేషన్ త్వరగా కొనసాగించడం కోసం టన్నెల్ లో సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం రోబోలను రంగంలోకి దించింది. రోబోల అనుసంధానంతో మట్టిని తొలగించేందుకు టన్నెల్లోకి పంపించిన యంత్రం సరిగ్గా పనిచేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మూడురోజుల పాటు ప్రయత్నం చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో రోబోల పనితీరు నిలిచిపోయింది. రోబోలతో నో యూజ్ మూడు రోజులపాటు ప్రయత్నాల తర్వాత రోబోలతో ఫలితం లేదని భావించిన అధికారులు యంత్రాన్ని బయటకు పంపించారు. ప్రస్తుతం మాన్యువల్ గా పొక్లెయిన్స్ తో సిబ్బంది సహాయక చర్యలలో పాల్గొంటున్నారు. మట్టిలో చిక్కుకున్న ఆరుగురి అవశేషాలను గుర్తించడమే లక్ష్యంగా సహాయక చర్యలు జరుగుతున్నాయని వారు చెప్తున్నారు. ఇక మట్టిని రాళ్లను తొలగించేందుకు అధునాతన పద్ధతులతో ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. అక్కడ నిషేధిత ప్రాంతం టన్నెల్ లోపల 13.936 కి.మీ డీ1 వద్ద దాదాపు 20 మీటర్ల వరకు సిబ్బంది వెళ్లడానికి అవకాశం లేనటువంటి నిషేధిత ప్రాంతంగా గుర్తించారు. ఆ ప్రాంతంలో సిబ్బంది వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని దానిని నిషేధిత ప్రాంతంగా వెల్లడించారు. ప్రస్తుతం ఎన్డిఆర్ఎఫ్, ఎస్డీఆర్ ఎఫ్, హైడ్రా, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ తో పాటు మరో ఆరు విభాగాలు సహాయక చర్యలలో పాల్గొంటూనే ఉన్నాయి.

## డెహ్రాడూన్ మీటింగ్‌కు మంత్రులు సీతక్క, పొన్నం

- 'చింతన్ శిబిర్' సమావేశం కోసం హాజరు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో డెహ్రాడూన్ లో నిర్వహించనున్న చింతన్ శిబిర్ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొననున్నారు. మంత్రులిద్దరూ ఆదివారం మధ్యాహ్నం డెహ్రాడూన్ కు బయల్దేరి వెళ్లనున్నారు. ఈ మీటింగ్‌కు అన్ని రాష్ట్రాల వెల్ఫేర్ మినిస్టర్లు హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషి, అమలవుతున్న పథకాలు తదితర అంశాలపై మంత్రి సీతక్క ప్రసంగించనున్నారు. సామాజిక న్యాయ సాధనలో, ఆయా వర్గాల సాధికారతలో కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని సీతక్క కోరనున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న చింతన్ శిబిర్ లో రాష్ట్రంలో బీసీ సంక్షేమశాఖ అమలు చేస్తున్న పథకాలు, కుల గణన, బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగిస్తారని మినిస్టర్ కార్యాలయం వెల్లడించింది. ఈ చింతన్ శిబిర్ లో వివిధ వర్గాల సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలను రాష్ట్రాలు, కేంద్రం కలిసి పని చేసే అంశంపై చర్చించనున్నారు.

## కరాటే కల్యాణి, తమన్నా సింహాద్రికి నటి హేమ లీగల్ నోటీసులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నటి కరాటే కల్యాణి, తమన్నా సింహాద్రికి నటి హేమ లీగల్ నోటీసులు పంపారు. గతంలో తన పరువు, ప్రతిష్టను భంగం కలిగించారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు హేమ లీగల్ నోటీసులు పంపారు. "లాస్ట్ టైమ్ నేను ఓ ఇష్యూలో ఉన్నా. నాపై బురద చల్లే ప్రయత్నం చేశారు. దానిపై నేను న్యాయస్థానాన్ని ఆశ్రయించా. నా పరువుకు నష్టం కలిగింది. ఇందులో భాగంగా నోటీసులు ఇచ్చా. మాటల్లో కాకుండా ఈసారి న్యాయస్థానానికి వెళ్లా. సినిమా వాళ్లను చాలా తేలిగ్గా తీసిపారేస్తున్నారు. నాలా మరొకరికి జరగకుండా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నా. ఇంకా కొంతమంది అడ్రస్‌లు తెలియలేదు. నాపై మీడియాలోనే అసభ్యంగా మాట్లాడారు. మా వ్యక్తిగత జీవితాలపై నోరుంది కదా అని మాట్లాడకూడదు. నిజాలైనా మాట్లాకూడదు. అలాంటిది చాలా ఈజీగా అబద్ధాలు చెప్పేశారు. నాపై వ్యక్తిగతంగా అసభ్యంగా మాట్లాడారు. ఆ వీడియోలన్నీ నెట్‌లో కొడితే వస్తున్నాయి. నేను తప్పు చేయకుండా బ్లేమ్ అయ్యా. ఇలాంటి వాటి నుంచి బయట పడేందుకే లీగల్ నోటీసులు ఇస్తున్నా." అని నటి హేమ తెలిపారు.



## పురి విప్పి.. నాట్యమాడి..

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం కాస్త చల్లబడి కనిపిస్తుంది. దీంతో అడవిలో నివసిస్తున్న జంతువులకు కొంత ఉపశమనం లభించింది. జిల్లాలోని ఓ అటవీ ప్రాంతంలో నెమలి పురి విప్పి ఆనందంతో నాట్యమాడుతున్నట్లు కనిపించిన ఈ అద్భుతమైన దృశ్యాన్ని జిల్లాకు చెందిన వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆదివారం ఉదయం తన కెమెరాలో బంధించాడు.

# నిరుపేద ఇంట ముఖ్యమంత్రి భోజనం





**బూర్గంపహాడ్ ఏప్రిల్ 06 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం తాళ్లగుమ్మూరు గ్రామం గిరిజన తెగకు చెందిన నిరుపేద ఇంట బోరం శ్రీను అనే లబ్ధిదారునికి అందించే సన్నబియ్యంతో విందు భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్రం మొత్తం పూర్తిస్థాయిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న అనంతరం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ, మార్కెటింగ్ చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులు, కుటుంబ సభ్యులతో కలిసి సారపాక లోని తాళ్ల గొమ్మురు గ్రామంలోని నాయక్పొడు బూరం శ్రీనివాస్ ఇంట్లో సన్న బియ్యంతో తయారుచేసిన వంటకాలతో విందు ఆరగించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా తన ఇంటికి భోజనానికి తెలంగాణ రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రి రావడంతో ఆ కుటుంబానికి, ఆ గ్రామంలోని ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తమ గ్రామంలోని నిరుపేదలైన గిరిజన కుటుంబంలో భోజనం చేయడానికి వచ్చిన ఆయనకు సన్న బియ్యం తో పాటు పాయసం, పులిహోర, సేంద్రీయ ఎరువులతో పండించిన తోటకూర పప్పు, గోంగూర చట్నీ, బెల్లం పానకం, వడపప్పు, ఇతర ఆహార పదార్థాలను వడ్డించారు. ముఖ్యమంత్రి సంతోషంగా తనివి తీర భోజనము చేసిన తర్వాత కుటుంబ సభ్యులను అభినందించి ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఆహార భద్రత కల్పించేలా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఉగాది పండుగ నుంచి ప్రారంభించామని, సన్న బియ్యం పంపిణీ వలన ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని, చరిత్రరాత్మకమైన ఘట్టంలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నామని, 80 శాతానికి పైచిలుకు బడుగు బలహీన, దళిత, గిరిజన, మైనార్టీ నిరుపేద ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. అనంతరం బూరం శ్రీనివాసరావు తల్లి శంకరమ్మ తన భర్త జిసిసి సేల్స్ మెన్ గా పనిచేసే 2015లో పదవి విరమణ పొందాడని, తన కుమారుడు ఎంఎ బీఈడీ వరకు చదువుకొని కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, తన కూతురు చిన్నప్పటినుండే మానసికంగా, కనుచూపు లేక చాలా అవస్థలు పడుతున్నామని సీఎం దృష్టికి తీసుకురాగా వారి కుటుంబానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, తాసిల్దార్ ముజాహిద్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370